


మార్క్సిస్టు సిద్ధాంత కర్త, శ్రామికవర్గ విప్లవకారుడు కామ్రేడ్ ఫ్రెడ్రిక్ ఏంగెల్స్ ద్విశత జయంతి (28 నవంబర్ 1820) సందర్భంగా అరుణారుణ జోహార్లు!


# న్యూడెమోక్రసీ
బులెటిన్

2020 ఆగస్టు | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ | సంపాదకుడు : వై.సాంబశివరావు


## కార్మిక చట్టాలు, సంక్షేమాలతోపాటు కార్మికవర్గంలోని ఆఖరి ఆశలకూ పాతర వేస్తున్న కాలంలో

# నవంబర్ 26న జరిగే 19వ సార్వత్రిక సమ్మెకు నడుంబిగిద్దాం!

ఒకవైపు నూటా ముప్పై కోట్ల మంది దేశ ప్రజలు కరోనా కారణంగా ఉపాధి కోల్పోయి, బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నారు. మరోవైపు ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమాలను గాలికి వదిలేసి, బడా కార్పొరేట్ వర్గాల సేవలో మునిగిపోయాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, కరోనా వ్యాధి, ఆచరణలో ప్రజలకు రాజకీయశాపంగా, శ్రమదోపిడీ వ్యవస్థకు రాజకీయ వరంగా మారింది. కొత్త రాజకీయ పరిస్థితికి ఈ తాజా నూతన రాజకీయ పరిస్థితి కార్మికవర్గం మీద సహజంగానే నూతన కర్తవ్య భారాన్ని మోపింది. దాన్ని నిర్వర్తించడానికి కార్మికవర్గం చేతుల్లో రాజకీయ సాధనాలున్నాయి. అందులో ఒకటి తే.26-11-2020న జరుగనున్న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె!

భారత కార్మికవర్గానికి సార్వత్రిక సమ్మెలు కొత్త కాదు. నెహ్రూ కాలం నుంచి ఏడు దశాబ్దాల సమ్మెల సంగతి పక్కకు పెడదాం. 1991 నుంచి నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా ఇప్పటి వరకూ మొత్తం 18 సార్లు సార్వత్రిక సమ్మెలు జరిగాయి. వాటికి పూర్తిగా భిన్నమైన పరిస్థితిలో తే.26-11-2020న 19వ సార్వత్రిక సమ్మె జరగబోతోంది.

1947 నుండి 1991 వరకూ కార్మిక చట్టాలనూ కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని కోరుతూ భారత కార్మికవర్గం పోరాడింది. అది మొదటి దశ. 1991 నుండి కార్మిక చట్టాలను నీరుగార్చే ప్రభుత్వాల విధానాలపై పోరాడిన రెండవ దశ సాగింది. కనీసం పాత కార్మిక చట్టాలనైనా పరిరక్షించాలనీ, పాత జీవన పరిస్థితులనైనా కొనసాగించనివ్వాలనీ అది ఈ రెండో దశలో పోరాడింది. ఇప్పుడు కరోనా కాలంలో మోడీ - షా ప్రభుత్వం ఏకంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసింది. వాటి స్థానంలో నాలుక గీచుకోవడానికి కూడా పనికి రాని 4 లేబర్ కోడ్‌లను తెచ్చింది. (ఇందులో ఒక్క వేజ్ కోడ్‌ను మాత్రం కరోనాకి ముందు తెచ్చింది). కార్మిక చట్టాలను దిష్టిబొమ్మలుగా దిగజార్చుతున్న కాలంలో గత 18 సమ్మెలు జరిగితే, ఆ దిష్టిబొమ్మను కూడా ఎత్తి వేసిన విధానం మీద రేపటి 19వ సమ్మె జరగబోతోంది. అందుకే మునుపటి సమ్మెలన్నింటికంటే భిన్నమైన రాజకీయ పరిస్థితిలో ఈ సమ్మె జరుగుతోంది.

కరోనా కష్టకాలంలో సుమారు 15 కోట్ల మంది వలస కార్మికుల అగచాట్లు చూశాము. మరో ముప్పై కోట్లమంది అసంఘటిత రంగ కార్మికులకు ఉపాధిని కోల్పోయిన దుస్థితిని చూశాము. ముఖ్యంగా కోట్లాది మంది భవన, ఇతర నిర్మాణ (బి.ఓ.సి) కార్మికుల దుస్థితిని చూశాము. వారి నోటికాడి కూడును లాగేసుకునే దుర్మార్గ చర్యలను చూస్తున్నాము. రోడ్ల భద్రత పేరిట కోట్లాది మంది ఆటో, లారీ, ట్రక్కు వంటి మోటారు కార్మికుల ఉసురు తీస్తున్న పాలకుల దుష్ట విధానాలను చూస్తున్నాం. కిరాయిలను సైతం కోల్పోయిన ఆటో కార్మికులపై బండెడు పెనాల్టీల భారాన్ని వేసే జీవో.నెం.21ని చూస్తున్నాం . ఎలాంటి చట్టబద్ధ హక్కులు లేని హమాలీ, ముఠా, కళాసీ, కార్మికుల బ్రతుకుల్ని చూస్తున్నాం. ఇంకా షాప్ ఎంప్లాయిస్, క్వారీ, క్రషర్స్, సిగార్, బీడీ, ప్లైవుడ్, గ్యాస్ వంటి రంగాల కార్మికుల

( మిగతాది 2వ పేజీలో )

## మోడీ ప్రభుత్వ కార్మిక - రైతాంగ వ్యతిరేక విధానాలపై ఉద్యమించండి!

## 2020 నవంబర్ 26, 27 తేదీలలో దేశవ్యాప్త కార్మికుల, రైతుల సమ్మెలను జయప్రదం చేయండి!

కేంద్రంలో మోడీ నాయకత్వంలోని ఆర్.ఎస్.ఎస్-బీజేపీ ప్రభుత్వం, రైతు వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాలను, విద్యుత్ బిల్లును ముందుకు తెచ్చింది. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 400లకు పైగా రైతు సంఘాల ఆధ్వర్యంలో చారిత్రాత్మకమైన విశాల ఐక్య ఉద్యమం ప్రారంభం అయింది. ఈ చట్టాలు విరమించుకోవాలనే ఉద్యమం పంజాబ్ రాష్ట్రంలో 29 రాష్ట్ర స్థాయి రైతు సంఘాలు ఉమ్మడిగా రాస్తారోకోలు, రైలురోకోలు నిర్వహించాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి మద్దతుగా నిలిచింది. అయితే కేంద్రం గోధుమ పంటకు అవసరమైన ఎరువులు ఇతర సరుకుల రవాణా నిలిపివేసింది. ఎండు గడ్డి కాల్చితే డిల్లీలో కాలుష్యం అనే నెపంతో ఒక రైతుపై కోటిరూపాయల పెనాల్టీ విధించారు.

నవంబర్ 26, 27 లలో ఛలో డిల్లీకి తరలి రాకుండా అటంకాలు కలుగ జేస్తున్నారు. రైతు పోరాటానికి మద్దతుగా, రాజ్యనిర్బందానికి వ్యతిరేకంగా సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ పంజాబ్ రాష్ట్ర కమిటీ నవంబరు 17న జలంధర్ లోని కామాగాటు మారు యాద్గార్ సంఘటన్ భవనంలో భారీ సభను నిర్వహించింది. పంజాబ్, హర్యానా రైతాంగ ఉద్యమంపై కేంద్రం నిర్బంధం ప్రయోగించడాన్ని ఏ.ఐ.కె.ఎస్.సి.సి ఖండించి, రైతాంగానికి పూర్తి మద్దతు తెలిపింది రైతు సంఘాలతో కేంద్రం చర్చలు జరిపి కొంత వెనక్కి తగ్గింది. అయినప్పటికీ ఛలో డిల్లీ ఆందోళనకి అడుగడుగునా అటంకాలు కలుగ జేస్తున్నది. దీనితో మరింత పట్టుదలగా వేలాది మంది రైతాంగం టాక్టర్లలో ఢిల్లీ ర్యాలీకి బయలుదేరిన వార్తలు వస్తున్నాయి. చట్టాలు రద్దు అయ్యేవరకు ఢిల్లీలో నిరసన దీక్షలు కొనసాగించడానికే రైతాంగం సన్నద్ధమవుతున్నారు.

అలాగే కేంద్ర కార్మిక సంఘాలు మోడీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నవబర్ 26న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి.

అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య ఛల్లో డిల్లీ నవంబరు 26, 27 పిలుపు, సార్వత్రిక సమ్మెకు మద్దతుగా స్థానికంగా భాగాస్వామ్య సంఘాలతో, పార్టీలతో కలిసి కార్యక్రమాలు చేపట్టమని పిలుపునిస్తున్నాం.

**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ**
**ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ**

## నవంబర్ 7 : రష్యన్ అక్టోబర్ బోల్షివిక్ విప్లవ పతాకాన్ని సమున్నతంగా నిలబెడదాం!

(మొదటి పేజీ తరువాయి)

దుర్భర స్థితిగతుల్ని చూస్తున్నాం. కరోనా కాలంలో సైతం రైల్వే, ఇస్రో, డిఫెన్స్ రంగాల ప్రైవేటీకరణను చూస్తున్నాం. 175 ఏళ్ళ చరిత్ర గల పర్యావరణ అనుకూల పురాతన జూటు పరిశ్రమను బలి పెడుతున్న విధానాలను చూస్తున్నాం. ఎన్నేళ్ళు గడిచినా ఎదుగుబొదుగూ లేని కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్, యన్.యం.ఆర్ కార్మికుల బ్రతుకుల్ని చూస్తున్నాం. ఈ అందరికీ కనీసవేతనాలు లేకపోయినా కనీసం నాసిరకం జీతాలు లేదా వేతనాలున్నాయి. కానీ అసలు వేతన వ్యవస్థే అమలులో లేని ప్రభుత్వ స్కీమ్ వర్కర్ల సంగతి సరేసరి ! వేతనాలకు బదులు 'పారితోషికం' లేదా 'గౌరవ భృతి' పేరిట అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వెలుగు వంటి కార్మిక వ్యవస్థలను కొనసాగించడం ఘోరాతి ఘోరమైనది. ఈ అన్నింటిపై భారత కార్మికవర్గం ఒకవైపు పోరాడుతుండగా మరో వైపు ఇప్పుడు దిష్టిబొమ్మలుగా మిగిలిపోయిన కార్మిక చట్టాలనూ, కార్మిక సంక్షేమ విధానాలనూ ఎత్తివేయడానికి ప్రభుత్వాలు కరోనా కాలంలో దిగాయి. ఇంత వరకూ కార్మిక చట్టాల అమలు పట్ల కార్మికవర్గంలో ఎన్నో కొన్ని ఆశలు మిగిలి వున్నాయి. తమపట్ల ప్రభుత్వాలు సంక్షేమ విధానాలను అవలంభిస్తాయనే భ్రమలు కూడా వున్నాయి. అసంఘటిత రంగ కార్మికవర్గానికి సమగ్ర సంక్షేమ చట్టాలను తెస్తాయనే ఆశలో, భ్రమలో వున్నాయి. హమాలీ మోటారు రంగాలకు సంక్షేమ బోర్డులను తెచ్చి తమకు మేలు చేస్తాయనే ఆశలు లేదా భ్రమలు పాలకవర్గాల పట్ల కార్మికవర్గంలో ఏదో మేరకు మిగిలివున్నాయి. కానీ కుహనా బి.ఓ.సి సంక్షేమ బోర్డులతో సహా 70 ఏళ్ళ కార్మిక చట్టాలను ఎత్తివేస్తున్న కాలమిది. ఇక కార్మికవర్గం ఆశలకే భౌతిక ప్రాతిపాదికను లేకుండా తొలగిస్తున్న నేటి కాలమిది. అందుకే అనివార్యంగా భ్రమలకూ, ఆశలకూ తావులేని సమరశీల సమైక్య, సమిష్టి కార్మికవర్గ పోరాటాలకు పాదార్థిక పునాదినీ, భౌతిక ప్రాతిపదికనూ కల్పిస్తోంది. ఇది ఫాసిస్టు ప్రమాదం ముంచుకొస్తున్న కాలమిది. అందుకే నూతన రాజకీయ పరిస్థితిలో నూతన పంథాలో సమరశీల పోరాటాలకు కార్మికవర్గాన్ని సిద్ధం చేయడం నేటి తక్షణ రాజకీయ కర్తవ్యం. ఇదే రేపటి 19వ సార్వత్రిక సమ్మె విశిష్టత !

ఈ ఫాసిస్టు తరహా దాడి కేవలం కార్మికవర్గానికే పరిమితం కాదు. మూడు వ్యవసాయ చట్టాలు, విద్యుత్ వినియోగ చట్టం, నూతన విద్యావిధానం, పట్టణ సంస్కరణల చట్టం వంటి ప్రజా వ్యతిరేక బిల్లులను కూడా కరోనా కాలంలోనే చట్టాలను చేసింది. దేశ రైతాంగం కూడా సమరశీల పోరాటాలకు సిద్ధమవుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల డి.ఎ, పెన్షన్ల మీద కూడా దాడికి దిగాయి. ముఖ్యంగా పంజాబ్, హర్యానాలలో లక్షలాది రైతాంగం ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని స్థంభింపజేస్తోంది. యు.పిలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగుల పోరాట విజయం మంచి పరిణామం. సరిగ్గా రేపటి కార్మికవర్గ సార్వత్రిక సమ్మె సమయలోనే అఖిల భారత రైతాంగ పోరాట సమన్వయ కమిటీ (ఎ.ఐ.కె.ఎస్.సి.సి.) ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ, భారీ ప్రదర్శన వుంది. ఒకేరోజు దేశంలో కార్మిక-కర్షక పోరాట పిలుపుగా మారడం చరిత్రలో అరుదైన సందర్భం. ఏక కాలంలో ఒకవైపు కార్మికవర్గం, మరోవైపు రైతాంగం సమరశీల పోరాటాలు చేపట్టాల్సిన ప్రత్యేక పరిస్థితి ఏర్పడింది. ఈ నేపధ్యంలో రేపటి 19వ సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం నడుంబిగిద్దాం. కార్మికవర్గం సమైక్యశక్తిగా సమరశీల పంథాలో పోరాడితే నేటి నిరంకుశ ప్రభుత్వాలు చిత్తుగాక తప్పదని గత చరిత్ర నేర్పుతున్నది. అట్టి విశ్వాసాన్ని కార్మికవర్గంలో కలిగించి సమరశీల, సమైక్య పోరాటాలకు సిద్ధంచేసే లక్ష్యంతో రేపటి సమ్మెను విజయవంతం చేద్దాం. **- ఐ.ఎఫ్.టి.యు - ఏ.పి రాష్ట్ర కమిటీ**

## ప్రజా గాయకుడు, కళాకారుడు కామ్రేడ్ పైలం సంతోష్‌కి విప్లవ జోహార్లు!




ప్రజా గాయకుడు, కళాకారుడు కా॥ పైలం సంతోష్ (43) తే.22-11-2020న అనారోగ్యంతో మృతి చెందాడు. సంతోష్ ఉద్యమాల ఖిల్లా నల్గొండ జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో ఒక నిరుపేద దళిత కుటుంబంలో జన్మించాడు. 15 ఏళ్ళ వయస్సులోనే ఆట, పాట నేర్చుకున్నాడు. 8వ తరగతి చదువుతున్నప్పుడే వెలిదండలో జరిగిన సారా వ్యతిరేక పోరాటం, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, కూలీ పెంపుదల పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. సుబ్బారావు, పాణిగ్రాహి, చెరబండరాజు వంటి విప్లవ కవుల స్ఫూర్తితో వారి పాటలు, రచనలకు ప్రభావితుడై అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో చేరి జిల్లా కార్యదర్శి స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఎదిగాడు. సంతోష్ గల్లీ నుంచి ఢిల్లీ వరకు 500కు పైగా ప్రదర్శనలు ఇచ్చాడు. వందల కొద్ది పాటలను రచించి గానం చేసాడు.

ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడు. సంతోష్ తన గళంతో " పైలం, రేలపాట, తెలంగాణా దండయాత్ర, పల్లెగోస, తెలంగాణా దండు, లడాయి " వంటి ఆడియో, వీడియో ఆల్బమ్‌లను తీసుకొచ్చాడు. అలాగే పుస్తకాల రూపంలో పాటల ఊట, కరువు బతుకులు, ప్రపంచ బ్యాంకు ఉరితాళ్ళు వంటి రచనలను వెలువరించాడు. కా॥ పైలం సంతోష్ మరణం విప్లవ సాంస్కృతికోద్యమానికి తీరని లోటు. ఆ కామ్రేడ్‌కి విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబానికి తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నాం.

**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రఆం.ప్ర. రాష్ట్ర కమిటీ**

## ప్రజాకవి దేవిప్రియకి విప్లవ జోహార్లు!



ప్రముఖ ప్రజాకవి దేవిప్రియ (71) తే.21-11-20న మరణించారు. ఆయన జీవిత సహచరి రాజ్యలక్ష్మి ఐదేండ్ల క్రితం చనిపోయిన నాటి నుండి ఎంతో మనోవ్యధను భరించారు. హఠాత్తుగా జబ్బుపడి హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు.

ఆయన గుంటూరు జిల్లా తాడికొండలో జన్మించారు. గుంటూరు ఏసి కాలేజ్‌లో చదువుకొంటున్నప్పుడే దిగంబర కవుల ప్రభావంతో గుంటూరు కేంద్రంగా 1970ల ప్రాంతంలో ఏర్పడిన 'పైగంబర' కవుల బృందంలో చేరారు. విప్లవ సాహిత్యాన్ని అధ్యయనం చేసి అనేక రచనలు చేసారు. 'అమ్మచెట్టు', 'నీటిపుట్ట', 'చేప చిలుక', 'తుఫాన్ తుమ్మెద', 'అరణ్యపర్వం' వంటి కవితా సంపుటలను వెలువరించారు. జర్నలిస్టుగా 'ప్రజా వాహిని', 'నిర్మల', 'జ్యోతి', 'మనోరమ' 'హైద్రాబద్ టైమ్స్', 'ఉదయం' పత్రికలో పనిచేసారు. దాసి, రంగులకల లాంటి అభ్యుదయ సినిమాలకు పాటలను రచించారు.

హైద్రాబాద్ నుండి వెలువడిన 'ప్రజాతంత్ర' పత్రికకు ఎడిటర్‌గా వున్నారు. శ్రీశ్రీ ఆత్మకథ 'అనంతం' ధారావాహికగా ప్రచురించారు. ఏ వామపక్ష సాహిత్య సంఘాలలో సభ్యుడుగా లేకున్నా, నిరంతరం వామపక్ష భావజాలంతోనే రచనా వ్యాసాంగం సాగించారు. కులతత్వం, మతతత్వంలను తీవ్రంగా నిరశించేవారు. తన రచనలలో లౌకికతత్వాన్ని ప్రభోదించేవారు. వామపక్ష, విప్లవాభిమానిగా పీడిత ప్రజల పక్షపాతిగా తన సాహిత్య సృష్టి సాగించారు.

ప్రజాకవి దేవిప్రియకు విప్లవ జోహార్లు తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నాం.


**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ఆం.ప్ర. రాష్ట్ర కమిటీ**

## కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 3 వ్యవసాయ చట్టాలు, విద్యుత్ సంస్కరణల బిల్లులను రద్దుచేయాలని పంజాబు, హర్యానాలలోని రైతాంగం సాగిస్తున్న ఆందోళనోద్యమానికి మద్దతుగా సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, పంజాబు రాష్ట్ర కమిటీ నిర్వహించిన సభ





## నిరంతర అధ్యయనశీలి, వామపక్ష మేధావి జాన్ మిర్డాల్‌కి విప్లవ జోహార్లు!



తే.30-10-2020 అంటే భారత దేశంలో అక్టోబర్ 31 అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటంలో తొలి అమరవీరులు కోరన్న మంగన్నలు భూస్వాముల కాల్పులలో అమరులైన రోజు అది. అక్టోబరు 31 నుండి నవంబరు 9 వరకు అమరవీరులను స్మరించుకునే కార్యక్రమం ప్రారంభమైన రోజునే ‘ జాన్ మిర్డాల్ ’ మరణవార్త తెలియడం విచారకరం.

జాన్ మిర్డాల్ ఉత్తర యూరప్‌లోని స్కాండినేవియా దేశాలకు చెందిన స్వీడన్ రాజదాని స్టాక్ హెూంలో తే.19 జూలై 1927న కార్ల గున్నార్, ఆల్వా మీర్డాల్ దంపతులకు జన్మించారు. తల్లి తండ్రి ఇద్దరు నోబుల్ ఆవార్డ గ్రహీతలు. గున్నార్ మిర్డాల్ ఆర్ధిక వేత్త, సోషియాలజిస్ట్, భార్య ఆల్వా మీర్డాల్ సోషియాలజిస్టు. దౌత్య వేత్త, రాజకీయ వేత్త. గున్నార్ మిర్డాల్ దారిద్ర్యం, వివక్షతల పైన ఉపన్యాసాలు, రచనలు చేసారు. ఆసియన్ డ్రామా, అమెరికాలో నీగ్రోల పరిస్థితిపైన, ప్రజల ఆర్ధిక పరిస్థితి దేశాల జీడిపీలో కనబడని విశ్లేషణలు చేసాడు. ఇండియాలో 1969లో గాంధీ శతజయంతికి స్పీకర్‌గా హాజరై, ‘ గాంధీ రాడికల్ లిబరలిస్టు ’ అన్నారు.

వారి కుమారుడైన జాన్ మిర్డాల్ మరో అడుగు ముందుకు వేసి ప్రపంచ పీడిత ప్రజల విముక్తి పోరాటాలను బలపరిచాడు. వియత్నాంపై అమెరికా అదిపత్యదాడికి వ్యతిరేకంగా స్వీడన్ ఆందోళనలు చేపట్టారు. పాలస్తీనా-ఇజ్రాయెల్ మధ్య వివాదంలో పాలస్తీనాను బలపరిచారు. రష్యా-చైనా సైద్ధాంతిక వివాదంలో చైనాను బలబరిచారు. మూడువ ప్రపంచ దేశాలపై సామ్రాజ్యవాదుల దాడులను వ్యతిరేకించాడు. వలసాధిపత్యాన్ని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాడు. మార్క్సిస్టు-లెనినస్టు దృష్టితో మావో ప్రాపంచిక దృష్టిని బలపర్చి మావోవాదిగా పీడత ప్రజల, ఆదివాసీ పోరాట వాణి అయ్యాడు. సామ్రాజ్యవాదుల కార్పొరేట్ కల్చర్‌కి వ్యతిరేకంగా ప్రజా సంస్కృతిని పలపరిచాడు.

భారతదేశంలో 1977 అత్యయక పరిస్థితి ఎత్తివేసిన తరువాత జరిగిన జనరల్ ఎన్నికల్లో ఇందిరాగాంధి ఓడిపోయింది. ప్రజాస్వామిక చైతన్యం వెల్లువిరిసింది. నిర్బంధకాలం నాటి ఘోర రాజ్యహింసా సంఘటనలు బహిరంగంగా వెళ్ళడైనవి. ఈ కాలంలో ప్రజాఉద్యమాలు, రైతు కూలీ ఉద్యమాలు ముందుకు వచ్చాయి. ఈ కాలంలోనే స్వీడన్ దేశ ప్రగతిశీల రచయిత జాన్ మీర్డాల్ మరోసారి 1979లో భారత దేశానికి వచ్చి వివిధ ప్రాంతాలు తిరిగారు. ఇందులో భాగంగానే కల్లోలిత ప్రాంతాలు, దానికి గల కారణాలు శోధించుతూ ఆదివాసి, రైతు కూలీ ఉద్యమ ప్రాంతాలైన అడవి, గ్రామీణ ప్రాంతాల్లో తాను, కూతురు, భార్యతో కలిసి 15 రోజులు తిరిగినట్లు తాను వ్రాసిన ***“ ఇండియా వెయిట్స్ ”*** పుస్తకంలో పేర్కొన్నారు. ఇది 1980 చివర్లో అమెరికాలో విడుదలైంది. కానీ, 1986లో ముందుమాటతో ఉన్న పుస్తకం మార్కెట్‌లో లభిస్తున్నది. ఆనాటికి తన వయస్సు 53 సంవత్సరాలు. 40 సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో కొయ్యలగూడెం ద్వారా టూరిస్టు టూరులో భాగంగా అడవిలోని దళాలను తను కూతురు, భార్యతో కలిసారు. అమరులు రవన్న, ధర్మన్నలను కలిసి నాడు ఇంటర్వ్యూ చేసారు. అలాగే ఇల్లెందు ఏరియాలో పందిపంపులలో అమరుడు కా॥ దొరన్నను కలిసి ఇంటర్వ్యూ చేసారు. అలాగే సిరిసిల్ల జగిత్యాల గ్రామాల్లో తిరిగి భూస్వామ్య వ్యతిరేక పోరాటంలోని ప్రజలను, దాని నాయకులను కలిసి ఇంటర్వ్యూలు తీసికొన్నారు. పోరాటాలలో వివిధ ధోరణులను గమనించారు.

తిరిగి 2014లో తన 88వ ఏట దండకారణ్యంలోని ఉద్యమ ప్రాంతాలు తిరిగి ***“ రెడ్ స్టార్ ఓవర్ ఇండియా ”*** పుస్తకం వ్రాసారు. తదుపరి భారత ప్రభుత్వం ఇండియాకి రాకుండా తనపై అభ్యంతరాలు లేవనెత్తి స్వీడన్ ప్రభుత్వంకి తెలిపింది. ఆనాటికే ఇండియాలో తన ‘ప్రగతిశీల’ పర్యటన పరిశోధనా ఫలితాలు కూడా ప్రపంచానికి అందిచారు. జాన్ మీర్డాల్ తను, తన భార్య, కూతురు అడవి, మైదానాలలో పోరు ప్రజలను కలిసారు. కళాకారులను, దిగంబర కవులెవరని అడిగి మరీ తెలుసుకొని కలుసుకున్నారు.

ఆయన జీవితం, ఆచరణ, రచనల గురించి ప్రతి ఒక్కరు శ్రద్ధగా అద్యయనం చేయవలసి ఉన్నది. తన గురించి ఏమాత్రం గ్రహించినా తెలియ కుండానే విశ్వ మానవుడనే అభిప్రాయం కలుగుతుంది. మనిషికి మనిషి సహకారంలో గ్లోబలీకరణ జరగాలి. కానీ ఆధిపత్యం, దోపిడీలో కాదనేది గ్రహించాలి.

*కామ్రేడ్ జాన్ మిర్ధాల్‌కి జోహార్లు!*

**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ - ఆంధ్రప్రదేశ్,**

## ఏలూరు జ్యూట్ కార్మికోద్యమంలో కీలక పాత్రధారి ఎన్.వి.నారాయణకు విప్లవ జోహార్లు!

ఏలూరు జ్యూట్ కార్మికోద్యమంలో కీలక పాత్రధారి నెరుసు వెంకట నారాయణ తే.17-11-2020న రాత్రి 9-30కు క్యాన్సర్ పేషంట్ గా 60వ ఏట మృతి చెందాడు. ఎన్.వి.నారాయణ 1980 దశాబ్దంలో ఏలూరు జ్యూట్ మిల్లు యువ కార్మికుడిగా ఐ.ఎఫ్.టి.యులో చేరాడు. 1982లో నెల్లూరులో జరిగిన ఇఫ్టూ రెండవ రాష్ట్ర మహాసభ ప్రతినిధిగా హాజరయ్యాడు. దానికి ముందు 1981 చివరలో అమరజీవి రవన్న సమక్షంలో ఏర్పడ్డ సి.పి.ఐ (ఎం.ఎల్) ఏలూరు పట్టణ కమిటీ సంస్థాపక సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 1985లో ఏలూరు జ్యూట్ మజ్దూర్ యూనియన్ (జె.ఎం.యు) సహాయ కార్యదర్శిగా ఎన్నిక అయ్యాడు. పార్ట్ టైమర్ గా ఉంటూనే ఆచరణలో హెూల్ టైమర్ గా పనిచేసాడు. ఇంకా ఏలూరు జ్యూట్ మిల్లులో మహిళా కార్మికుల సమస్య పై వెయ్యి మంది పైగా కార్మికులతో తే.24-3-1987 నాటి సమరశీల ధర్నాపై వందకి పైగా సాయుధ రిజర్వ్ బెటాలియన్ పోలీస్ బలగాల కర్కోటక దాడిలో రక్త

(తరువాయి 12 వ పేజీలో )

# శ్రీకాకుళం విప్లవోద్యమనేత, ఏజెన్సీ గిరిజనోద్యమ నిర్మాత! ప్రజాయుద్ధపంథా నిబద్ధుడు కామ్రేడ్ రామలింగాచారికి విప్లవ జోహార్లు!

*(ఈ నవంబర్ 24కి కా॥ రామలింగాచారి అమరులయ్యి 17 సం॥లు. ఈ సందర్భంగా ఆయన కు విప్లవ జోహార్లర్పిస్తూ , ఆయన మృతి సందర్భంగా నాడు సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, వి.వి.యస్ ఏరియా కమిటీ ప్రచురించిన కరపత్రాన్ని యధాతథంగా పునర్ముద్రిస్తున్నాం. - సంపాదకుడు)*



నక్సల్బరీ విప్లవ వినీలాకాశంలో నుంచి ఒక తార రాలిపోయింది. వీరశ్రీకాకుళం విప్లవ గిరిజనోద్యమ వేగుచుక్క నేల రాలింది. డార్జిలింగు కొండల్లో వసంతకాల మేఘగర్జనకు ఉప్పొంగి, భద్రగిరి కొండల్లో ఊరూరా ప్రతిధ్వనులు సృష్టించిన ఒక గొంతు మూగబోయింది. బెంగాల్ సంతాలుల బాటలో సీతంపేట ఏజెన్సీ గిరిజనులను బాణాలుగా మలిచి సంధించిన ఒక వింటినారి తెగిపోయింది. పాతపట్నం కొండల్లో కొత్త గిరిజనుడి శిశోదయంకై పురుడుపోసిన ఒక మంత్రసాని మరణించింది.

దక్షిణాన మేరంగి కొండల నుంచి ఉత్తరాన మహేంద్రగిరి పర్వతం వరకూ ఆదివాసి ప్రజలకు విప్లవపాఠాలు బోధించి కదం తొక్కించిన ఒక ఆది గురువు అస్తమించాడు. తూర్పున బంగాళాఖాతం నుంచి, పడమరన ఒరిస్సా సరిహద్దుల వరకూ పీడిత ప్రజలను వెన్నుతట్టి విప్లవనాదాలు పలికించిన ఒక వీణ మూగబోయింది. నారాయణపురం, పెదమేరంగి, లక్ష్మీపురం వంటి గ్రామాలను ఎర్రమందార పూదోటలుగా పెంచి పోషించిన ఒక తోటమాలి మృత్యువును వరించాడు. పార్వతీపురం, బొబ్బిలి, పాలకొండ, చీపురుపల్లి, సాలూరు మాగాణాలలో సామ్యవాద బీజాలు నాటి, సేద్యం చేసిన ఒక కృషీవలుని శ్వాస ఆగిపోయింది. బొబ్బిలి నుంచి బొడ్డపాడుకు విప్లవ రహదారి నిర్మించి, ఏజెన్సీని అనుసంధానం చేసిన ఒక వ్యూహాత్మక మెదడు స్థంబించిపోయింది. పాఠశాలల్లో అక్షర జ్ఞానదీపాలు వెలిగించాల్సిన ఉపాధ్యాయులను, విప్లవ జ్ఞానజ్యోతులుగా మలచిన ఒక శిల్పి గుండె ఆగిపోయింది. ఈ మరణించిందెవరో కాదు. ఆయనే కామ్రేడ్ వసంతాడ రామలింగాచారి!

పార్టీ శ్రేణుల్లో వి.ఆర్. పేరుతోనూ, ప్రజల్లో ఆచారి పేరుతోనూ పాత శ్రీకాకుళం జిల్లాలో బహుళ ప్రజాదరణ పొందిన కా॥ రామలింగాచారి గారు తన 74వ యేటా తేది. 24-11-2003వ తేదీన గుండెపోటుతో మరణించారు. మరణించే నాటికి ఆయన సి.పి.ఆర్.సి.ఐ(ఎం.ఎల్) కేంద్రకమిటీ సభ్యునిగా కొనసాగుతున్నారు. ఆయన సుమారు మూడేండ్లకు పైగా జైలు జీవితం సాగించారు. ముప్పై ఏండ్లకు పైగా అజ్ఞాత జీవితం సాగించారు. మొత్తం 50 ఏండ్లకు పైగా విప్లవకారునిగా రాజకీయ జీవితం సాగించారు. ఉద్యమాలే ఊపిరిగా, విప్లవమే ఏకైక వృత్తిగా అర్థశతాబ్దానికి పైగా జీవించారు. అందులో మూడు దశాబ్దాలకు పైగా రహస్య జీవితం సాగించి, అంతిమంగా విప్లవకారునిగానే మరణించడం అసాధారణమైనది. ఇది అత్యంత అరుదైనది కూడా! అయన మృతికి మా సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ సంతాపాన్ని తెలియజేస్తున్నది. ఆయన మరణించిన లోటును తక్షణమే నిర్మాణ రంగంలో భరించాల్సిన సి.పి.ఆర్.సి.ఐ (ఎం.ఎల్) పార్టీకి ఈ కష్ట సమయంలో మా న్యూడెమోక్రసీ పార్టీ సంఘీభావం తెలియజేస్తున్నది. ఆచారి గారి మృతితో విషాదభరితులైన ఆయన బంధుమిత్రులకూ, కుటుంబ సభ్యులకూ, ముఖ్యంగా ఆయన విప్లవ సహధర్మచారిణి, వృద్ధురాలు, త్యాగశీలి సన్యాసమ్మ గారికీ మా న్యూడెమోక్రసీ పార్టీ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

కా॥ ఆచారిగారు విజయనగరం టౌన్, పూలాబాగ్ రోడ్లో తే.21-12-1929వ తేదీన సాంప్రదాయ స్వర్ణకార కుటుంబంలో పుట్టారు. తండ్రి మల్లయ్యాచారి, తల్లి రామయమ్మగారు. తండ్రి వృతి రీత్యా ఆయుర్వేద వైద్యుడు. ఈ దంపతులకు కలిగిన నలుగురు కొడుకులలో రామలింగాచారి గారు రెండవ వారు. ఈయన అన్న వీరేశలింగాచారి గారు విద్యార్థి జీవితంలోనే కమ్యూనిష్టు విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడయ్యారు. ఆయన ప్రభావం మిగిలిన సోదరుల కుటుంబాలన్నింటి మీద పడింది. అచారి గారు విజయనగరం కస్బా హైస్కూల్లో మెట్రిక్ చదివారు. తన 22వ ఏట పార్టీకి పూర్తికాలం కార్యకర్తగా ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే 1952 నవంబరులో పార్టీ చేత శ్రీకాకుళం అర్గనైజర్గా నియమితులయ్యారు. ఆనాటి అవిభక్త శ్రీకాకుళం జిల్లాలోని బొబ్బిలిని తన కేంద్రంగా చేసుకొని ఆచారి గారు విప్లవోద్యమ నిర్మాణ కృషిని ఆరంభించారు.

బొబ్బిలి కార్యస్థానంగా పార్వతీపురం, సాలూరు, చీపురుపల్లి, పాలకొండ, తాలూకాలకు క్రమంగా పార్టీ విస్తరించడంలో ఆచారిగారి కృషి కీలకమైనది. రైతాంగం, వ్యవసాయ కూలీలు, కౌలుదార్లు, కల్లుగీత వంటి వృత్తిదార్లు, మోటారు, గని కార్మికులు తదితర పేద వర్గాల ప్రజలతో వర్గ సంఘాల నిర్మాణం చేశారు. కార్యకర్తలను కమిటీలను నిర్మించారు. ఉపాధ్యాయ రంగంలో వెలలేని రత్నాల వంటి కమ్యూనిస్టులను తయారు చేశారు.

ఈ క్రమంలోనే పల్లెరాములు, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం వంటి ఉపాధ్యాయుల సాయంతో ఏజెన్సీ గిరిజనోద్యమ నిర్మాణానికి పూనుకున్నారు. 1960 నాటికే ఏజెన్సీలో అదొక సంఘటిత రూపం ధరించింది. సి.పి.ఐ చివరి రోజుల్లో పార్టీ శ్రీకాకుళం జిల్లా కమిటీలో ఆయన నిర్ణయాత్మక రాజకీయ స్థానానికి ఎదిగారు. సి.పి.ఎం ఏర్పడ్డాక ఆయనే పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తిరిగి సి.పి.ఎం తో తెగదెంపులు చేసుకున్నాక సి.పి.ఐ (ఎం.ఎల్)కు కూడా అచారి గారే జిల్లా కార్యదర్శిగా వ్యవహరించారు. శ్రీకాకుళం విప్లవోద్యమాన్నీ, ముఖ్యంగా ఏజెన్సీ గిరిజనోద్యమాన్ని నిర్మించడంలో ఆచారిగారి పాత్ర నిర్ణయాత్మకమైనది. ఆచారిగారి విలక్షణ నిర్మాణ శైలి, కార్యదీక్ష, క్యాడర్ డీలింగ్, ప్రజాయుద్ధ పంథా పట్ల నిబద్ధత, ప్రజల పట్ల విశ్వాసం, నిరాడంబర జీవితం తదితర సానుకూల అంశాలు శ్రీకాకుళం విప్లవోద్యమ ఆవిర్భావంలో కీలక పాత్రను పోషించాయి.

తొలుత సి.పి.ఐ రివిజనిజంతోనూ, 1964 తర్వాత సి.పి.ఎం నయారివిజనిజంతోనూ సాగించిన సైద్ధాంతిక, రాజకీయ పోరాటంలో ఆచారిగారు అసాధారణ పాత్రను పోషించారు. 1950వ దశాబ్దం మధ్య నుంచే భారత కమ్యూనిస్టు ఉద్యమం పార్లమెంటరీ భ్రమల్లో దిగనారంభించింది. ఆ రోజుల్లోనే శ్రీకాకుళం జిల్లాలో విప్లవోద్యమ నిర్మాణం జరగడం గమనార్హం. దీని వెనుక ఆచారిగారి పాత్ర అద్వితీయమైనది. నక్సల్బరీ పంథాను స్వాగతించి, పార్టీ శ్రేణులను సమీకరించడంలో అచారి గారు అగ్రభాగాన నిలిచారు. అదే సమయంలో చారుమజుందార్ అతివాద, దుందుడుకు, వర్గశత్రు నిర్మూలనా పంథా ప్రజాయుద్ధ పంథాకు వ్యతిరేకమైనదని నిర్మోహమాటంగా మొట్టమొదటి నుంచే ఆచారిగారు వ్యతిరేకించారు. నాగిరెడ్డి, పుల్లారెడ్డి, దేవులపల్లిల ఆధ్వర్యంలో ఏర్పడిన ఆంధ్రరాష్ట్ర విప్లవ కమ్యూనిస్టు కమిటీనే అనుసరించారు. చారు మజుందార్ ను మెజార్టీ జిల్లా కమిటీ అనుసరించడంతో దానినుంచి తాను వేరు పరుచుకున్నారు. జిల్లా కార్యదర్శిగా రాజీనామా చేశారు. అతివాద పంథాను అనుసరించుతున్న జిల్లా నాయకత్వం తమ స్వానుభవంతో పాఠాలు నేర్చుకుంటుందన్న సదుద్దేశ్యంతో అదే జిల్లాలో తాను నిర్మాణ పరంగా పార్టీని చీల్చి వివాదాస్పద పరిస్థితికి అవకాశం యివ్వకూడదని ఆయన భావించారు. అందుకే తాను 1969లో తూ.గో.జిల్లా కొండమొదలు ఏజెన్సీకి వెళ్ళి గిరిజనోద్యమ నిర్మాణానికి పూనుకున్నారు. ఈ క్రమంలో అదే ఏడాది కానివాడ గ్రామంలో అరెస్ట్ అయి నాగిరెడ్డి కుట్ర కేసులో యిరికించబడ్డాడు. కోర్టు ప్రకటన ద్వారా ఈ కేసులోనే ఆచారిగారు ప్రజాదరణ పొందారు. విడులయ్యాక తిరిగి రహస్య జీవితంలోకి వెళ్ళారు. మూడు దశాబ్దాల తర్వాత అజ్ఞాత జీవితంలోనే ఆచారిగారు మరణించి అమరులయ్యారు.

అమరులైన వెంపటాపు, ఆదిభట్ల, మేడవరపు రమణమూర్తి, వావిలపల్లి

( మిగతాది 8వ పేజీలో )

# ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, పౌరహక్కుల నేత కామ్రేడ్ రవికుమార్ మాష్టర్‌కి విప్లవ జోహార్లు!



ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, పౌర హక్కుల నేత కామ్రేడ్ రవికుమార్ మాస్టర్ అనారోగ్యంతోబాధపడుతూ తే.29-10-20న మరణించారు. ఇటీవల సంవత్సరాలలో వివిధ వ్యాధులతో యిబ్బంది పడ్డారు. కరోనా కాలంలో తే.16.10.2020న మెదడుకి జరిగిన సర్జరీ తర్వాత కోవిడ్-19 సోకింది. 74 సంవత్సరాల వృద్ధాప్యంలో వాటిని తట్టుకోవడం ఆయనకు సాధ్యంకాలేదు. ఆయన మరణం విప్లవ, ప్రజాస్వామిక ఉద్యమాలకి, పౌర హక్కుల ఉద్యమానికి తీవ్ర నష్టం.

రవికుమార్ గారు కృష్ణా జిల్లా, గుడ్లవల్లేరు సమీపంలోని డోకిపర్రు గ్రామంలో తే.11-8-1947న జన్మించారు. విద్యాభ్యాసం కోసం ప.గో.జిల్లా తాడేపల్లి గూడెం సమీపాన ఉంగుటూరు మండలం రాచూరులోని అమ్మమ్మ గారింటికి వచ్చారు. పెళ్ళి, ఉద్యోగాలు యిక్కడే తటస్తించాయి. దీనితో ప.గో.జిల్లాలోనే స్థిర పడ్డారు. రవికుమార్ మాస్టారు గారు ఉపాధ్యాయ వుద్యమంలో రెండున్నర దశాబ్దాలపాటు నిర్విరామ నిరంతర కృషి చేశారు. రిటైరయ్యాక వృద్ధాప్యంలోనూ ఎ.పి.టి.ఎఫ్.తో పాటు పౌరహక్కుల సంఘం (సీ.ఎల్.సీ)లో కూడా పని చేస్తున్నారు. ఏడు పదుల వృద్ధాప్యంలో కూడా ఆయన ప॥గో॥జిల్లాలో ఎ.పి.టి.ఎఫ్.కి పొలిటికల్ గైడర్‌గా, సీ.ఎల్.సీకి ప్రాక్టికల్ లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

స్వాతంత్ర్యోద్యమం నుండి కమ్యూనిస్టు ఉద్యమకారుడిగా పనిచేసి ప.గో.జిల్లా కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాతల్లో ఒకరుగా పేరొందిన అమరజీవి నెక్కలపూడి రామారావు గారు ప.గో.జిల్లా ఎ.పి.టి.ఎఫ్.కి, నాటి ఏ.పి. విప్లవ కమ్యూనిస్టు కమిటీ నుండి రాజకీయ ఇన్‌చార్జిగా వుండేవారు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత ఏ.పి.టి.ఎఫ్ నాయకులు పిళ్లా సుబ్బారావు గారి ద్వారా నెక్కలపూడి రామారావు గారితో నేరుగా రవికుమార్ గార్కి పార్టీతో తొలి సంబంధం ఏర్పడింది. దానితో ఆయన విప్లవ కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం పొందారు. ఆయన రాజకీయ జీవితాన్ని అది మరో మలుపు తిప్పింది. రవికుమార్ గారు స్వతహాగా మితభాషి. ఆయన మృధుభాషి కూడా. తన తండ్రి నుండి సంక్రమించిన గాంధేయవాద ప్రభావంతో నిరాడంబర జీవన శైలిని అలవరుచుకున్నారు. ఆయా సంఘాలు, సంస్థల నిర్మాణాలలో నేడు ప్రబలంగా వున్న అన్యవర్గ ధోరణులకు ఆయన చాలా దూరంగా వున్నారు. పదవీ వ్యామోహం, వ్యక్తిగత ప్రాచుర్యం, స్వాతిశయం, అహంభావం, వ్యక్తి పోకడ, వ్యక్తివాద ధోరణి వంటి పెటీ బూర్జువా భావజాల వైఖరిని దగ్గరకు రానివ్వలేదు. కమిటీ సమావేశాలలో తొందరపడి ఎవరి మీద విమర్శ చేయరు. మృధువుగానే ఎదుటి కామ్రేడ్స్‌లోని పొరపాట్లను సరిదిద్దుటకు గరిష్ఠంగా ప్రయత్నిస్తారు. తనపై నిర్హేతుక విమర్శలను ఎదుటి కామ్రేడ్స్ చేసిన అరుదైన సందర్భాల్లో సైతం కోప్పడేవారుకాదు. నవ్వుతూ వినేవారు. పూర్తిగా విన్న తర్వాతే నిగ్రహంతో స్పందించేవారు. తన వైపు నుండి చిన్న పొరపాటు జరిగినా అత్యంత వినయంగా వాటిని స్వీకరించేవారు. ఆయన సలహాలు, సూచనలు సూత్ర బద్ధంగా ఉండేవి. కమిటీ నిర్ణయాలకు కట్టుబడి పని చేయటం, బాధ్యులు చెప్పింది పాటించటం, ఆయన అభిప్రాయాలను సూటిగా చెప్పటం ఆయనలో ఉన్న ప్రత్యేక లక్షణం. రవికుమార్ గారి జీవిత సహచరి పాత్రను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆమె ఆయన మార్గాన్ని ఏనాడు ఆటంకపరచ లేదు. పైగా నిండు మనస్సుతో నిరంతర సాయ, సహకారాన్ని అందించారు.

రవికుమార్ మాస్టారుగారు స్వతహాగా నిరంతర సాహిత్య అధ్యయనశీలి. శ్రీశ్రీ, చాగంటి, రావిశాస్త్రి, కొడవటిగంటి, కారా మాస్టారు, ప్రేమచంద్, శరత్ వంటి విప్లవ, అభ్యుదయ రచనలను నిత్యం అధ్యయనం చేసేవారు. ఆయన రాజకీయ కృషి ఎ.పి.టి.ఎఫ్, సీ.ఎల్.సీ సంస్థల వుద్యమ నిర్మాణాల పురోభివృద్ధికే పరిమితం కాదు. తెలంగాణాకు ఎ.పి.టి.ఎఫ్. విస్తరణ ప్రక్రియలోనూ, పటిష్టీకరణ ప్రక్రియలోనూ వుంది. 1980-90 దశాబ్దాలలో పిళ్ళా సుబ్బారావు గారు తెలంగాణా మీద కేంద్రీకరించాల్సి వచ్చింది. దానికి రవికుమార్ గారి అజ్ఞాత పాత్ర ఎంతో వుంది.

ఆయన ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా పౌర హక్కులు సంఘంలో ఒక ముఖ్యమైన నాయకుడుగా ఉన్నారు. గతంలో రెండున్నర సంవత్సరాల పాటు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా పనిచేశారు. ఆయన ప్రధానంగా రైతాంగం స్థితిగతుల పైన, బడుగు బలహీన వర్గాలు జీవితాల గురించి తీవ్రంగా మదనపడేవారు. ఈ అసమాన సమాజంలో అందరికి సమాన విలువలు, గౌరవం కావాలని పరితపించే వారు. మానవీయ విలువలు గలిగిన రవికుమార్ మాస్టర్‌ని కోల్పోవడం విప్లవ, ప్రజాస్వామిక ఉద్యమాలకు నష్టం. ఆయనకు విప్లవ జోహార్లు తెలియ చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ**

## సి.ఎల్.సి మాజీ జిల్లా అధ్యక్షులు పి. రవి కుమార్ సంతాప సభ




బ్రెయిన్ ఆపరేషన్ సందర్భంగా హైద్రాబాద్ ఆస్పత్రిలో కరోనా సోకి 29.10.2020న మరణించిన పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రవి కుమార్ మాస్టర్ కు ఏ.పి.సి.ఎల్.సి జిల్లా కార్యవర్గ ప్రత్యేక సమావేశం ఘనంగా నివాళులు అర్పించింది. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.రత్నం, రాష్ట్ర ఉపాధ్యక్షులు నంబూరి శ్రీమన్నారాయణ ప్రసంగించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్. రత్నం, గోగుల చిన్నారెడ్డి, జి.ప్రసాద్ రెడ్డి, కెచ్చెల మంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం జిల్లా ఇఫ్టూ జనరల్‌బాడీ సమావేశం

విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని ఇఫ్టూ యూనియన్ ఆఫీసులో తే.11-11-20న ఇఫ్టూ నాయకులు పి.మల్లిక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్ ప్రసంగించారు. సమావేశానికి నెల్లిమర్ల జూటుమిల్లు నాయకులు నామాల తిరుపతి, మామిడి నారాయణరావు, కురిటి సింహాచలం, ఆటో యూనియన్ నాయకులు బి.శ్రీను, బిఓసి నాయకులు ఎ.మేఘనాథ్, కె.పైడిరాజు మరియు కార్మికులు హాజరయ్యారు. తే.12-11-20న జరిగిన ఐ.ఎఫ్.టి.యు విజయనగరం జిల్లా జనరల్‌బాడీ సమావేశంలో కా॥ ప్రసాద్ ప్రసంగించారు. నవంబర్ 26న జరిగే దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు కూడా పాల్గొన్నారు.



# సంస్కరణలను విప్లవ పథంలో మెట్లుగా మార్చేది ' మార్క్సిజం '! సంస్కరణల బూచితో విప్లవ పథాన్ని నీరుగార్చేది ' రివిజనిజం '!

## తే.26-11-2020 నాటి సమ్మె - ఓ మార్క్సిస్టు తాత్విక చర్చ!

- పి.ప్రసాద్

భూమండలం మీద ఒక వర్గంగా కార్మికవర్గం ఆవిర్భవించిన కారణంగానే మార్క్సిజం ఒక తాత్విక సిద్ధాంతంగా రూపొందింది. భారతదేశంలో కూడా కార్మికవర్గం ఆవిర్భవించి అది ఒక వర్గంగా సంఘటితమయ్యే క్రమంలోనే మార్క్సిజం ఒక సిద్దంత భావజాలంగా ఉనికిలోకి వచ్చింది. మార్క్సిజం లేకుండా కార్మికవర్గం ఉనికిలో వుంటుంది. కానీ కార్మికవర్గం లేకుండా మార్క్సిజం ఉద్భవించడానికి భౌతిక ప్రాతిపదిక లేదు. కార్మికవర్గ భౌతిక పునాదిని ఆధారంగా చేసుకొని ఉద్భవించే మార్క్సిజానికి రెండు పార్శ్వాలు వుంటాయి. మొదటిది, పెట్టుబడిదారీ వర్గం ఉనికిలో వున్న కాలంలోనే తన జీవన పరిస్థితులను మెరుగుపర్చుకునేందుకు కార్మికవర్గాన్ని సంఘటితం చేసి వర్గపోరాటాలకు సిద్ధం చేయడం! రెండవది, పెట్టుబడిదారీవర్గం చేతిలోని సమస్త ఉత్పత్తి సాధనాలను స్వాధీన పరుచుకొని, తానే రాజ్యాధికారాన్ని సాధించే విధంగా కార్మికవర్గాన్ని రాజకీయంగా సన్నద్ధం చేయడం! భారతదేశ అనుభవాన్ని విశ్లేషిస్తే మార్క్సిజం తన మొదటి కర్తవ్యాన్ని ఇంచుమించు విజయవంతంగా నిర్విహించినట్లు బోధపడుతుంది. కానీ రెండవ రాజకీయ కర్తవ్యాన్ని చేపట్టంలో అది స్థూలంగా విఫలమైంది. ఫలితంగానే భారత కార్మికవర్గం గతంలో విజయాలు సాధించి అనుభవించిన ఫలితాలను నేడు సర్వం కోల్పోతున్నది. ఈ కారణంగా అది తాను నేడు కోల్పోతున్న ఫలితాల పునరుద్ధరణ కోసం పోరాడాల్సిన పరిస్థితిలోకి యీడ్చబడింది. అట్టి దుస్థితికి అద్దం పట్టేదే తే.26-11-2020న చేపడుతున్న ' సార్వత్రిక సమ్మె '!

పుక్కిటి పురాణగాథల ప్రకారం వీరాభిమన్యుడు ఒక విద్యలో గొప్ప విజయాన్ని సాధించాడు. రెండో విద్యలో కనీస ప్రవేశం లేదు. శత్రువులు పన్నిన పద్మవ్యూహంలోకి ప్రవేశించడంలో దిట్ట! కానీ అందులోంచి నుంచి బయటపడటం మాత్రం తెలీదు. అందుకే పురాణనీతి ప్రకారం ఆయన గొప్ప సాహసికుడైన వీరాభిమన్యుడే! కానీ అట్టి సాహసికత కేవలం అమరత్వానికే తప్ప చిరంజీవిగా అందులో నుంచి బయటపడటానికి వుపయోగపడలేదు. అదేవిధంగా భారత కార్మికవర్గానికి మొదటి రాజకీయ కర్తవ్యోపదేశం చేయడంలో ' మార్క్సిజం ' సాపేక్షకంగా విజయం సాధించింది. కానీ రెండవ ' విద్య ' ను బోధించడంలో అది విఫలమైంది. అందుకే భారత కార్మికవర్గం పెట్టుబడిదారీవర్గం నుంచి గొప్ప ఆర్థిక విజయాలను సాధించడంలో విజయం సాధించింది. కానీ దాన్ని కూల్చి తానే స్వయంగా రాజ్యాధికారాన్ని పొందే రాజకీయ లక్ష్యసాధనలో పూర్తిగా విఫలమైంది. అందుకే అది గతంలో పోరాడి సాధించుకున్న విజయాలను నేడు కోల్పోతున్నది. మళ్ళీ మొదటికి వచ్చి, వాటి కోసమే పోరాడాల్సిన స్థితిలోకి అది నేడు నెట్టబడింది. దానికి ప్రతిరూపమే రేపటి సార్వత్రిక సమ్మె!

కార్మికవర్గం సాగించే వర్గపోరాటాల క్రమంలో బూర్జువావర్గం ఒక దశలో ఉత్పత్తి సాధనాలపై తన అధికారాన్ని కోల్పోవాల్సి వస్తుంది. ఆ నేపథ్యంలో వాటిపై తన అధికారాన్ని నిలుపుకోవడానికి అట్టి దశలో అది కార్మికవర్గానికి కొన్ని రాయితీలను ఇస్తుంది. వాటినే మార్క్సిస్టు రాజకీయ పరిభాషలో ' సంస్కరణలు ' అంటారు. అట్టి సంస్కరణలను కార్మికవర్గం తన విప్లవపథంలో ' మందడుగులు ' గా భావించాల్సి వుంటుందని మార్క్సిజం బోధిస్తుంది. అట్టి సంస్కరణల ద్వారా లభించే మెరుగైన జీవన ప్రమాణాలను (1990 తర్వాత ' సంస్కరణల ' పదానికి అర్థం మారింది. గత సంస్కరణల ఫలాలను రద్దుచేయడాన్ని నేటి సంస్కరణలు) తన రాజ్యాధికార దిశలో ' మందడుగులు ' గా కార్మికవర్గం మార్చుకోవాలని కూడా మార్క్సిజం కర్తవ్యోపదేశం చేస్తుంది. భారత కార్మికవర్గానికి జీవన ప్రమాణాలను సాధించుకునేంత వరకూ ' మార్క్సిజం ' చాలా వరకు సరిగ్గానే రాజకీయంగా మార్గదర్శకత్వం వహించింది. కానీ అది వాటిని తన విప్లవ మార్గంలో ' ముందడుగులు ' గా మార్చుకునే రాజకీయ శిక్షణను మాత్రం ఇవ్వలేకపోయింది. అందుకే ఆనాటి ' విజయాల ' ను బూర్జువావర్గం నేడు వెనక్కి తీసుకుంటున్నది. ఈ క్రమానికి ఒక ఉదాహరణే గత 44 కార్మిక చట్టాల రద్దు! దానివల్ల వాటి పునరుద్ధరణకై తలపెట్టిన తే.26-11-2020 నాటి ' సార్వత్రిక సమ్మె '!

కల్పిత గాథల ప్రకారం వీరాభిమన్యుడికి యుద్ధరంగంలో ముందుకు వెళ్ళడం తప్పా వెనక్కి రావడం తెలియనట్లే, ఆధనిక చరిత్రలో భారత కార్మికవర్గానికి చెట్టుపై రాళ్ళు విసిరి పండ్లు రాల్చుకోవడం తప్పా చెట్టును స్వాధీనం చేసుకోవడం తెలియలేదు. అంటే వారికి మార్క్సిజం రాళ్ళు విసిరే విద్యను తప్పా, చెట్టును స్వాధీన పరుచుకునే విద్యను బోధించి సిద్ధం చేయలేదు. పైగా రాళ్ళు విసిరిన ఫలితంగా సాధించుకున్న పళ్ళూ, ఫలాలనూ హక్కుభుక్తంగా కాకుండా దాన, ధర్మాలుగా భారత కార్మికవర్గానికి ' భారతదేశ మార్క్సిజం ' బోధించింది. ఫలితంగా అట్టి దానధర్మాలను కార్మికవర్గం చేతుల్లో నుండి బూర్జువావర్గం నేడు వెనక్కి తీసుకోగలుగుతున్నది. అందుకే రేపటి సమ్మెకు దారితీసిన నేపథ్య భౌతిక పరిస్థితిని సమగ్ర విశ్లేషణ చేయాల్సి వుంది.

చరిత్రలో భారత కార్మికవర్గం రక్తతర్పణలూ, ప్రాణాతర్పణలతో సాధించుకున్న విజయాలలో కార్మిక చట్టాలు కూడా ఒక భాగమే. అలాంటి విజయాలను విప్లవ మార్గంలో మెట్లుగా నిర్మించుకునే పనిని స్థూలంగా భారత కమ్యూనిస్టు ఉద్యమం విఫలమైనది. వాటిని నెహ్రూ ప్రభుత్వం ' కార్మిక సంక్షేమ ' దృష్టితో మంజూరు చేసిందనే భావన లేదా భ్రమ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో 1950వ దశాబ్దంలోనే తలెత్తింది. ' సోషలిజం ' నినాదాన్ని స్వీకరించిన 1956 నాటి ' ఆవడి కాంగ్రెసు ' పట్ల సానుకూలంగా అది స్పందించింది. 1956 నాటి నెహ్రూ ప్రభుత్వ ' నూతన పారిశ్రామిక విధానం ' తీర్మానాన్ని ప్రశంసించింది. అదీ, ఇదీ ఒకటి కాకపోయినా 1917 విప్లవానంతర పరిస్థితిపై ' రష్యా బోల్షివిక్ పార్టీ వైఖరిని గుర్తు చేయాల్సిన సందర్భమిది.

1917 ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం తర్వాత అధికారం చేపట్టిన కాడెట్ పార్టీ అనేక సంస్కరణలను అమలు చేసింది. జారు ప్రభుత్వంలో కార్మికవర్గం పొందలేని అనేక ఫలితాలను అనుభవించే అవకాశం చరిత్రలో తొలిసారి రష్యన్ కార్మికవర్గానికి లభించింది. 8 గంటల పనిదినం, ట్రేడ్ యూనియన్ హక్కులు, పౌరహక్కులు, పౌరస్వేచ్ఛ, రేషన్, మెరుగైన జీతభత్యాలు వంటివి చరిత్రలోనే మొదటిసారి అనుభవించే అవకాశం కలిగింది. అలాంటి అనూహ్యమైన ఫలాలూ, ఫలితాలూ చేకూరిన కార్మికవర్గంలో సహజంగానే కొత్త కాడెట్ ప్రభుత్వం పట్ల సానుకూల, సంతోషకర వాతావరణం ఏర్పడింది. దానితో రష్యాలోని మెన్షవిక్కు వర్గం ఉబ్బితబ్బిబ్బైపోయింది. వారే కాకుండా బోల్షివిక్ కమ్యూనిస్టు పార్టీలో ఒక సెక్షన్ కూడా ఆనాటి సానుకూల పరిస్థితిలో రాజ్యాధికార సాధనా దిశలో కార్మికవర్గాన్ని చైతన్యపరచడానికి అది సమయం కాదని భావించింది. రష్యన్ మార్క్సిస్టులలో అలాంటి సందిగ్ధ రాజకీయ పరిస్థితి ఏర్పడ్డ నేపథ్యంలో లెనిన్ ప్రవేశపెట్టిన చారిత్రాత్మక రాజకీయ పత్రమే ' ఏప్రిల్ థీసిస్ '! నాటి ఏప్రిల్ థీసిస్ తరహాలో నాటి భారత దేశ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణమైన రాజకీయ దిశానిర్ధేశం చేయడంలో నాటి భారత కమ్యూనిస్టు ఉద్యమం రాజకీయంగా విఫలమైనది. ఫలితంగానే భారత కార్మికవర్గం తాను

( మిగతాది 7వ పేజీలో )

( 6 వ పేజీ తరువాయి)

స్వయంగా రక్తతర్పణలతో సాధించుకున్న విజయాలు ప్రభుత్వాలపై వారిలో భ్రమలు పెంచుటకు కారణంగా మారాయి. ఫలితమే రాజ్యాధికార భావన నుండి భారత కార్మికవర్గం రాజకీయంగా పరాయీకరణ (అన్యధీకరణ)కు గురైనది. ఆ క్రమం అనివార్యంగా తాను త్యాగాలతో ఆనాడు సాధించుకున్న విజయాలను నేడు కోల్పోవడానికి దారితీసిందని చెప్పవచ్చును.

ఈ దేశంలో ఏ తరహా విప్లవం సిద్ధిస్తుందనేది ఈ దేశ నిర్దిష్ట ఆర్థిక, రాజకీయ వ్యవస్థ నిర్ణయిస్తుంది. వాటిని వస్తుగతంగా విశ్లేషించి నిర్ణయించాల్సి వుంటుంది. అవి ఏతరహా విప్లవమైనప్పటికీనీ అందులో భారత కార్మికవర్గం చారిత్రకంగా అగ్రగామి పాత్ర పోషించాల్సిందే. మెరుగైన జీతభత్యాలనూ, జీవన ప్రమాణాలనూ సాధిస్తే అది సంతృప్తి చెందరాదు. భారత కార్మికవర్గం విధిగా దోపిడీ వ్యవస్థను కూల్చివేసే విప్లవ ప్రక్రియకు సారధ్యం వహించే భావనను కలిగి వుండాలి. ఈ రాజకీయ చైతన్యానికి కల్పించే చారిత్రక పాత్రను పోషించడంలో భారత కమ్యూనిస్టు ఉద్యమం విఫలమైంది.

భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను విశ్లేషిస్తే ఈ రాజకీయ వైఫల్యం స్పష్టంగా అర్థమవుతుంది. అతివాద రాజకీయ తప్పిదాలుంటే వుండొచ్చు. కానీ 1948 ఫిబ్రవరిలో కలకత్తాలో జరిగిన సి.పి.ఐ రెండవ మహాసభ నాటికి రాజ్యాధికార భావన ప్రముఖంగా వుంది. అది అలాగే మరికొన్నేళ్ళు కూడా కొనసాగింది. కానీ 1953లో మధురైలో జరిగిన మూడో పార్టీ మహాసభలు, 1956లో పాల్ఘాట్‌లో జరిగిన నాలుగో పార్టీ మహాసభలు, 1958లో అమృతసర్‌లో జరిగిన ఐదవ ప్రత్యేక మహాసభలు, 1961లో విజయవాడలో జరిగిన పార్టీ ఆరవ మహాసభల తీర్మానాలను నిశితంగా సైద్ధాంతిక విశ్లేషణ చేస్తే, పూసలలో దారంగా రివిజనిస్టు ధోరణి వుందని తెలుస్తుంది. వర్గపోరాటాల ద్వారా వర్గ రాజ్యాధికారం సిద్ధిస్తుంది. అది విప్లవ ప్రక్రియ ద్వారా సాధించుకోవటానికి బదులు, పార్లమెంటరీ పంథాలో ఎర్రకోటపై ఎర్రజెండాను ఎగురవేసే రాజకీయ ధోరణి కనిపిస్తుంది. సాయుధ విప్లవ ప్రక్రియ ద్వారా రాజ్యాధికారాన్ని సాధించుకునే లక్ష్యం తెరమరుగైపోయింది. నాటి సంఘటిత భారత కార్మికవర్గం స్థూలంగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఆచరణలో అనుసరించిన కాలంలో జరిగిన ఈ రాజకీయ వైఫల్యం చరిత్రగతిని వెనక్కి తిప్పింది. రష్యాలో ' ఏప్రిల్ థీసిస్ ' వంటి సిద్ధాంత మార్గదర్శకత్వాన్ని అందించడంలో అది ఆనాడు విఫలమైనది. ఫలితమే నేటి దుస్థితి!

సుమారు నూరేళ్ళ క్రితం భారతదేశ రాజకీయరంగంలో ఒక తీవ్ర పురోగమన, ఒక తీవ్ర తిరోగమన రాజకీయ సంస్థలు ఆవిర్భవించాయి. అవే సి.పి.ఐ మరియు ఆర్.ఎస్.ఎస్ సంస్థలు. ఈ రెండింటికీ సాయుధ రాజకీయ ప్రక్రియలే శిరోధార్యం. సాయుధ విప్లవ ప్రక్రియ ద్వారానే తమ తమ పంథాలలో రాజ్యాధికారాన్ని పొందే రాజకీయ లక్ష్యాలను ఈ రెండు సంస్థలు ధరించాయి. ఔనుమరి! బూర్జువా, భూస్వామ్య దోపిడీ వ్యవస్థను నిర్మూలించి, సోషలిస్టు సమాజ దిశలో విప్లవ సాధన శాంతియుతంగా సాధ్యం కాదని ఆనాటి సి.పి.ఐ భావించింది. అదేవిధంగా ఆధునిక బూర్జువా భావజాల పునాదిపై ఆధారపడ్డ ఆనాటి సామాజిక వ్యవస్థ స్థానంలో తాను కోరుకొనే పూర్తిస్థాయి ఫ్యూడల్ వ్యవస్థ పునరుద్ధరణ శాంతియుతంగా సాధ్యం కాదని ఆరెస్సెస్ నమ్మింది. ఈ రెండు రకాల సాయుధ రాజకీయ సంస్థల కేంద్రాలు కూడా ఒకే రాష్ట్రంలో వుంటడం గమనార్హం! ఆనాడు సి.పి.ఐ హెడ్ క్వార్టర్ బొంబాయి! ఆరెస్సెస్ హెడ్ క్వార్టర్ నాగపూర్! బొంబాయి కేంద్రంగా తన వర్గపోరాటాలు నిర్వహించే క్యాడర్‌కు సి.పి.ఐ సాయుధ శిక్షణ యిచ్చింది. హిందూత్వ భావజాలాన్ని వ్యాప్తిచేసే తన క్యాడర్‌కు నాగపూర్ కేంద్రంగా ఆరెస్సెస్ కూడా సాయుధ శిక్షణ ఇచ్చింది. అయితే చరిత్ర గమనంలో ఆరెస్సెస్ సాయుధ రాజకీయ పంథా కంటే సి.పి.ఐ సాయుధ రాజకీయ పంథా శుక్లపక్ష చంద్రుని వలే దినదినాభివృద్ధి చెందింది.

1948 జనవరి 30న ఆరెస్సెస్ సాయుధ రాజకీయ పంథా (గాంధీని) హత్య చేసింది. అది ఆరెస్సెస్‌కు రాజకీయంగా మరణశాసన పత్రంగా మారింది. ఆరెస్సెస్‌కు గ్రహణం పట్టింది. కానీ అంతకంటే 31 నెలల ముందే దొడ్డి కొమరయ్య మరణం (తే.4-7-1946)తో తెలంగాణా సాయుధ రాజకీయ ప్రక్రియను సి.పి.ఐ ఆచరణలో పెట్టింది. అది గాంధీ హత్య నాటికే తెలంగాణా పీడిత ప్రజల హృదయక్షేత్రాన్ని రాజకీయంగా గెలుచుకున్నది. భారతదేశ రాజకీయరంగంలో సంపూర్ణ రాజకీయ గ్రహణానికి గురై ఆరెస్సెస్ కనుమరుగైపోయింది. కానీ సి.పి.ఐ భారత దేశ పీడిత ప్రజాక్షేత్రంలో వటవృక్షంగా ఎదిగింది. తీవ్ర విప్లవాత్మక సాయుధ విప్లవ రాజకీయ పంథా ఆకాశంలోకి దూసుకెళ్ళింది. తీవ్ర విప్లవ ప్రతీఘాత సాయుధ రాజకీయ పంథా పాతాళంలోకి జారిపడింది. ఇది ఏడు దశాబ్దాల క్రితపు భౌతిక సత్యం!

ఈ ఏడు దశాబ్దాల చరిత్ర మరో చేదు సత్యాన్ని ఆవిష్కరించింది. ఆనాడు అధోపాతాళానికి దిగజారిన ఆరెస్సెస్ నేడు భారత దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో వటవృక్షం గా ఎదిగి రాజ్యపాలన చేసే స్థాయికి చేరింది. మరోవైపు రేపో మాపో రాజ్యాధికారాన్ని సాధిస్తుందని ఆనాడు అంచానా వేయబడ్డ సి.పి.ఐ నేడు బలహీనపడింది. ఒక సాయుధ విప్లవ, రాజకీయ పంథా చరిత్రగతిలో విఫలమైంది. ఫలితంగా మరో సాయుధ విప్లవప్రతీఘాత పంథా వటవృక్షంగా ఎదిగింది. దీని ఫలితమే నేటి రాజకీయ దుస్థితి! దానికి అద్దంపట్టే అనేక సూచికలలో తాజా సార్వత్రిక సమ్మె ఒకటి!

ఇక్కడ రెండు రాడికల్ రాజకీయ సిద్ధాంతాలున్నాయి. ఒకటి కమ్యూనిజం! మరొకటి కమ్యూనలిజం! ఈ రెండు పదాల మధ్య ఒకేఒక అక్షరం తేడా వుంది. ' కమ్యూనిజం ' లో నాలుగు అక్షరాలుంటే, ' కమ్యూనలిజం ' లో ఐదు అక్షరాలున్నాయి. ఈ రెండు ' తీవ్రవాద రాజకీయ సిద్ధాంతాలే ' ! ఈ రెండు సాయుధపంథాలే! కమ్యూనిజం యొక్క లక్ష్యం దోపిడీ, పీడన, హింస, అణచివేత, ఆకలి, దారిద్ర్యం, కన్నీళ్ళు లేని శాశ్వత సుస్థిర శాంతియుత, సమ సమాజ స్థాపన. అది అందుకోసం సాయుధ ప్రక్రియను చేపడుతుంది. తద్భిన్నంగా కమ్యూనలిజం మరింత శాశ్వత, సుస్థిర హింసాయుత సామాజిక వ్యవస్థ స్థాపనకై సాయుధ పంథాను చేపడుతుంది. ఒకరి ప్రయాణం అశాంతి వ్యవస్థ నుండి సంపూర్ణ సుస్థిర వ్యవస్థ వైపుకు సాగేది. మరొకరి ప్రయాణం నేటి ' అశాంతి ' వ్యవస్థను ' అతితీవ్ర అశాంతి ' వ్యవస్థవైపు సాగేది. అందుకే నేటి ' అశాంతి ' సామాజిక వ్యవస్థ అటు కమ్యూనిజానికీ, ఇటు కమ్యూనలిజానికీ వ్యతిరేకమైనదే. అదే బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ!

భారతదేశ రాజకీయ వ్యవస్థలో కమ్యూనిజంలో క్రమంగా రివిజనిజం ధోరణి బలపడే క్రమంలో కమ్యూనలిజం క్రమంగా ఫాసిజంగా పరిణామం చెందింది. నేటి బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ ఇటు కమ్యూనిజానికీ, అటు కమ్యూనలిజానికీ రాజకీయ శత్రువే! దానిని సాయుధంగా కూలదోయకుండా కమ్యూనిజానికి సమ సమాజాన్ని స్థాపించడం సాధ్యం కాదు. అదేవిధంగా దాన్ని కూల్చివేయకుండా కమ్యూనలిజానికి కూడా తన రాజకీయ లక్ష్యమైన కమ్యూనల్ ఫాసిజాన్ని తేవడం సాధ్యం కాదు. (కమ్యూనల్ ఫాసిజం అంటే సారంలో కార్పొరేట్ ఫాసిజం మాత్రమే)

భారత దేశంలో కొత్తగా ప్రభుత్వరంగ పరిశ్రమల స్థాపన జరిగినపుడు గానీ, పాత ప్రైవేటు పరిశ్రమలను ప్రైవేటు బ్యాంకింగ్, భీమారంగాలను జాతీయాకరణ చేసినపుడుగానీ ' భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక రాజకీయ మురిపెం వ్యక్తమైంది. ప్రభుత్వరంగం వల్ల భారత కార్మికవర్గానికి మేలు జరిగిందనుటలో సందేహం లేదు. అయితే అది రాజకీయ విప్లవదీక్షను పెంపొందించలేదు. తద్భిన్నంగా రాజకీయ భ్రమలను పెంచింది. నిజానికి ఇక్కడ ప్రభుత్వరంగ స్థాపన, జాతీయాకరణ, మెరుగైన కార్మిక చట్టాల వంటి సంస్కరణల వల్ల 1950వ దశాబ్దంలో భారత కార్మికవర్గానికి అభించిన మేలు గణనీయమైనది. కానీ దానితో పోల్చితే 1917లో కాడెట్ ప్రభుత్వం ద్వారా రష్యన్ కార్మికవర్గానికి జరిగిన మేలు అంతకంటే అనేక రెట్లు ఎక్కువే! అయినా రష్యన్ కార్మికవర్గంలో రష్యన్ బోల్షివిక్ పార్టీ దాన్ని ఆలంబనగా చేసుకొని రాజ్యాధికార సాధన దిశలో విప్లవదీక్షను పెంచింది. భారత

( మిగతాది 8 వ పేజీలో )

(7 వ పేజీ తరువాయి )

కార్మికవర్గంలో భారత కమ్యూనిస్టు పార్టీ అలాంటి రాజకీయ కర్తవ్యాన్ని చేపట్టడంలో విఫలమైనది. ఫలితంగా రాజ్యాధికారం సిద్ధించకపోగా ఆనాడు లభించిన జాతీయీకరణ ఫలాలన్నీ నేడు ఫాసిస్టు శక్తులు హరిస్తున్నాయి.

నాగటికర్రును దున్నే సమయంలో కంది చేనులో పోగొట్టుకొని, ఇంట్లో కందిపప్పులో వెతుక్కుంటే దొరకదు. భారతదేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో 'కమ్యూనల్ ఫాసిజం (ఇది సారంలో కార్పొరేట్ ఫాసిజమే) పెరుగుదలకు మూల కారణాలు ఒక చోట వుంటే, మరో చోట వెతుక్కుంటే దొరకవు. రోగ నిర్ధారణ సరైన డయాగ్నసిస్ జరగకుండా వ్యాధి నియంత్రణ చేయడం సాధ్యం కాదు. అదేవిధంగా ఈనాడు ఆరెస్సెస్ సాయుధ రాజకీయ వ్యవస్థ వల్ల కలిగే ఉపరితల దుష్ఫలితాలకు వ్యతిరేక పోరాటం చేపడితే సమగ్ర రాజకీయ ఫలితాలు లభించవు. నేటి దుష్ఫలితాలపై రేపటి సార్వత్రిక సమ్మె జరగబోతున్నది. ఒకనాటి పంట భూములు కూడా నేడు రొచ్చు గుంటలుగా మారి దుర్గంధ భూయిష్టమైన దోమల్ని ఉత్పత్తి చేస్తున్నాయి. దోమలపై డి.డి.టి పిచికారీ ఉపయోగకరమైనదే. అటువంటి ప్రక్రియ తరహాలోని తాజా సమ్మె పోరాటాలు ఖచ్చితంగా ప్రయోజనకరమైనవే. అదే సమయంలో దోమలను ఉత్పత్తి చేసే రొచ్చు గుంటలను పలుగు పారలతో పూడ్చిపెట్టే శాశ్వత లక్ష్యానికి అవి లోబడి వుండాలి. ఈ అవగాహన కొరవడితే శాశ్వత పరిష్కార దిశలో కార్మికవర్గాన్ని పురోగమింపచేయడం సాధ్యం కాదు.

రేపటి సార్వత్రిక సమ్మె విజయవంతం కావడంతో నేడు మోడీ-షా ప్రభుత్వం రద్దుచేసిన పాత కార్మిక చట్టాల పునరుద్ధరణ జరుగుతుందనే అత్యాశలు పెట్టుకోవడం కార్మికవర్గ విప్లవ శక్తులకూ, సంస్థలకూ తగదు. నేటి ప్రైవేటీకరణ ప్రక్రియను ప్రభుత్వం ఉపసంహరించుకుంటుందనే భ్రమలకు అవి గురికారాదు. నేటి సమ్మె డిమాండ్లు పరిష్కారమౌతాయనే భావనలు వుండరాదు. అట్టి ఆశలు లేదా భావనలు లేదా భ్రమలకు గురికావడం వల్ల నష్టం వుంటుంది. సమ్మె వల్ల డిమాండ్లు పరిష్కారం కాకపోతే, రేపటి సమ్మె విఫలమైనట్లుగా అవి నిరాశకు గురయ్యే ప్రమాదం వుంది. ఉదా:- రేపు రైల్వేలు, బి.ఎస్.ఎన్.ఎల్, భీమా, బ్యాంకింగ్, బొగ్గు వంటి రంగాలు ప్రైవేటీకరణ జరిగినప్పటికినీ, ఆ సంస్థలలో పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగ వర్గాలను విప్లవదీక్షతో సంఘటితం చేసే రాజకీయ, సైద్ధాంతిక విశ్వాసాన్ని నేడు అవి పెంపొందించుకోవాలి. ప్రభుత్వరంగంలో అవి వుంటే తాము సర్వీసులో వుంటామనీ, ఒకవేళ అవి ప్రైవేటు కార్పొరేట్ సంస్థల పరమైతే వాటిలో తాము ఉద్యోగులుగా, కార్మికులుగా పనిచేయడం కంటే, వాలంటీరీ రిటైర్మెంటు ద్వారా సర్వీసును వదులుకుంటామనే భావన నేడు సహజంగా వారిలో వ్యాప్తి చెందింది. వాటి ప్రభావం నేడు కార్మిక సంస్థల మీద కూడా బలంగా వుంది. అది కార్మిక సంస్థల రాజకీయ వైఫల్యాన్నీ, బలహీనతలనూ వెల్లడిస్తుంది. దానికి కారణం వాటికి రాజకీయ మార్గదర్శకత్వాన్ని అందించాల్సిన కమ్యూనిస్టు సంస్థల సైద్ధాంతిక తాత్విక వైఫల్యమే! ఇలాంటి సైద్ధాంతిక భావదారిద్ర్యం నుంచి అవి బయటపడాలి. లేకపోతే, తక్షణ ఆర్థిక విజయాలను అందించలేని రేపటి సార్వత్రిక సమ్మె తరహా పోరాటాలు కూడా కార్మికవర్గానికి నిరుత్సాహాన్నే మిగిలించుతాయి. అట్టి నిరాశాజనక పరిస్థితిని ఫాసిస్టు శక్తులు తమ ప్రతీఘాత రాజకీయ లక్ష్య సాధనకు ఉపయోగించుకొని మరింత బలపడతాయి.

రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరిస్తేనే కార్మికవర్గ పోరాటాలు, విజయాలు సాధించినట్లు కాదు. ఆ పోరాటాల ద్వారా కార్మికవర్గం ప్రదర్శించే ఐక్యత అత్యంత ముఖ్యమైన రాజకీయ విజయం. అట్టి పోరాటాల ద్వారా పెంచే వర్గకసి, వర్గచైతన్యం అత్యంత ముఖ్యమైనది. కార్మిక చట్టాలు లేని స్థితిలో బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వరంగ పరిశ్రమలు, సేవాసంస్థల్ని నేడు ప్రభుత్వం కారుచౌకగా అప్పగిస్తుంది. అట్టి కార్పొరేట్ సంస్థల క్రింద పనిచేసే కార్మిక, ఉద్యోగ వర్గాలలో కసిని పెంచి పోరాట సంసిద్ధులుగా వారికి ముందస్తు తర్ఫీదు ఇవ్వడం ముఖ్యమైనది. ఉదా :- రైల్వే వ్యవస్థ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం విజయం సాధించాలని కోరుకోవడం న్యాయమైనదే. కానీ ఒకవేళ ఆ పోరాటం ఫలించలేదని అనుకుందాం. అంబానీ, ఆదానీ వంటి బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వం దాన్ని కట్టబెట్టిందనుకుందాం. శ్రామికవర్గ విప్లవ సంస్థలు దాన్నొక సవాల్‌గా తీసుకోవాల్సి వుంది. నిజానికి వాటి మీద వర్గపోరాటాన్ని పదునెక్కించడానికి ఇప్పటికంటే ఎక్కువగా భౌతిక వనరు ఏర్పడుతుంది. వర్గపోరాటాలకు అంకితమైన సంస్థలకు అదో సానుకూల అంశమవుతుంది. ఒక్క రైల్వేని ఉదహరించాను. అది బొగ్గు, బ్యాంకింగ్, భీమా, టెలికామ్ నవరత్నాల వంటి అన్ని ప్రభుత్వరంగాలకు కూడా వర్తిస్తుంది. ఈనాడు మోడీ-షా ప్రభుత్వ అండతో కండకావరంతో విర్రవీగుతున్న బడా కార్పొరేట్ యాజమాన్యాలపై ఇప్పటికంటే విస్తృతంగా మరింత వర్గకసితో అశేష కార్మికవర్గం పోరాడే రాజకీయ సువర్ణావకాశాన్ని నేడు ' చరిత్ర ' శ్రామికవర్గ విప్లవ సంస్థలకు కల్పించింది. ప్రైవేటీకరణను ఒకవేళ నియత్రించలేని పక్షంలో చరిత్ర కల్పిస్తున్న ఈ నూతన రాజకీయ సువర్ణావకాశాన్ని అవి విప్లవ దీక్షతో సద్వినియోగం చేసుకోవల్సి వుంది.

అదేవిధంగా 8 గం॥లకు బదులు 9 గం॥లు లేదా అంతకంటే ఎక్కువ దీర్ఘ పనిదినం, పర్మినెంటు ఉద్యోగులకు బదులు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలు, మరింత పనిభారం పెంపుదల, ఇంకా మరింత హరించనున్న ఉద్యోగ భద్రత వంటి దుర్భర పరిస్థితులు మున్ముందు తలెత్తవచ్చు. రేపటి సమ్మెకు వెంటనే ఫాసిస్టు పాలకులు తలవంచకపోవచ్చు. అయినంత మాత్రాన రాజకీయంగా కార్మికవర్గ సంస్థలు బేజారెత్తిపోరాదు. ప్రభుత్వరంగం వున్నా, లేకపోయినా, పెట్టుబడి, శ్రమశక్తి ముఖాముఖిగా నిలచి పరస్పర యుద్ధం చేయాల్సిన భౌతిక పరిస్థితి మాత్రం వుండి తీరుతుంది. కమ్యూనిస్టు ఉద్యమశక్తులకి అదే వాస్తవ కర్తవ్యం. ప్రభుత్వరంగం స్థానంలో ప్రైవేటురంగంలో ఉనికిలోకి వచ్చినంత మాత్రాన వర్గపోరాట ప్రాతిపదిక అంతరించిపోదు. పైగా ప్రభుత్వరంగంలో కంటే ప్రైవేటురంగం వర్గపోరాటాల తీవ్రతకు ఎక్కువ భౌతిక అవకాశం ఏర్పడుతుంది. ఈ తరహా సైద్ధాంతిక, రాజకీయ, తాత్విక అవగాహనా వెలుగులో కార్మికవర్గాన్ని విప్లవీకరించడం శ్రామికవర్గ విప్లవ సంస్థల తక్షణ రాజకీయ కర్తవ్యం కావాలి. అట్టి ధీర్ఘకాలిక రాజకీయ లక్ష్య సాధన కోసం రేపటి సార్వత్రిక సమ్మెను ఒక మధ్యంతర సాధనంగా భావించి కమ్యూనిస్టు ఉద్యమ రాజకీయ శక్తులు కర్తవ్యోన్ముఖంగా మారాలి. అట్టి రాజకీయ వెలుగులో ముందుకు సాగుదాం.

---

( 4 వ పేజీ తరువాయి)

సత్యనారాయణ తదితర ఉపాధ్యాయ రత్నాలెందరో ఆచారిగారి ద్వారానే కమ్యూనిస్టులుగా రూపొందారు. నాగభూషణం పట్నాయక్ వంటి ఎందరెందరో మేధావులను రచయితలను, కళాకారులను ఆచారిగారే కమ్యూనిస్టులుగా మలిచారు. ఆరిక సోములు వంటి వందలాది మంది గిరిజన కార్యకర్తలను విప్లవోద్యమంలో దూకించారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఒక తరం పీడిత ప్రజలకు ఆచారిగారి పిలుపు ఒక పొలికేకగా పనిచేసింది. 1960వ దశాబ్దంలో జిల్లా వ్యాపితంగా యువతరాన్ని వుద్యమంవైపు ఆకర్షించడంలో ఆయనొక అయస్కాంతంగా పనిచేశారు. ఆయన మరణం కేవలం సి.పి.ఆర్.సి.ఐ (ఎం.ఎల్) కే లోటుకాదు. ఇది మొత్తం విప్లవోద్యమానికే లోటు! ఈ మరణం విప్లవ పక్షాలన్నింటికీ లోటు అట్టి లోటును భర్తీ చేయాలంటే, ఆయన నమ్మి, ఆచరించిన ప్రజాయుద్ధ పంథాలో విప్లవోద్యమాన్ని నిర్మించడమొక్కటే మార్గం అందుకు దీక్షాకంకణ బద్ధులమౌదాం ప్రజాయుద్ర పంథా అజేయమైనది. మార్క్సిజం - లెనినిజం మావో ఆలోచనా విధానం అజేయమైనది. అదే మార్గంలో అమరుడైన కా? రామలింగాచారి గారి విప్లవ జీవితం అనుసరణీయమైనది. ఆయన మార్గాన్ని అనుసరించటమే నిజమైన విప్లవనివాళి!

రామలింగాచారి అమర్ రహా! అమరుల ఆశయాలను సాధిద్దాం!

విప్లవ సంతాప వందనాలతో,

**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ,**
వి.వి.యస్ ఏరియా కమిటీ
తే.28-11-2003, (విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ఏరియా కమిటీ)

# తిరిగి లేచిన థాయ్‌లాండ్ విద్యార్థి ఉద్యమం

*విద్యార్థుల రక్తము చిందని పోరే లేదు! విద్యార్థుల త్యాగము రాయని చరితే లేదు! విద్యార్థి పాత్ర లేని విప్లవాత్మక మార్పే లేదు!*

కొన్ని దశాబ్దాల నిశబ్దం బడబాగ్నిగా మారింది. మదిలో నాటుకున్న మౌనం ఒక్కసారిగా లావాలా పగిలి నిశబ్దపు వీధుల్లో రణన్నినాదం చేసింది.

ప్రతిఘటనకి చిహ్నమైన మూడు వేళ్ళు గెస్టర్ గా చూపిస్తూ మిలిటరీ డామినేటెడ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రాచరికానికి వ్యతిరేకంగా ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. జరుగుతన్న ఉద్యమానికి నాయకురాలు థాయిలాండ్ విద్యార్థి సంఘ అధ్యక్షురాలు జుటటిప్ సిరిఖాన్. సంపూర్ణ ప్రజాస్వామ్యం, అందరికి సమానంగా హక్కులు కల్పించటం, ప్రజా సంక్షేమం, విద్యా, వైద్యం, ఆవాసం సహా ఇతర ప్రజావసరాలు తీర్చటంలో విఫలమైన తరతరాల బూజుగా మారిన రాజు పాలన, తన బంటు పాలన పైన గూడుకట్టుకున్న అసంతృప్తి జ్వాలలు ఫ్యూచర్ ఫార్వర్డ్ పార్టీని రద్దు చేయటంతో ఎగిసి రోడ్లని దిగ్బంధనం చేశాయి. థాయిలాండ్ విద్యార్థి ఉద్యమాన్ని పరిచయం చేసే ప్రయత్నం చేస్తాను.

పార్లమెంట్ మరియు రాజు కలిసిన కలగూర ప్రభుత్వం థాయిలాండ్‌లో నడుస్తుంటుంది. పార్లెమెంట్ నామమాత్రంగా ఉంటూ రాజుకే సర్వాధికారాలు ఉంటాయి. వారసత్వంగా వస్తున్న రాచరిక పదవులు అనుభవిస్తూ ప్రజల వెతలు పట్టించుకోని రాజుల పాలనపై థాయి ప్రజలు నిరసన గళం వినిపిస్తూనే ఉన్నారు. 1932లో ఎన్నికల ద్వారా ఎన్నుకోబడిన ప్రధాని " ఫ్రాయ మనోపకోరన్ నీతితడా " నుండి నేడు సైన్యం మద్దతుతో ఉన్న ప్రధాని "ప్రయుట్ చాన్ ఓ చన్ " వరకు అలాగే మొదటి రాజు "ప్రజాదిపోక్" నుండి నేటి రాజు " వజిరలోన్గకోరేం" వరకు అందరూ ప్రజా క్షేమాన్ని గాలికొదిలేసి జల్సాలు చేసేవారే. కమ్యూనిస్ట్ భావాలకి ఆకర్షితులైన విద్యార్థులు 1950 నుండి నెమ్మదిగా ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమం తీసుకున్నారు. అప్పటి కంజర్వేటివ్ పార్టీ దాని నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాని "ప్లేయక్ ఫిబున్" తీసుకుంటున్న అమెరికా అనుకూల విదానాలను ప్రశ్నిస్తూ విద్యార్థులు నిరసనలకు దిగేవారు. 1961 నుండి 1972 వరకు 5గా ఉన్న యూనివర్సిటీలు 17కి పెరగటంతో ప్రగతిశీల విద్యార్థుల సంఖ్య 15,000 నుండి 1,50,00కు చేరింది. 1968 వరకు రాజులను ప్రశ్నించిన విద్యార్థులు ప్లేయక్‌ని సైనిక తిరుగుబాటు ద్వారా కూలదోసి ప్రధాని పదవిని కైవసం చేసుకోవటం తదితర అంశాలు వ్యవస్థలో మార్పుకై విద్యార్థులు నినదించే స్థాయికి ఎదిగి ఎక్కడిక్కడ కొన్ని గ్రూప్‌లు కట్టి రాజకీయాలు చర్చించటం మొదలు పెట్టారు. మేథో చర్చలు సాగించారు.

## నేషనల్ స్టూడెంట్ సెంటర్ ఆఫ్ థాయిలాండ్ ఏర్పాటు

1970 రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో స్వతంత్రంగా ఉన్న విద్యార్థులు ఒక సంఘం (ఎన్.ఎస్.సీ.టీ) కిందకి సమీకరించబడ్డారు. ఫలితంగా 11 యూనివర్సిటీలు (చూలాలన్గకోరేం, తమ్మాసత్, కాసెత్సర్ట్, సిల్పకోరిన్, మహిదోల్, చియాంగ్ మయి, ఖోన్ కెన్, ప్రిన్స్ ఆఫ్ సొర్కలా, ప్రసన్మిట్, బంగాసెన్, పటుంవాన్) నుండి ఇద్దరు చొప్పున కమిటీ ని ఎన్నుకోవటం జరిగింది. కానీ అందరూ ఆశ పడినట్లుగా ఈ కమిటీ రాజకీయ కర్తవ్యాన్ని మొదలు పెట్టలేదు. కమ్యూనిటీ సేవా, నూతన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వటం, టెలివిజన్ కార్యక్రమాల్లో అప్పటి రాజు భూమిబోల్‌ని పొగిడే పనిలో మునిగిపోయింది. రాజ వంశీకులను స్తుతించే క్రియని ఎంచుకున్నది. కానీ 1972లో చులలోంగ్కోర్న్ యూనివర్సిటీ నుండి ఎన్.ఎస్.సీ.టీకి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడిన ఇంజనీరింగ్ విద్యార్థి తిరియుత్ బూన్మీ సంఘం యొక్క అసలు కార్యాచరణ మొదలుపెట్టి రాజకీయ కార్యక్రమాలు మొదలుపెట్టి సంఘాన్ని క్రియాశీలం చేశారు. రాజుకి, ప్రధానికి వ్యతిరేకంగా రాజకీయ కార్యక్రమాలు ఇవ్వడంలో తిరియుత్ దిట్ట.

ప్రధానిగా ఉన్న మార్షల్ తానోమ్ ని పదవీచ్యుతుడ్ని చేయటానికి జరిగిన ఉద్యమం విజయం సాధించింది. 1972 నవంబర్ నెలలో NSCT జపాన్ వస్తువుల బహిష్కరణకు పిలుపినిచ్చింది. పది పాయింట్ల ఆర్థిక పాలసీని తనోమ్ ప్రభుత్వం ముందు ఉంచింది. జపాన్ వస్తువుల బహిష్కరణ పిలుపు తనోమ్ ప్రభుత్వపై పరోక్ష దాడికి ఇచ్చినది. అది విజయవంతం అయిన వెంటనే ప్రభుత్వం తీసుకొచ్చిన నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ డిక్రీ నెంబర్ 299కి వ్యతిరేకంగా కఠినమైన వైఖరిని తీసుకోని దాని రద్దుకై పోరాడి విజయం సాధించారు.

## 1973 అక్టోబర్ విద్యార్థి ఉద్యమం

1973 ఏప్రిల్‌లో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంగా కూలిన మిలిటరీ హెలికాప్టర్ దుర్ఘటనలో విచారణ జాప్యాన్ని ప్రస్తావిస్తూ 1973 జూన్‌లో రాంఖామ్హేన్గ్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సెటైర్లు వేసినందుకు వారిని సస్పెండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం తనోమ్ పదవీ కాలాన్ని మరో సంవత్సరం పాటు పొడిగిస్తూ అన్ని యూనియర్సిటీలను మూసివేయాలని నిర్ణయించింది. (ఎన్.ఎస్.సీ.టీ) ప్రజల పక్షం ఉంటూ ప్రజల మన్ననలు పొందుతున్న సమయంలోనే అనేక నిర్బంధాలను చవి చూసింది. సైనిక పాలనకు వ్యతిరేకంగా అక్టోబర్ 6 నాడు బ్యాంకాక్‌లో కరపత్రాలు పంచుతున్న విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కి తీసుకెళ్ళటంతో పాటు వారి ఇండ్లల్లో సోదాలు చేశారు. పూర్తి స్థాయి రాజ్యాంగాన్ని అమలు చేయాలని కోరుతున్న కొంగకియేట్‌ని అక్టోబర్ 7 నాడు అరెస్టు చేస్తారు. అక్టోబర్ 8 నాడు విద్యార్థి నాయకుల బెయిల్ నిరాకరించబడింది. అక్టోబర్ 9 నాడు తమ్మసత్ యూనివర్సిటీ విద్యార్థులు 2,000 మంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించారు. వివిధ యూనివర్సిటీల విద్యార్థులు , ప్రొఫెసర్లు, మాజీ పార్లమెంట్ సభ్యులు వారికి సంఘీభావం ప్రకటించారు. అక్టోబర్ 10 నాడు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో బ్యాంకాక్ నగరం దద్దరిల్లి పోయింది. ఈ ఉద్యమ కారులతో చర్చించటానికి అక్టోబర్ 11 నాడు డిప్యూటీ ప్రధాని ప్రఫాస్ అంగీకారం తెలిపినప్పటికీ 13 మంది తమ నాయకులను విడిచి పెట్టాలని పట్టు పట్టడంతో అందుకు ప్రఫాస్ అంగీకరించలేదు. అప్పటికే విద్యార్థుల సంఖ్య 50,000 కి చేరుకోవటంతో నిరసన స్థలాన్ని తమ్మసత్ యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలోకి మార్చారు. అక్టోబర్ 12 నాడు ప్రభుత్వం తమ కస్టడీలో ఉన్న 13 మంది విద్యార్థి నాయకులను షరతులతో విడిచి పెడతాం అని ప్రకటించింది. విద్యార్థి నాయకత్వం షరతులను వ్యతిరేకించింది. ఎటువంటి షరతులు లేకుండా తమ 13 నాయకులను విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. 13 మంది విద్యార్థి నాయకులను విడిచి పెట్టాలని అక్టోబర్ 13 నాడు 4,00,000 మంది విశాల ప్రజా రాసులతో డెమోక్రసీ మాన్యుమెంట్ వైపు ప్రదర్శనగా బయల్దేరారు. వెనువెంటనే ప్రభుత్వం వారి డిమాండ్లకు అంగీకరించి శాశ్వత, పూర్తి స్థాయి రాజ్యాంగాన్ని అమలు చేస్తాం అని ప్రకటించింది. ఫలితంగా విద్యార్థులు వెను తిరిగారు. కానీ అక్టోబర్ 14 నాడు సెక్సాన్ నాయకత్వంలో 2,00,000 మంది రాజు నుండి ప్రకటన కొరకు రాజమందిరానికి బయల్దేరి వెళ్లగా రాజు పోలీసులతో లాఠీ చార్జి చేపించి, కాల్పులు జరపడంతో సుమారు 77 మంది మరణించారు. 857 మంది గాయపడ్డారు. విద్యార్థి ఉద్యమం ఫలితంగా తానోమ్ పదవీచిత్యుడై సైనిక పాలన ముగిసింది.

## అక్టోబర్ 6, 1976 మారణకాండ

1973లో తానోమ్‌ని పదవి నుండి దింపేసినంక ప్రజల్లో ప్రజాస్వామ్యం పట్ల అవగాహన ఏర్పడింది. ప్రశ్నించటం అలవర్చుకున్నారు. అన్యాయానికి ఎదురుతిరగటం మొదలుపెట్టారు. చైనా ప్రభావంతో కమ్యూనిస్టు బీజాలు పడసాగినై. ఇది గిట్టని రాజు తానోమ్‌ని మళ్ళీ అధికారంలో కూర్చో పెట్టాలని చూస్తుండటాన్ని గమనించిన ప్రజలు అక్టోబర్ 5 నాడు ఆందోళనకు దిగారు. ముగిసిన సైనిక నియంతృత్వాన్ని

( తరువాయి 10వ పేజీలో)

( 9 వ పేజీ తరువాయి )

తెర పైకి తీసుకురావాలని తానామ్ ని బ్యాంకాక్‌లోని వాట్ బౌవున్నివెట్ విహార్‌లో రాజు, రాణి కలవటాన్ని జీర్ణించుకోలేని ఆందోళన కారులు నిరసన ప్రదర్శనలకి పిలుపు నిచ్చారు. సమ్మత్ యూనివెర్సిటీ దాని పక్కనే ఉన్న ననవ్ లాఉంగ్ యూనివర్సిటీలో ఆందోళనకారులు తలదాచుకున్నారు. ఉదయం 5:30 కల్లా పోలీసులు యూనివర్సిటీ ద్వారాలు మూసి వేసారు. బ్యాంకాక్ పోలీస్ అధికారి ఆదేశాల మేరకు బోర్డర్ పెట్రోల్ పోలీస్ ఆందోళనకారుల పై కాల్పులు జరిపారు. యుద్ధంలో వాడే రైఫిల్స్, గ్రెనేడులు, మెషిన్‌గన్స్‌తో విచ్చల విడిగా కాల్పులు జరుపుకుంటు హింసాకాండకు తెగబడ్డారు. దొరికిన వాళ్ళని దొరికినట్లే చంపేశారు. లొంగిపోయిన వారిని లోదుస్తులతో సహా విప్పించి నిల్చోబెట్టారు. సుమారు 46 మంది చనిపోయారు. వందల మంది గాయపడ్డారు. ఇక్కడ విద్యార్థుల నాయకత్వంలో ఆందోళనకారులు కాంక్షించినట్లుగా తానోమ్ ని మళ్ళీ ప్రధానిగా కాకుండా అడ్డుకోగలిగారు. అక్టోబర్ 6, 1976 మారణకాండ మూలంగా అప్పటి వరకు అధికారంలో ఉన్న ప్రజాస్వామికవాది సేని ప్రమోజ్‌ని అధికారం నుండి దింపేసి మళ్ళీ సైన్యాధికారి సంగధ్ చాలొర్యు అధికార పగ్గాలు చేజిక్కించుకున్నాడు.

## 2020 విద్యార్థి ఉద్యమం

గడిచిన 90 ఏండ్లుగా ఎన్నుకోబడిన ప్రభుత్వాలు సైనిక తిరుగుబాట్ల ద్వారా కూలిపోతున్నాయి. సైన్యాధికారులు పాలన సాగిస్తూ వస్తున్నారు. ప్రజల ప్రతిఘటన తీవ్ర రూపం దాల్చిన ప్రతిసారి సైన్యం దిగిపోతూ ఎన్నుకోబడిన ప్రభుత్వాలు పాలన చేస్తున్నవి. ఫీయుథాయ్ పార్టీకి చెందిన ప్రధాని యింగ్లక్ షినవాత్ర 5 ఆగస్టు 2011 నుండి 7 మే 2014 వరకు అధికారంలో కొనసాగింది. ఈమె థాయిలాండ్ దేశానికి తోలి మహిళా ప్రధాని. ఈమె 9 డిసెంబర్ 2013 నాడు పార్లమెంట్‌ని రద్దు చేసుకొని ముందస్తు ఎన్నికలకి వెళ్లాలని నిర్ణయించుకోవటంతో ఈ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం అని కాన్స్టిట్యూషనల్ కోర్ట్ ఆమెని ఏకగ్రీవంగా పదవి నుండి తొలిగించింది. ఆమె స్తానంలో అదే పియూ థాయి పార్టీకి చెందిన నివత్తమురోర్న్‌ని తాత్కాలిక ప్రధానిగా ఎన్నుకున్నారు. ఇతను 7 మే 2014 నుండి 22 మే 2014 వరకు 15 రోజులు పాలన సాగించాడు. నిజానికి పియూ తాయి పార్టీ 2011లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 135 పార్లమెంట్ సీట్లు గెలుచుకొని అతి పెద్ద పార్టీగా అవతరించి అధికారం చేజిక్కించుకుంది. ప్రలంగ్ ప్రచరత్ పార్టీ 115సీట్లు గెలుచుకొని రెండవ స్థానంలో ఫ్యూచర్ ఫార్వర్డ్ పార్టీ 54 సీట్లు గెలుచుకొని మూడవ స్థానంలో నిలిచాయి.

అక్టోబర్ 2010 నుండి అక్టోబర్ 2014 వరకు థాయి ఆర్మీ చీఫ్‌గా ఉన్న ప్రాయుత్ 2013లో దేశంలో ఏర్పడిన రాజకీయ సంక్షోభంలో మీది పిల్లి పాత్ర వహించి తటస్థ వైఖరిని అవలంబించాడు. కాచుకు కుర్చున్న నక్కలా సంక్షోభంలో రాజు వజిరంగ్‌కి దగ్గరయ్యాడు. ఫలితంగా 22మే నాడు సైనిక పాలనలో ప్రాయుత్ ప్రధాని అవతారం ఎత్తాడు. దీనికి వీరు పెట్టుకున్న వేదిక పేరు నేషనల్ కౌన్సిల్ ఫర్ పీస్ అండ్ ఆర్డర్. 2017లో తీసుకొచ్చిన నూతన రాజ్యాంగంలో సెక్షన్ 272లో ఎన్నికల్లో పోటీ చేయని ఏ పార్టీ కి సంభంధం లేని రాయల్ ఆర్మీ నుండి సెనేట్ సభ్యులను ఎన్నుకోవచ్చు. అంతిమంగా ఇది సైనిక పాలనని అలానే సుస్థిరం చేసే నూతన రాజ్యాంగం. ఎన్నికల్లో పోటీ చేసే పార్టీల్లో కొన్ని ప్రాయుత్ కి విధేయంగా ఉంటూ ఈ మార్పుకు మద్దతునిచ్చాయి. 2014 నుండి ఆగిపోయిన సాధారణ ఎన్నికలు తిరిగి 2019లో జరిగాయి. అందులో ఫెయు థాయి పార్టీ 135 స్థానాలు, ప్రలంగ్ ప్రచరత్ పార్టీ 115 స్థానాలు గెలుచుకొని రెండవ స్థానంలో, ఫ్యూచర్ ఫార్వర్డ్ పార్టీ 54 స్థానాలు గెలుచుకొని మూడవ స్తానంలో నిలిచాయి. ఇందులో ఫెయు థాయి పార్టీ ప్రాయుట్ కనుసన్నుల్లో నడిచేది. ఫలితంగా ప్రాయుట్‌ని ప్రధానిగా బలపరచింది. ప్రాయుట్ ఇంకా కొన్ని సంప్రదాయ పార్టీలను జమ చేసుకొని NCPO పేరుతొ అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. నేటికీ తను పార్లమెంట్ సభ్యుడు కాదు. ఫ్యూచర్ ఫార్వార్డ్ పార్టీ ప్రగతిశీల ఆలోచనలు కలిగిన పార్టీ. ఇందులో విద్యార్థి, యువకులు పాల్గొని గెలిచారు. ఇది రాజ వారసత్వానికి, సైనిక పాలనకు వ్యతిరేకమైనది. వ్యవస్థలో సంపూర్ణ మార్పు కోరుకుంటున్న పార్టీ. ప్రాయుట్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ ఫార్వర్డ్ పార్టీని రద్దు చేస్తున్నట్లు ఆ పార్టీకి చెందిన 54 మంది పార్లమెంట్ సభ్యుల అర్హతను రద్దు చేశాడు. అప్పటికే ప్రాయుట్ మరియు రాజు పట్ల విసిగి ఉన్న విద్యార్థి లోకం మళ్ళీ గర్జించింది. అప్రజాస్వామికంగా ఒక పార్టీని రద్దు చేయటంతో మొదలైన విద్యార్థి ఉద్యమం పాలనలో మార్పు కొరకు అడుగులేస్తోంది. లాక్డౌన్ కి ముందు మొదలైన ఉద్యమం అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చి లాక్డౌన్ కాలాన పరిమితంగా ఆందోళనలు చేశారు.

### మొదటి వెల్లువ (వేవ్) - ఫిబ్రవరి

23 ఫిబ్రవరి, 2020 నాడు కాన్స్టిట్యూషన్ కోర్ట్ ద్వారా ఫ్యూచర్ ఫార్వర్డ్ పార్ట్ రద్దు గావించబడటంతో విద్యార్థుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తమ్మసత్, చూలాలన్గకోరేం, రాంఖంహేంగ్, కాసెట్సుర్ట్, శ్రీనక్రింవిరాట్, ప్రిన్స్ ఆఫ్ సొంగకాల విశ్వవిద్యాయాలల్లో అలాగే అనేక పాఠాశాలలో ఫిబ్రవరి 24 నాడు నిరసన ప్రదర్శనలు చేశారు. సామాజిక మాధ్యమాలు అయిన ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్‌లలో హ్యాష్ టాగ్‌లతో తమదైన శైలిలో నిరసన తెలియచేసారు. కోవిడ్-19 ఆంక్షల దృష్ట్యా ఆందోళనలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి.

### రెండవ వెల్లువ (వేవ్) - జులై నుండి ఇప్పటి వరకు

తిరిగి 18 జులై 2020 నాడు మూడు ప్రధాన డిమాండ్లతో బ్యాంకాక్ లోని ప్రజాస్వామ్య చిహ్నం వద్ద 2,500 మందితో ప్రదర్శన నిర్వహించారు. ఫ్రీ యూత్ బ్యానర్ కింద విద్యార్థులు ఐక్య వేదిక కట్టారు. మూడు డిమాండ్లను విద్యార్థి లోకం ప్రాయుట్ ప్రభుత్వం ముందు ఉంచింది. డిమాండ్లు వరుసగా

1. పార్లమెంట్‌ని రద్దు చేయటం, 2. ప్రజలపైన సాగుతున్న దాడులను నిలిపివేయాలి, 3. కొత్త రాజ్యాంగాన్ని రద్దు చేయటం.

18 జులై తర్వాత దేశ వ్యాపితంగా ఆందోళనలు తీవ్ర రూపాం దాల్చాయి. పై డిమాండ్లతో పాటు రాచరిక వ్యవస్థలో సంస్కరణలకై క్రింది డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు.

1. చట్టాల రూపకల్పనలో రాజుకు ఉన్న అధికారాలను ఉపసంహరించుకోవాలి. 2. క్రూర చట్టాలను ఉపసంహరించుకోవాలి. ఈ చట్టాల కింద హింసింపబడిన ప్రతి వారికి నష్టపరిహారం చెల్లించాలి. 3. రాజు వ్యక్తిగత మరియు రాజ ప్రసాదాల ఆస్తులను వేరు చేయాలి. 4. రాచరికానికి కేటాయించిన బడ్జెట్‌ను తగ్గించండి. 5. రాయల్ కార్యాలయాలు మరియు ప్రివి కౌన్సిల్ వంటి అనవసరమైన యూనిట్లను రద్దు చేయాలి. 6.రాచరికం యొక్క ఆస్తులను ఆడిట్ చేయడానికి అనుమతించాలి. 7. బహిరంగ రాజకీయ వ్యాఖ్యలు చేసే రాజు శక్తిని నిలిపివేయాలి. 8. రాజు మరియు రాజ కుటుంబీకులను పొగుడుతూ చేస్తున్న ప్రచారాలు మానేయాలి. 9. రాచరికాన్ని వ్యతిరేకించి హత్యకు గురైన వారికి న్యాయం చేయాలి, ఆ కేసులను శోధించాలి. 10. భవిష్యత్తులో సైనిక తిరుగుబాట్లు వంటివి జరగకుండా రాజు పదవిని రద్దు చేయాలి.

పెరుగుతున్న నిరుద్యోగం, కోవిడ్-19 అరికట్టడంలో పాలకుల వైఫల్యం, ప్రజల కనీస అవసరాలు తీర్చలేని స్థితిలో ఉన్న ప్రభుత్వం ఇతర దేశాల అభివృద్ధికి ఋణ సహాయం చేయటం, ఎండీకే వంటి కుంభకోణాలు, పడిపోతున్న జిడిపి ని వృద్ధి చేయలేని అసమర్ధ పాలకుల పట్ల విసిగి వేసారిన విద్యార్థి, యువతరం గతంలా కాకుండా సరికొత్త మార్పుకై నినదించటం మొదలుపెట్టింది. ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న విద్యార్థి ఉద్యమ జ్వాలలను ఆర్పివేయటానికి విద్యార్థి నాయకులను కిడ్నాప్ చేయటం, అక్రమ అరెస్టులు చేయటం సాగించింది. అయినా బెదిరిపోని విద్యార్థి సేన ప్రాయట్ పదవి నుండి దిగిపోవాలని, రాజుకు ఉన్న అధికారాలు రద్దు చేసి విప్లవాత్మక మార్పులు తేవాలని నినదిస్తూనే ఉన్నారు. రాజు అనుకూల, అననుకూల ప్రదర్శనలతో బ్యాంకాక్

( మిగతాది 12 వ పేజీలో )

# అర్నాబ్ గోస్వామి బెయిల్ వ్యవహారం న్యాయ వ్యవస్థ తీరు - ఒక పరిశీలన

అర్నాబ్ గోస్వామి. ఈయన ఒక వివాదాస్పద జర్నలిస్ట్. ఆయన ఒక కేసులో ముద్దాయి. కేంద్రంలో అధికారంలో ఉన్నవారికి మిత్రుడు. ఆయన కేసులో బెయిల్ మంజూరు వ్యవహారం కూడా వివాదాస్పదమైనదే. ఎందుకంటే ఒక వారం పది రోజుల వ్యవధిలోనే ఈయన కేసు బెయిల్ దరఖాస్తు వ్యవహారం కింది కోర్టు నుండి సుప్రీం కోర్టు వరకు వచ్చింది. సుప్రీంకోర్టులో కూడా దరఖాస్తు చేసిన వెంటనే అత్యవసర కేసుల జాబితాలో లిస్టు అయినది. అంతేకాకుండా బెయిలు కూడా వెంటనే మంజూరు చేయబడింది. దీనితో గోస్వామి కేసు విచారణ, బెయిలు మంజూరులో రూల్ ఆఫ్ రోస్టర్ సిస్టంని న్యాయస్థానాలు పాటించలేదు. ఇదే అంశం ప్రజల ముందుకు చర్చకి వచ్చింది. అదేకాకుండా భావ ప్రకటన స్వేచ్ఛను సైతం నేరంగా కోర్టులు పరిగణిస్తున్నాయని చాలా మంది స్పందించి మాట్లాడుతున్నారు. అర్నాబ్ గోస్వామి కేసు బెయిల్ వ్యవహారం వెనక్కి వెళ్లి న్యాయవ్యవస్థ వ్యవహారశైలిపై సమాజంలో చర్చ మరోసారి ప్రారంభమైంది. ప్రజాస్వామ్యం అంటే ఇదేనా? అని పౌరులు కొంతమంది నిలదీస్తున్నారు. ఈ సందర్భంగా కేసులు విచారణపై పలు సందేహాలు, అనుమానాలు, ప్రశ్నలు ప్రజల్లో కలుగుతున్నాయి. న్యాయవ్యవస్థ పని తీరును ఒకసారి పరిశీలిద్దాం.

న్యాయవ్యవస్థ కేసుల విచారణ ఒక పద్ధతి ఉంది. ఆ పద్ధతిని రూల్ ఆఫ్ రోస్టర్ సిస్టం అని పిలుస్తారు. ఈ సిస్టం సుప్రీం కోర్టు నుండి దిగువన ఉన్న మేజిస్ట్రేట్ కోర్టుల వరకు పాటిస్తారు. రూల్ ఆఫ్ రోస్టర్ సిస్టం కేసు నంబర్లు వేయడానికి, విచారణకు, జడ్జిలను కేటాయించడానికి వర్తిస్తుంది. అత్యవసర కేసులను విచారించడానికి జిల్లా కోర్టులో మేజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో ఔట్ అఫ్ ఆర్డర్ పిటిషన్‌తో ఫైల్ చేయాలి. హైకోర్టు, సుప్రీంకోర్టు అత్యవసర కేసులను న్యాయమూర్తులు బెంచీ ఎక్కిన వెంటనే మెన్షన్ చేయాలి. అవి అత్యవసరంగా విచారణ చేయడానికి అర్హమైనవా? కావా? అని న్యాయమూర్తులు నిర్ధారించి కోర్టు స్లిప్లను జారీ చేస్తారు. కేసు విచారణకు అదేరోజు లంచ్ మోషన్‌లో స్లిప్‌లు జారీ చేసిన కేసులు విచారణకు వస్తాయి.

కేసుల విచారణకు న్యాయమూర్తులు అనుమతి మంజూరులో పేద ధనిక తేడా ఉంటుంది అనేది పౌరుల భావన. అందుకే పౌరులు ఇది ఏమి ప్రజాస్వామ్యం అని ప్రశ్నిస్తున్నారు. అలా ప్రశ్నించినా లేదా తమ అభిప్రాయాలను వెలిబుచ్చిన వారిపై సైతం కోర్టులు కోర్టు ధిక్కార నేరం కింద సుమోటోగా కొన్ని కేసులు తీసుకుంటున్నాయి. కేసు విచారణ, తీర్పు పైనే కాక కొంతమంది న్యాయమూర్తుల ప్రవర్తనల పైన ఉన్నతంగా ఉండాలని అభిప్రాయాలు వెలిబుచ్చినా, తెలిపినా కొన్నిసార్లు కోర్టు ధిక్కార కేసు ఎదుర్కొనవలసి వస్తుంది. అందుకే ప్రజలు కోర్టు తీర్పుపై విచారణ పైన స్పందించి తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. రూల్ ఆఫ్ రోస్టర్ సిస్టం ఎక్కడ? ప్రజాస్వామ్యం ఏది? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు న్యాయవ్యవస్థ జవాబు పౌరులకు ఇవ్వాల్సిందే.

**రూల్ ఆఫ్ రోస్టర్ సిస్టం**

సుప్రీం కోర్ట్ అడ్మినిస్ట్రేషన్ సౌలభ్యం కోసం తనకు తాను రూపొందించుకున్నదే ఈ " రూల్ ఆఫ్ రోస్టర్ సిస్టం". ఈ పద్ధతి ప్రకారం ముందుగా వచ్చే కేసులు ముందుగా నంబర్ అయి బెంచి మీదకి వెళ్ళాలి. ఈ పని చేయటానికి హైకోర్టు, సుప్రీంకోర్టులలో రిజిస్ట్రీ ఉంటుంది. రిజిస్ట్రార్ జనరల్ ఉంటారు. జ్యూడిషియల్ రిజిస్ట్రార్ ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి కేసుల లిస్టులను తయారుచేస్తారు. అలా తయారు చేయబడిన లిస్ట్ లోని కేసులు విచారణ కొరకు బెంచ్‌కి వస్తాయి. కేసుకు సంబంధించిన న్యాయమూర్తులు కేసు వాదనలు విని, డాక్యుమెంట్స్ పరిశీలించి స్టేటస్‌కో లేదా స్టే లేదా డైరెక్షన్ కి సంబంధించిన ఉత్తర్వులుని మంజూరు చేస్తారు. లేదా కేసులో లా పాయింట్ లేకపోతే డిస్మిస్ చేస్తారు లేదా ప్రతివాదులకు న్యాయస్థానం నోటీస్ జారీ చేస్తుంది.

ఇక్కడే న్యాయ వ్యవస్థ గాడి తప్పుతుంది అనే ఆరోపణలు సమాజం లో కొంతమంది నుండి ఎదుర్కొంటున్నది. Before law, all are equal అనే సూత్రంకి విఘాతం కలుగుతుంది అని పౌరుల భావన, స్పందన. న్యాయం అందిచటంలో పేద, ధనిక తేడా ఉంది. న్యాయమూర్తులు రిటైర్మెంట్ అయ్యేటప్పుడు బహిరంగంగానే చెపుతున్నారు. ధనవంతులు కేసులు, అధికార పక్షం మిత్రుల కేసులు, పలుకుబడి కలిగిన వారి కేసులు వేగవంతం కాబడి క్షణాల్లో, గంటల్లో, రోజులలో దోషులు అయిన నిరపరాధులుగా బయట పడుతున్నారు అని ప్రజలు అనుకుంటున్నారు. అదే పేదవాడు, సామాన్యుడు, అధికారబలం లేనివారు, ప్రత్యామ్నాయ భావజాలం (ప్రజాస్వామిక వాదులు, కమ్యూనిస్టులు) కల్గిన వారు, ప్రతిపక్షంలో ఉన్నవారికి న్యాయం ఆమడ దూరంలో ఉంది అనేది ప్రజల భావన. గోస్వామికి ఒకన్యాయం. వి.వికి అతని జైల్ సహచరులకు ఒక న్యాయమా? పౌరస్వేచ్ఛ అందరికి ఒకేలా ఉండాలి. అలా ఎందుకు లేదు అనేది ఇక్కడ ప్రశ్న. ఇదేనా ప్రజాస్వామ్యం.

అత్యవసర కేసుల విచారణకు లంచ్ మోషన్ ఉంటుంది. లంచ్ మోషన్‌లో కేసు విచారణకు రావాలంటే సంబంధించిన న్యాయవాది మెన్షనింగ్ సమయంలో న్యాయమూర్తికి కేసులోని అర్జెన్సీని వివరించి కోర్ట్ స్లిప్ తీసుకోవాలి. ఇలా న్యాయస్థానం కోర్ట్ స్లిప్‌లను మంజూరు చేయడం ద్వారా న్యాయస్థానం అత్యవసర కేసులని విచారించి తగిన ఆర్డర్లు ఇవ్వడం జరుగుతుంది.

కేసుల విచారణ చేయడం కోసం అనుమతి మంజూరు చేయడం, విచారించడం, తీర్పులు ఇవ్వడంలో ధనిక,పేద తేడా ఉంది అనేది పలు కేసుల్లో చర్చకి సమాజం నుండి వచ్చింది. పౌరులు ఇదేమి పద్ధతి అంటు న్యాయవ్యవస్థ పని తీరుని ప్రశ్నిస్తున్నారు. అలా ప్రశ్నించిన వారిపై లేదా అభిప్రాయం వ్యక్తీకరణ చేసిన వారిపై కోర్ట్ ధిక్కారం అంటు పౌరులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇది న్యాయవ్యవస్థ ప్రతిష్టకి దెబ్బ. అందుకే నేడు న్యాయవ్యవస్థ పౌర స్వేచ్ఛను తన విషయంలో గుర్తించదా? ఇదేమి ప్రజాస్వామ్యం అని పౌర సమాజంలోని పౌరులు ప్రశ్నిస్తున్నారు. అది పౌరులు ప్రశ్న. సమాజమే ప్రజా కోర్టు. అదే అత్యున్నతం. దాని ముందు ఏ వ్యవస్థ అయినా సమాధానం చెప్పాలి. విచారణ పద్ధతులే కాకుండా సామాజిక విషయాలకు సంబంధించిన కేసుల్లో తీర్పులు సహితం రాజ్యాంగాన్ని, చట్టాన్ని తుంగలో తొక్కి తీర్పులు ఇచ్చారు. అనేది సమాజం నుండి ఉన్నత న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోపణ.

అసలు కొన్ని తీర్పులు రాజ్యాంగ లక్ష్యాలుకి విరుద్ధంగా వెలివడినవి అనేది ప్రధాన విషయం. అలాంటి తీర్పుల్లో మచ్చుకు 1. ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌లో తీర్పు, 2.ఆదివాసీలని అడవి నుండి గెంటివేసి సహజవనరులను కార్పొరేట్‌లకు కట్టబెట్టే కుట్రలో ఓ ఎన్‌జీఓ సంస్థ వేసిన కేసులో ఆదివాసీలకి వ్యతిరేకమైన తీర్పు. 3. అయోధ్య కేసులో తీర్పు. సామాజిక బాధ్యతలను విస్మరించి రిజర్వేషన్లపై కామెంట్లు ఈ మూడు తీర్పులలోను, రిజర్వేషన్లపై కామెంట్‌లు న్యాయవ్యవస్థ ప్రతిష్ట సమాజంలో బాగా దెబ్బతిందనేది ప్రజాస్వామిక వాదుల ఆవేదన.

అర్నాబ్ గోస్వామి కేసు సుప్రీంకోర్టు అర్జంట్ లిస్ట్ చేయటం కేసుల విచారణ పద్ధతికి వ్యతిరేకం.

భారతీయ న్యాయవ్యవస్థలో ధనవంతులు, అధికార పక్షం వారికి మాత్రమే న్యాయం జరుగుతుంది. ఆ విషయం అర్నాబ్ గోస్వామి కేసుతో మరో సారి రుజువు అయింది. ఆర్నాబ్ గోస్వామి అరెస్ట్ చేయబడి వారం పది రోజులు అయిందో లేదో గోస్వామి వర్గం, వారి రాజకీయ మనువాద మిత్రులు గగ్గోలు పెడుతున్నారు. గోస్వామి దేశం కోసమో, సమాజం కోసమో పని చేసిన వాడు కాదు. ఆయన ఆర్కిటెక్ డిజైనర్ అన్వయ నాయక్ అతని

( మిగతాది 12 వ పేజీలో )

(10వ పేజీ తరువాయి)

దద్దరిల్లిపోయింది. రాణి వెళ్తున్న కాన్వాయిని అడ్డుకొని మా సుంకాలతో మీ జల్సాలు అనే నినాదాలతో హోరెత్తించారు. తీవ్ర కోపానికి గురైన రాజు ఎమర్జెన్సీ విధించేట్లుగా తన బంటు ప్రధాని ప్రాయట్‌ని ఆదేశించటంతో అక్టోబర్ 15 నాడు దేశ వ్యాపితంగా ఎమర్జెన్సీని విధించి అక్రమ అరెస్టులను తీవ్రతరం చేశారు. హక్కుల కార్యకర్తలను, న్యాయవాదులను కూడా విడిచి పెట్టకుండా ఇండ్లల్లో నుండి ఎత్తుకుపోతున్నారు. బెయిల్‌కి అప్లై చేస్తే బెయిల్ కోర్టులు నిరాకరిస్తున్నాయి. ప్రాయుట్, రాజు వజిర్మన్‌లు అన్ని వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకున్నారు.

ఏ దేశ చరిత్ర చుసిన ఏమున్నది గర్వకారణం మానవ హక్కుల హననం, భయంకర చట్టాల రూపకల్పన అమలు చేయటం, ప్రశ్నించే గొంతులను బంధించటం. ఇది ఇవ్వాళ అన్ని దేశాల పాలకులకు నిత్య కృత్యం అయింది. ట్యునీషియాలో జరిగిన జాస్మిన్ విప్లవం వలే ఇక్కడ జరుగుతున్న ఆందోళనలు కూడా ఒకరిని దింపి మరొకర్ని గద్దె దింపే ప్రహసనమే కానీ వేర్ల నుండి పెకిలించే మార్పు కోసం జరిగే పోరాటం కాదని మనం అర్థం చేసుకోవాలి. ఈ ఉద్యమంలో ఒక ప్రజాస్వామిక భావన ఉన్నది. కావున దీనిని మనం ప్రపంచ ప్రజాస్వామిక ఉద్యమాల దృక్పథం నుండే చూడాలి. ఒక సోషలిస్టు భావన కూడా తోడై ఉంటే ఇంకా బాగుండేది.

థాయిలాండ్ విద్యార్థి, యువతరం చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని బలపర్చుదాం. వారికి సంఘీభావం ప్రకటిద్దాం. వారి విజయాన్ని కాంక్షిద్దాం. **– పోటు నారాయణ, రిసెర్చ్ స్కాలర్, ఓ.యూ**

( 3 వ పేజీ తరువాయి)

సిక్తంగా గాయపడ్డాడు. ఆ సందర్భంగా ఏడుగురు మహిళా కార్మికులతో సహా 57 మంది 17 రోజులు రాజమండ్రి సెంట్రల్ జైలు నిర్బంధితుల్లో ఓ ముఖ్యుడు. అన్నింటి కంటే మించి ఏలూరు జ్యూట్ మిల్లు లో ఐ.ఎఫ్.టి.యు పెరుగుదల క్రమాన్ని మలుపు తిప్పిన సంచలన ఉద్యమ ఘట్టంలో కీలక పాత్రధారి. కార్మిక ఉద్యమ నిర్మాణ పథంలోనే కాకుండా పోలవరం కొండల్లో, ఏజెన్సీ లో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నాడు.

తన తమ్ముడు ఎన్.వి.సత్యనారాయణ(ప.గో.జిల్లా పి.డి.ఎస్.యు నిర్మాత, ప్రస్తుతం న్యాయవాది), తన భార్య దుర్గతో సహా తన కుటుంబ సభ్యులని కూడా ఉద్యమంలోకి తెచ్చి, స్ఫూర్తి దాయక పాత్రను పోషించాడు. ఎన్.వి.ఎన్ కి క్రాంతి, భారతి అనే ఇద్దరు కూతుర్లు. వారు కూడా పార్టీ, ఇప్పు సంస్థల పట్ల, వాటి నాయకత్వాల పట్ల సానుభూతి పరులుగా ఉన్నారు. కా.ఎన్.వి.నారాయణకు విప్లవ జోహార్లు!

**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, అం.ప్ర. రాష్ట్ర కమిటీ**

( 11 వ పేజీ తరువాయి )

తల్లి ఆత్మహత్య కేసులో నేరారోపణకు గురై ఖైదు చేయబడ్డాడు. అతను కూడా అందరి రిమాండ్ ఖైదీల వలే ఒక ఖైదీ. ఈ సందర్భంగా అతని బెయిల్ పిటీషన్ అందరి పిటిషన్‌ల వలె వరుస క్రమంలో విచారణకు రావాలి. కాని సుప్రీంకోర్టు రిజిష్ట్రీ అర్జంట్ కేసుల విచారణ లిస్ట్‌లో చేర్చింది. ఖైదీల హక్కుల గురించి ఇక్కడ మనం మాట్లాడాలి. ఒక ఖైదీగా ఆయనకు ఉండే హక్కులు ఆయనకు ఉంటాయి. అర్నాబ్ కేసు కంటే ముందు ఉన్న కేసుల్లో ఖైదీల విచారణ హక్కుల గురించి సుప్రీంకోర్టు రిజిష్ట్రీ ఇక్కడ సమాజానికి సమాధానం చెప్పాలి. విచారణ జరగక, బెయిల్‌లు రాక సంవత్సరాల తరబడి జైళ్ళలో మగ్గిపోతున్న సామాన్య ఖైదీలకు అయినా సమాధానం చెప్పాలి.

గౌరవ జస్టిస్ దీపక్ మిశ్రా గారు చెప్పినట్లు ఈ దేశపు న్యాయ స్థానాలు అధికారం ఉన్న ఖరీదు అయిన ధనవంతులు పక్షాన నిలబడి పని చేస్తున్నాయా? అని ప్రశ్నించుకుని పరిశీలిస్తే పరిశీలకులకు అదే నిజం అని అనిపిస్తుంది అంటున్నారు. భీమ్‌కోరేగావ్ కేసులో 80 సంవత్సరాలకు పైబడి ఉన్న వయోవృద్ధుడు, ప్రపంచ ప్రఖ్యాత విప్లవ కవి, మేధావి అయిన వరవరరావు కరోనా భారిన పడి చావుబతుకుల మధ్య ఉంటే ఇదే సుప్రీంకోర్టు ఎందుకు కనికరం లేకుండా వ్యవహరించింది అని ప్రజాస్వామిక వాదులు ప్రశ్న. ఈ కేసులో అరెస్ట్ కాబడిన సుధా భరద్వాజ్, గాడ్లింగ్ ప్రముఖ న్యాయవాదులు మిగతా వారంతా పేరుపొందిన సామాజిక సేవకులు. గత రెండు సంవత్సరాలుగా జైలు గోడల మధ్య నలిగి పోతున్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ భావజాలం కలిగి, అణగారిన వర్గాల ప్రజల పక్షాన నిలబడి సమాజ పురోగతి కోసం పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను తమ కలం, గళంతో ప్రజలకు వినిపిస్తున్నందున వల్లనే కేంద్ర ప్రభుత్వం తప్పుడు ఆరోపణల తో జైల్లో ఉంచారు. అది ప్రపంచ వ్యాప్తంగా చర్చ నడుస్తోంది. రాజ్యాంగంలోని రాజకీయ స్వేచ్ఛని కాపాడవలసినది న్యాయ వ్యవస్థే. సంవత్సరాల తరబడి జైళ్ళలో మగ్గిపోతున్న ఈకేసు విచారణకి అర్జంట్ లిస్ట్ ఎందుకు లేదు అనేది ప్రశ్న.

పాదర్ స్టాన్ స్వామి ఒక క్రిస్టియన్ ఫాదర్ అక్కడ గిరిజన సమాజం బతుకులు ఛిద్రం అవుతుంటే చూస్తూ ఉండలేక వారు జీవించే హక్కుల కొరకు రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాలకు విన్నవించారు. వాటి గురించి మాట్లాడినారు. అది నేరం కాదు. కానీ కేంద్ర ప్రభుత్వం NIA చేత ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం (ఊపా) కింద అరెస్ట్ చేయించింది. ఇది మైనార్టీ క్రిస్టియన్‌లపై దాడిగా క్రిస్టియన్ సమాజం భావిస్తుంది. ఫాదర్ స్టాన్ స్వామి పార్కిన్‌సన్ వ్యాధితో బాధ పడుతున్నారు. ఆయనకు ఆహారం తీసుకోవటానికి స్ట్రా తదితరాలు ఇవ్వటానికి జైలు అధికారులు తిరస్కరించారు. దానిపై పిటీషన్ వేస్తే కౌంటర్ వేయటానికి 20 రోజుల సమయం ఇచ్చారు. ఈ రోజులో వణుకుతున్న చేతులతో ఆయన ఆహారం ఎలా తీసుకోవాలి? ఎలా బ్రతకాలి? కోర్టు కనికరం లేకుండా కనీస మానవత్వం లేకుండా వ్యవరించించింది ఇలాంటి విషయాలు కోర్టుల గౌరవం, ప్రతిష్టలను దెబ్బతీస్తాయి. ఇది చాలా ఆందోళనకర విషయం. మైనార్టీల హక్కులపై తీవ్రంగా ప్రభుత్వాలు దాడులు చేస్తుంటే అర్నాబ్ గోస్వామి కేసులో స్పందించినట్లు మిగతా కేసుల్లో న్యాయవ్యవస్థ ఎందుకు స్పందించడం లేదు అనేది సమాజానికి సందేహం.

ఇది ప్రజాస్వామ్య భారతం అయితే న్యాయవ్యవస్థ ప్రజాస్వామిక దృక్పథం కలిగి ఉండాలి. కేసులను సమన్యాయం, సమ భావ దృక్పథంలో పరిశీలించి, విచారించి పరిష్కరించాలి. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయవ్యవస్థ రాజ్యం స్వభావానికి అనుగుణంగానే తీర్పులు వెలువడుతున్నాయి.

క్యాపిటల్ కోర్టులలో సమన్యాయం, సమభావం, సమదృష్టిని కోరుకోవడం అత్యాశ అవుతుంది. అలా ఆశించటం పెద్ద తప్పు. న్యాయ వ్యవస్థ రాజ్యం వర్గ ప్రయోజనాలకు అనుగుణంగానే వ్యవహరిస్తుంది. ఎందుకంటే చట్టాలను రాజ్యాధికారంలో ఉన్నావాళ్లే చేస్తారు. కోర్టులు వాటి అమలు పర్యవేక్షణ మాత్రమే చేయగలవు. ఈ రాజ్యం ప్రజావ్యతిరేకం. ఈ పాలనను అంతమొందించాలి అని ఏ న్యాయమూర్తి అనుకోరు. ఈ దేశం పూర్తిస్థాయి ప్రజాస్వామ్యంగా ఎదగ లేదు. ఇక్కడ న్యాయస్థానాలలో పేదవాడికి న్యాయాన్ని వెదకటం అంటే ఎడారిలో ఒయాసిస్ వెదకటమే అవుతుంది.

సీనియర్ న్యాయవాది, మాజీ కేంద్రమంత్రి పి.చిదంబరం బెయిల్ విచారణ సందర్భంలో కూడా అత్యవసర విచారణ చేపట్టలేదు. అతనికే న్యాయం సకాలంలో జరగలేదు. కోర్టులపై నమ్మకం, విశ్వాసం కోల్పోయే కొన్ని అంశాలపై న్యాయ వ్యవస్థ సమీక్ష చేసుకోవాలి. అర్నాబ్ గోస్వామి లాంటి కేసులో స్పందించినట్లు మిగతా సామాన్యుల కేసుల్లోను స్పందించాలి. లేకపోతే సమాజంలోని ప్రజల్లో ఉన్న కొద్దిపాటి విశ్వసనీయత, నమ్మకం కూడా కోల్పోయే ప్రమాదం ఉన్నది. ప్రముఖులకి, సామాన్యులకు తేడా లేకుండా పద్ధతి ప్రకారం కేసులు విచారణ, తీర్పులు ఉండాలి.

**– శ్రీమన్నారాయణ, సి.ఎల్.సి రాష్ట్ర ఉపాధ్యక్షులు**

# పైలా చంద్రమ్మ గారితో సుదీర్ఘ రాజకీయ, నిర్మాణ, ఉద్యమ పథంలో మరపురాని నా జ్ఞాపకాలు

## ఆమె రాజకీయ జీవితం నుండి భావి విప్లవోద్యమం అనుసరించాల్సిన మూడు రాజకీయ గుణపాఠాలు

- పి.ప్రసాద్

*(అక్టోబర్ సంచిక తరువాయి భాగం)*

ఇక రెండో భాగంలోకి వస్తా. ఓవైపు శ్రీకాకుళం జిల్లాలో పార్టీ శ్రేణుల్ని గ్రామస్థాయి వరకూ కలుసుకొనే అవకాశం కలిగింది. మరోవైపు విస్తృత పర్యటనల ద్వారా గత శ్రీకాకుళ పోరాట చరిత్రతో మానసికంగా సంలీనమయ్యే అవకాశం కూడా కలిగింది. ఆ పుష్కర కాలంలో ముఖ్యంగా ఉద్దానం ప్రాంతాన్ని ఊరూరూ నిర్దిష్టంగా అధ్యయనం చేసే అవకాశం కలిగింది.

తరచుగా శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వెళ్తుండే వాడిని. సభలూ, సమావేశాలూ, కమిటీ మీటింగులూ, సెమినార్లూ, గ్రూప్ మీటింగులూ జనరల్ బాడీ మీటింగులూ నాటి నా పర్యటనలకు ఆలంబనగా మారేవి. అవే కాకుండా కేసులు, అరెస్టులు, నిర్బంధం, కోర్టు వాయిదాలు, వివాదాల వంటి సందర్భాలలో కూడా తరచుగా వెళ్తుండే వాడిని. పైన పేర్కొన్న కార్యక్రమాలకు చంద్రమ్మ గారు నన్ను ఆహ్వానించిడమూ, నేను హాజరవడమూ జరిగింది. ఒక్క మహేంద్రగిరి ఏజెన్సీ తప్ప గత ఉద్దానం పోరాట ప్రాంతంలో నేను కలియదిరగని చోటు లేదంటే అతిశయోక్తి కాదేమో! అట్టి అనుభవాలు, జ్ఞాపకాలను రాయాలంటే, ఒక భారతమే అవుతుందేమో! నేనిప్పుడు ఆ వివరాలలోకి వెళ్లడంలేదు. కొన్ని ముఖ్యమైన ప్రస్తావనలు మాత్రం చేస్తాను.

పైన పేర్కొన్న గ్రామాలతో పాటు మందస, హరిపురం, సోంపేట, బారువా, (గంటి రాజేశ్వరరావు గారి ఊరు), మదనాపురం (మార్పు పద్మనాభం గారి ఊరు), మామిడిపల్లి (ఇది బొడ్డపాడు దగ్గరి మామిడిపల్లి కాదు, తరుణాచారి గారి ఊరు), బంజరు నారాయణపురం (గవరయ్య గారి ఊరు), రిట్టపాడు ((పైలాగారి ఊరు) రాజాం (చంద్రమ్మ గారి ఊరు), నీలావతి, అక్కుపల్లి, మాకన్నపల్లి, రంగోయ్, రట్టి, మిలియాపుట్టి, అచ్చినాపురం, పాతపట్నం, కొరసవాడ, చాపార, టెక్కలిపట్నం, బ్రాహ్మణతర్ల, గొప్పిలి, సవర గోవిందాపురం, గోపాల్ సాయి, కొండలోగామ్, లొత్తూరు, కరడ, చందనగిరి, అక్కుపల్లి, బెండి, గవుడూరు, గరుడభద్ర, ధర్మపురి, పల్లిసారధి, సోంత్రాయిపురం, షేర్ మహమ్మద్‌పురం, కోమర్తి, బెల్మాం వంటి గత ఉద్యమ ప్రశస్తి గల గ్రామాలు, ప్రాంతాల్ని చారిత్రక వీక్షణం చేయగలిగా. శ్రీకాకుళం విప్లవ పోరాటంలో అసువులు బాసిన ఉద్దానం ప్రాంత అమరుల కుటుంబాల్ని సందర్శించే అవకాశం కలిగింది. అవన్నీ మరపురాని రాజకీయ అనుభూతుల్ని మిగిల్చింది.

నాటి శ్రీకాకుళం పోరాటంలో చంద్రమ్మ గారి వలెనే తరతమ స్థాయిలలో వీరోచిత పాత్ర పోషించిన వాళ్ళున్నారు. జైలు జీవితం గడిపిన వాళ్ళున్నారు. అట్టి రాజకీయ నేపథ్యం గల ఎందరో నేతల్ని కలిసే వీలు చిక్కింది. చౌదరి తేజేశ్వర్రావు, దుప్పల గోవిందరావు, బాతుల సత్యం, బెందాలం అప్పారావు, బార్ల సుందర్రావు, పోతనపల్లి జయమ్మ, బమ్మిడి శ్రీరాములు, అప్పలాచారి, పొందల దామోదరం, నెయ్యిల దామోదరం వంటి వారిని స్వయంగా కలిసే అవకాశం కలిగింది. కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరుల జీవిత చరిత్రలతో పాటు వసంతాడ రామలింగాచారి, మామిడి అప్పలసూరి, దుప్పల కృష్ణమూర్తి, తెప్పల కృష్ణమూర్తి, ధర్మపురి కృష్ణమూర్తి, డి.బి.కె.చౌదరి వంటి తొలికాలపు ఉద్యమ నిర్మాతల వివరాలు సేకరించే అవకాశం లభించింది.

ఆనాడు కొరియర్లుగా, లేదా రహస్య షెల్టర్లుగా సాయం చేసి తర్వాత కాలంలో కూడా విప్లవ పార్టీలను అనుసరించిన వారెందరో వున్నారు. పాపన్న, కిష్టయ్య, లింగన్న, మురిపింటి తాతారావు, వంకల అప్పయ్య, జడ్డి అప్పయ్య, చంద్రయ్య, లక్ష్మయ్య, దండాసి, ఇల్లన్న, జోగన్న, కోనారి మహాలక్ష్మమ్మ, పైలా రామారావు, కొందరు స్కూల్ మాస్టార్లు వున్నారు. వీరితో రాజకీయ సాన్నిహిత్యం ఏర్పడింది. ఇంకా ఖగేశ్వరావు, బాలక్రిష్ణమ్మ, మార్పు సీతారామయ్య వంటి నాటి చరితార్థుల్ని కలిసే అవకాశం కలిగింది. సన్నశెట్టి రాజశేఖర్, మార్పు మల్లేశ్వరావు, అట్టాడ అప్పల్నాయుడు వంటి విప్లవ ఆలోచనాపరులతో అనుబంధం ఏర్పడింది.

ఉద్యమ, నిర్మాణపథంలో వంకల పాపారావు, రాజారావు, మాధవరావు, కామరాజు, వంకల దానయ్య, డొక్కరి దానయ్య, కర్రెన్న, భీమయ్య, కోనారి ఈశ్వరి, వంకల ఈశ్వరి (ఈ ఇద్దరు ఈశ్వరిల భర్తలు రాజ్యం పొట్టన పెట్టుకున్న అమరులే) కృష్ణవేణి (ఈమె కూడా మరో అమరుడి భార్య), దమయంతి, కోనారి జయమ్మ, డప్పు అప్పారావు, తెల్లోడు, కూర్మారావు, సోమేశ్వర్రావు, లక్ష్మీ నారాయణ, సూరన్న, కిక్కర రామారావు, వంకల కృష్ణ, దేవరాజు, ఢిల్లీరావు, బోడా కృష్ణమ్మ, వంకల షణ్ముఖ్, కోనారి చిన్నారావు, డొక్కరి చిన్నారావు, సవర చిన్నారావు, భాస్కరరావు, లక్ష్మణ్, జోగారావు, నిర్మల, పద్మ, సరస్వతి వంటి యువతీ, యువకులతోనూ రాజకీయ అనుబంధం ఏర్పడింది.

మద్దిల మల్లేశ్వర్రావు, తామాడ త్రిలోచనరావు, హేమచంద్ర పాణిగ్రాహి, దాసరి శ్రీరాములు, తామాడ సన్యాసి రావు, జుత్తు వీరాస్వామి, గోరు మాధవరావు, దుశ్యంతరావు, కామేశ్వరరావు, జోగి కోదండం, మద్దిల రామారావు వంటి విప్లవ సంస్థల మిత్రులతో కూడా స్నేహం ఏర్పడింది.

నాడు వారితో ఏర్పడ్డ విప్లవ ఆత్మీయ రాజకీయ బంధం నిజానికి నిర్మాణాల సరిహద్దు గీతలకి అతీతమైంది. ఎవరు ఏ విప్లవ సంస్థల్లోనైనా కొనసాగవచ్చు. కానీ ఈ బంధం మాత్రం ఎప్పటికీ కొనసాగే భావ బంధమే. ఆనాటి రాజకీయ కలయికలు, స్నేహ సంబంధాలు రాజకీయ విప్లవ జీవితంలో సదా కొనసాగేవే.

అవే కాకుండా మరోతరం వెనక్కి వెళ్తే, శ్రీకాకుళం జిల్లాలో ప్రప్రథమ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ చరిత్రను అధ్యయనం చేసే అవకాశం కూడా కలిగింది. అమరులు గంటిరాజేశ్వరరావు, మార్పు పద్మనాభం, గానుగుల తరుణాచారి, బెందాళం గవరయ్య చరిత్రలను కూడా అధ్యయనం చేసే రాజకీయ ఆసక్తి కలిగింది. ఇంకా దారపు గోవిందరాజులు, ఉప్పాడ రామారావు వంటి నిర్మాతల చరిత్రల్ని తెలుసుకోగలిగా. మరికొంత వెనక్కి వెళ్తే, జిల్లాలో కమ్యూనిస్టు బీజాలు నాటిన జొన్నలగడ్డ రామలింగయ్య, త్రిపురనేని వెంకటేశ్వరరావు, ముళ్ళపూడి వీరభద్రం, వై.విజయకుమార్, గోవిందరావు, కొత్తమాసు సత్యనారాయణ, రాఘవరెడ్డి వంటి త్యాగధనుల తొలికాలపు కృషి, చరిత్రల్ని తెలుసుకునే అవకాశం కూడా కలిగింది. 1940లోనే పలాసలో జరిగిన అఖిలభారత కిసాన్ సభ ఆలిండియా మహాసభల చారిత్రక ప్రాముఖ్యత పట్ల ఆసక్తిని కలిగించింది. 1940ల మందసా ఎస్టేట్ జమీందారీ వ్యతిరేక రైతాంగ ప్రతిఘటన గూర్చి, అందులో వీరగున్నమ్మతో పాటు, ఐదుగురు పోలీసు కాల్పుల్లో మృతి, దాని చారిత్రక నేపథ్యం తెలుసుకునే అవకాశం కూడా కలిగింది. 1930 నుండే రైతు ఉద్యమ నేతగా ఎదిగి, 1937లో శాసనసభ్యుడిగా ఎన్నికై, 1937లో ఇచ్ఛాపురం నుండి మద్రాస్‌కి చేపట్టిన రైతు రక్షణయాత్రకి స్ఫూర్తిదాతగా, ఉత్తరాంధ్ర రైతు ఉద్యమ తొలి నిర్మాతలలో ఒకరుగా, రాష్ట్ర కిసాన్ సభ నేతగా పేరొందిన పుల్లెల శ్యామసుందర్ చరిత్ర గూర్చి, ఇంకా గౌతు లచ్చన్న, దుక్కా సూర్యనారాయణ రెడ్డిల పాత్ర గూర్చి, ఈ ప్రాంతంలో ఎన్.జి.రంగా, టంగుటూరి వంటి వారి కృషి, నాటిచారిత్రికపూర్వ రంగస్థితిపై కూడా అధ్యయనం చేసేందుకు రాజకీయ ఆసక్తిని కలిగించింది. ఈ సావకాశాలన్నీ ప్రధానంగా చంద్రమ్మగారు, నేను ఒకేకమిటీ నిర్మాణంలో సుదీర్ఘ కాలం పని చేయడం వల్లనే సాధ్యమైనది. అందుకు నేను సదా

( మిగతాది 14వ పేజీలో )

(13 వ పేజీ తరువాయి)

కృతజ్ఞుడనే కాక, గర్విస్తూ కూడా ఉంటాను.

ఇదిలావుండగా వివిఎస్ ఎసి నిర్మాణాన్ని ప్రభావితం చేసిన మరో విలీన నిర్ణయం 2005 చివరలో రాష్ట్ర స్థాయిలో జరిగింది. దాని వెలుగులో పార్టీ రాష్ట్రకమిటీ సూచనతో వివిఎస్ ఎసి పరిధిలోకి కామ్రేడ్ జె.వి.చలపతిరావుగారు వచ్చారు. ఆ సందర్భంగా 20-11-2005న జరిగిన ఎసి సమావేశం జె.విచలపతిరావుగారితో పాటు విశాఖ కామ్రేడ్స్ వెంకటేశ్వర్లు, లక్ష్మిలని కమిటీ సభ్యులుగా ఎసి తీసుకున్నది. వృద్ధాప్యం, అనారోగ్యం వల్ల ఏసి కార్యదర్శి బాధ్యతల నుండి తనను రిలీవ్ చేయవలసిందిగా అప్పటికే పార్టీ రాష్ట్ర కమిటీలో పైలా గారు కోరుతూ వున్నారు. పై నేపథ్యంలో పైలాగారిని ఎసి కార్యదర్శిగా రిలీవ్ చేసి, ఆ స్థానంలో చలపతిరావు గారిని నియమించాలని 2005 డిసెంబర్ మొదటి వారంలో జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం తీర్మానించింది. అది తే.23-12-2005 నాటి వివిఎస్ ఎసి సమావేశంలో అమలులోకి వచ్చింది. పైన పేర్కొన్న రెండు ఎసి సమావేశాలకు నాటి పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అమరజీవి రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) హాజరయ్యారు. పైలాగారు ఎసి కార్యదర్శిగా రిలీవ్ ఐనప్పటికీ ఎసి సభ్యునిగా కొనసాగారు. అప్పటి నుండి జె.విగారి నేతృత్వంలో చంద్రమ్మ గారు పని చేయడం గమనార్హం.

చంద్రమ్మగారి విశాల విప్లవ ఐక్యతా స్ఫూర్తిని ప్రతిబింబించే ఒక ఉదాహరణను పేర్కొనాలి. 1962 నాటి ఉమ్మడి సిపిఐ జిల్లా మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఎన్నికై, 1964లో సిపిఎం జిల్లా కార్యదర్శిగా కూడా కొనసాగి, నక్సల్బరీ విప్లవ పంథాని చేపట్టి శ్రీకాకుళం విప్లవోద్యమ నిర్మాతగా పేరొందిన అమరజీవి కామ్రేడ్ వసంతాడ రామలింగాచారి (ఆచారి) గారు అజ్ఞాత జీవితంలో ఉంటూ, 2003 నవంబర్ 24న అమరత్వం పొందారు. ఆ సందర్భంలో చంద్రమ్మగారు తల్లడిల్లిన దృశ్యాలు ఇప్పటికీ జ్ఞాపకమే. విజయనగరంలోని ఆచారిగారి జీవిత సహచరి సన్యాసమ్మ గారి పరామర్శకై తపించారు. మరో మహిళా కామ్రేడ్ దమయంతి గారిని వెంటబెట్టుకొని చంద్రమ్మగారు ముందస్తు సమాచారంతో తే.28-11-2003న నెల్లిమర్ల వచ్చారు. నా జీవిత సహచరి పద్మను సాయంగా తీసుకొని అదేరోజు విజయనగరం వెళ్లి పరామర్శ చేశారు. సిపిఆర్ఐ పార్టీ తే.14-12-2003న బొబ్బిలిలో నిర్వహించిన ఆచారిగారి సంస్మరణ సభకి శ్రీకాకుళం నుండి ఎక్కువ మంది పార్టీ శ్రేణులతో బొబ్బిలి సభకు హాజరయ్యారు. బొడ్డపాడులో తే.17-12-2003 న ఐక్య విప్లవ వేదిక ఆధ్వర్యంలో ఆచారిగారి సంతాపసభ నిర్వాహణలోనూ చంద్రమ్మగారు చాలా చొరవను ప్రదర్శించారు. నిర్మాణాలు వేరైనా, ఒకే నిర్మాణం వలె విశాల ఐక్యతా భావంతో ఆమె స్పందించడం గమనార్హం.

వివిఎస్ ఎసి నిర్మాణ గమనంలో భాగంగా అనేకసార్లు చంద్రమ్మగారు నెల్లిమర్ల వచ్చారు. నాటి వీరోచిత నెల్లిమర్ల కార్మికోద్యమ ఘట్టాలను స్థానిక కామ్రేడ్స్ ద్వారా అమితాసక్తితో వింటూ పొందిన రాజకీయ అనుభూతి అనిర్వచనీయమైనది. నాటి వీరోచిత నెల్లిమర్ల కార్మికపోరులో మహిళల పాత్ర గూర్చి నెల్లిమర్ల వచ్చిన సందర్భాలలో పద్మ ద్వారా, ఇతర నెల్లిమర్ల కామ్రేడ్స్ ద్వారా గంటల తరబడి వింటూ ఆమె పొందిన ఆనందం వర్ణనాతీతం. 2003 ఆగస్టులో మూడు రోజుల పార్టీ వివిఎస్ ఏరియా మహాసభలు కూడా ఓ జ్ఞాపకం. అప్పుడు నెల్లిమర్ల కామ్రేడ్స్ పట్ల ప్రదర్శించిన జిజ్ఞాస కూడా గుర్తుండేదే.

నాకు గుర్తున్నంత వరకు శ్రీకాకుళం జిల్లాలో పోలీసు నిర్బంధం నాలుగు దశలలో సాగింది. 1-కామ్రేడ్ శాంతారావు అరెస్టు, నిర్బంధం, చిత్రహింసకి గురి చేసిన నేపథ్యం 2-సవర మిన్నారావు అలియాస్ రఘు అనే ట్రైబల్ కామ్రేడ్, దళ సభ్యుడు, పోలీస్ చిత్రహింసల్లో లాకప్ మృతిచెందిన సందర్భం, 3-టెక్కలి సంఘటన సందర్భం 4-మాధవరావుపై టాడా లేదా పోటా ప్రయోగానికి పోలీసు ప్రయత్నించిన సందర్భం. పై నాలుగు సందర్భాలలో పార్టీ ఎసి బృందం వరస పర్యటనలు చేసింది. రఘు లాకప్ మృతిపై మేజిస్టీరియల్ విచారణ బహిష్కరణ, నిరసన ఆందోళనలు, ప్రభుత్వ అధికార యంత్రాంగానికి విజ్ఞాపణల కోసం చేసిన వరస పర్యటనలు విషాదసందర్భాలే. శాంతారావు నిర్బంధం, చిత్రహింసల సందర్భం కూడా అలాంటిదే. ఎప్పటికీ అవి మరిచిపోయేవి కాదు. పై సందర్భాల్లో పార్టీ ఎసి బృంద పర్యటనలు వరసగా చేయాల్సి వచ్చింది. ఆనాటి పర్యటన బృందాల్లో కొండయ్య గారు, పొలా ఈశ్వరరావుగారు, విశాఖ పద్మ గారు, గోపాలం గారు, గణేష్ పాండాగారు, నేను ఆయా సందర్భాలలో సభ్యులుగా వుండే వాళ్ళం. చంద్రమ్మగారు, నేను మాత్రం ప్రతిసారి బృందంలో వుండే వాళ్ళం. అవి ఎల్లప్పుడూ నాకు గుర్తుండి పోయేవే.

పైలా వాసుదేవరావుగారు 2010 ఏప్రిల్‌లో అమరత్వం పొందారు. ఆ సందర్భంగా పైలాగారి జీవిత చరిత్ర సమాచార సేకరణకై చంద్రమ్మగారితో సమన్వయం చేసుకుంటూ తాండ్ర ప్రకాష్‌గారితో కలిసి జిల్లాలో నాటి చరితార్థుల్ని కలిశాం. ఆ సందర్భంగా రెండు వ్యాసాలు రాశా. చంద్రమ్మగారి రాజకీయ జీవితంలో కొన్ని ముఖ్యాంశాలు వాటిలో సందర్భానుసారంగా పేర్కొన్నా. వాటిలోకి మళ్లీ వెళ్లడం లేదు. ఐతే ఆమె త్యాగ నిరతికి ప్రతీకగా నిలిచే ఒక ఘటనని పునరుద్ఘాటించడం మాత్రం సందర్భోచితంగా ఉంటుంది.

ఆమె సాయుధ దళాలలో ఉండగా పుట్టిన తమ పసికందుని నాటి రాజ్య నిర్బంధస్థితిలో విప్లవోద్యమ పరిరక్షణకై పార్టీ సూచనపై వదులుకున్నారు. అది అసాధారణమైనది. కన్న బిడ్డని మరొకరికి ఇచ్చివేయడం ఆ అమర దంపతుల రాజకీయ ఔన్నత్యాన్ని వెల్లడిస్తుంది. మాతృత్వపు కోణంలో పైలాగారి కంటే చంద్రమ్మగారి త్యాగనిరతి మరింత గొప్పది. బిడ్డతో భౌతికబంధం వద్దని 'విప్లవోద్యమం' నాడు ఆ మాతృమూర్తికి సూచించింది. తల్లిదండ్రులతో "భౌతికబంధం" తెంచుకొని "భౌతిక దూరం" పాటిస్తూనే ఆ బిడ్డ ఎదిగింది. ఐనా విప్లవ రాజకీయలతో ఆ బిడ్డకు "మానసిక బంధం" ఏర్పడటం విశేషం. అడవి నుండి "నిర్దాక్షిణ్యంగా" ఆ పసికందుని బయటకు పంపిన విప్లవోద్యమమే, బయట ఎంతో మానవీయంగా, ఆప్యాయంగా ఆ బిడ్డని హత్తుకుని తనఒడిని ఆశ్రయంగా మార్చి ప్రేమతో పెంచింది. అందుకే ఆ బిడ్డ 'అరుణ' తన జీవనయానం సాగిస్తూనే, విప్లవప్రేమికురాలుగా నిలిచింది. ఆమె జీవిత సహచరుడు ఆంజనేయులు కూడా అదే మానసిక బంధాన్ని కలిగి ఉండటమూ విశేషమే.

నాకు ఎక్కువగా గుర్తుండి పోయే సన్నివేశం మరొకటి ఉంది. అది లెనిన్ సంకలిత రచనలతో ముడిపడ్డ అరుదైన అపురూప సన్నివేశం. పైలాగారి వద్ద అమూల్యమైన లెనిన్ సంకలిత రచనలున్నాయి. అవి నాకు బహుకరిస్తానని ముందు నుండే చెబుతూ వచ్చారు. వాటికోసం ఎదురు చూస్తూ వచ్చా. సాహిత్యాన్ని సంపదగా భావించే వారిలో నేనొకడిని. పైలాగారి హామీ ప్రకారం లెనిన్ సంకలిత రచనలు నా చేతికి అందితే సంపన్నుడనవుతానని తెగ ఆశపడుతూ వచ్చాను. ఆ ఆశ ఇలా నెరవేరింది.


2006 డిసెంబర్ 22న రాత్రి బొడ్డపాడులో పాణిగ్రాహి స్మారకసభలో నేనొక వక్తను. అదేరోజు మధ్యాహ్నం డాక్టర్ శివరామిరెడ్డిగారు శ్రీకాకుళం పోరాటంపై రచించిన పుస్తక పరిచయం సభలో కూడా వ్యాఖ్యాతను. ఆ సందర్భంగా లెనిన్ సంకలిత రచనల్ని నాకు అందించ వల్సిందిగా చంద్రమ్మ గార్కి పైలాగారు సూచించారు. సుదూరంలో జరిగిన పార్టీరాష్ట్ర కమిటీ సమావేశం నుండే పైలాగారి సూచనతో చంద్రమ్మ గార్కి రాసిన లేఖతో ఆరోజు నేరుగా బొడ్డపాడు చేరా. రెండు సభలు ముగిశాక ఆరాత్రి బొడ్డపాడు గ్రామ సర్పంచ్ త్రిలోచనరావు (అమరజీవి తామాడ గణపతి కొడుకు) గారింటిలో కొండన్న, నేను బస జేశాము. తెల్లారి ఉదయం చంద్రమ్మగారు, మాధవరావు, నేను ఆటోలో సముద్ర తీరంలోని అక్కుపల్లి వద్ద రాజాం (చంద్రమ్మ గారి స్వగ్రామం) వెళ్ళాము. ఎంతో కాలంగా అపురూప సంపదగా దాచిపెట్టిన మొత్తం లెనిన్ 45 సంపుటులను నాలుగైదు అట్ట పెట్టెలలో భద్రంగా అందజేస్తున్న క్షణాలలో నేను పొందిన నాటి మధురానుభూతి

(మిగతాది 15వ పేజీలో)



## సి.ఎల్.సి నాయకులు ప్రొ.శేషయ్య సంతాప సభలు

పౌరహక్కుల ఉద్యమ సారధి ప్రొ.శేషయ్య గారికి నివాళులర్పిస్తూ విజయవాడ, అనంతపురంలలో సంతాప సభలు జరిగాయి. ఈ సభలలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమన్నారాయణ, పీ.ఓ.డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.గంగాభవాని, సీఎల్సీ నాయకులు ఆంజనేయులు, సీఎమ్మెస్ నాయకురాలు రాధ తదితరులు ప్రసంగించారు.




(14వ పేజీ తరువాయి)

ఎప్పటికీ మరువలేనిది. నన్ను మరింత మార్క్సిస్టు సాహితీ సంపన్నుడిగా మార్చివేసిన శుభదినమది. అధ్యయనం కోసం వాటిని తెరుస్తున్న ప్రతిసారీ, ఆ ఇద్దరు అమర దంపతులు గుర్తుకు వస్తూనే వున్నారు, ఇకముందు కూడా గుర్తు వస్తూనే వుంటారు.

నేనిప్పటి వరకూ చంద్రమ్మ గారు అంటూ ఉదహరించాను. నిజానికి నేనెప్పుడూ అలా సంబోధించలేదు. "చంద్రక్కా" అని మాత్రమే పిలిచేవాడిని. వ్యాసభాషలో ఇప్పటివరకూ "చంద్రమ్మ గారి" గా పేర్కొన్నా. నేను సదా సంబోధించే వాస్తవ భాషలో ఈవ్యాసాన్ని ముగిస్తా.

విప్లవోద్యమంలో అన్నీ సంతోషకరమైన పరిణామాలే జరగవు. విషాద సంఘటనలు కూడా చోటు చేసుకుంటాయి. ఒక విచారకర వార్త చెప్పాలి.

నెల్లిమర్ల ఉద్యమం తర్వాత 1994లో గోపాలంగారి విప్లవ బృందం విలీనంతో బొబ్బిలి ప్రాంతానికి, 2000లో పోలా ఈశ్వరావు గారి విప్లవ బృందం విలీనంతో పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతానికి పార్టీ విస్తరించింది. అంతటితో విలీనాలు ఆగలేదు. 1997లో పార్టీలో పైలా గారి విలీనం వివిఎస్ ఎసి నిర్మాణానికి పెద్ద బలాన్ని ఇచ్చింది. 2005లో విశాఖ ఉద్యమంతో జె.వి.చలపతిరావు గారి విప్లవ బృందం విలీనం మరో పెద్ద బలాన్ని ఇచ్చింది. 2008 ఏప్రిల్లో తాండ్ర ప్రకాష్, ఎస్.వి.వి సత్యనారాయణగార్ల ఆధ్వర్యంలో మరో విప్లవ బృందం విలీనం జరిగింది. ఈ వరస ఉత్తేజకర విలీనాలతో పాటు, ఒక విచారకర అలీనం కూడా జరిగింది. 2013 సెప్టెంబర్ 9,10లలో జరిగిన వివిఎస్ ఎసి సమావేశంలో చంద్రమ్మ గారితో నిర్మాణరీత్యా తెగదెంపులు చేసుకోవాల్సి వచ్చింది. అదో అప్రస్తుత విషాద రాజకీయ సందర్భమనుకోండి. దానితో మా ప్రయాణంలో ఒకేకమిటీలో మా ఇద్దరి మధ్య నిర్మాణ బంధం 2009లో ముగిస్తే, ఒకేపార్టీలో బంధం 2013లో ముగిసింది.

2013లో పార్టీలో ఏర్పడ్డ చీలికలో చంద్రక్క పాత్రలోకి నేను వెళ్ళడం లేదు. అది భావి చరిత్రకు వదిలివేయాల్సిన విషయంగా భావిస్తున్నా. పార్టీలో చీలిక తర్వాత గడిచిన ఏడేళ్ళ కాలంలో చంద్రక్కతో రాజకీయ సంబంధం కూడా లేనందున రాయడానికి ఏ జ్ఞాపకాలూ లేవు. మూడుసార్లు సాధారణ కలయికలు జరిగాయి. వాటి గూర్చి క్రింద పేర్కొంటున్నాను.

మేము నిర్మాణపరంగా విడిపోయాక కూడా మూడు సార్లు కలిశాను. డాక్టర్ ముత్యం రచించిన రెండు పుస్తకాల ఆవిష్కరణల సందర్భంగా కలిశాం. బారువలో అమరజీవి గంటి రాజేశ్వరరావు పుస్తక ఆవిష్కరణ తే.5-11-2017న జరిగింది. బొడ్డపాడులో అమరజీవి పాణిగ్రాహి పుస్తక ఆవిష్కరణ తే.22-12-2018న జరిగింది. రెండు సార్లు చంద్రక్క కలిశారు. తిత్లి తుఫాన్ సందర్భంగా కొండయ్యగారు, తాండ్ర ప్రకాష్గారు, విశాఖ లక్ష్మీగారు, నేను పార్టీ ఎసి ప్రతినిదివర్గంగా 2018 అక్టోబర్ 21న శ్రీకాకుళం జిల్లా బాధిత ప్రాంతాల పర్యటన చేసాం. ఆరోజు మా బృందం ప్రత్యేకంగా చంద్రక్క ఇంటికి వెళ్లి పరామర్శ చేసాం. మూడు సార్లు కూడా చంద్రక్క మా పట్ల ఆత్మీయతని ప్రదర్శించారు.

చంద్రక్క రాజకీయ జీవితం నుండి నేర్చుకోదగ్గ రాజకీయ ప్రాధాన్యత గల ముఖ్యాంశాలు కొన్ని వున్నాయి. ముఖ్యమైన మూడు విప్లవాదర్శాలు లేదా ప్రమాణాలున్నాయి. అవి భవిష్యత్తు విప్లవోద్యమానికి ప్రాసంగికతను కలిగివుంటాయి. వాటిని కింద పేర్కొంటున్నాను.

1. చంద్రక్క సుదీర్ఘ కాలం రాజ్యానికి వ్యతిరేకంగా అజ్ఞాత (రహస్య) జీవితం సాగించింది. అది సాయుధ విప్లవ రాజకీయ అవగాహనతో కూడింది. అది అత్యంత కఠోరమైనది. సదా ప్రాణార్పణలకి సంసిద్ధమై ఉండాల్సిన జీవితమది. దానికి అసాధారణ త్యాగనిరతి, విప్లవ దీక్ష, అంకితభావం కావాలి. అట్టి అర్హతలు ఉండడం వల్లనే చంద్రక్క కత్తిమీద సాము వంటి అజ్ఞాత జీవితం సాగించారు.

2. చంద్రక్క రాజ్యానికి చిక్కిన సమయంలో క్రూరమైన పోలీసు చిత్రహింసల్ని అనేక రోజులు భరించారు. పైలాగారితో పాటు నాటి అజ్ఞాత పార్టీ నాయకుల రహస్యాల్ని రాబట్టేందుకు చిత్రహింసల కొలిమిలో రాజ్యం విషమ పరీక్షకు గురిచేసింది. ఐనా ఆమె చలించలేదు. మొక్కవోని విప్లవ సంకల్పంతో నిలిచారు.

3. చంద్రక్కకు యావజ్జీవశిక్ష పడింది. తిరిగి విడుదల అయ్యేదీ లేనిదీ తెలియని ఓ సందిగ్ధ స్థితిలో ఏళ్ళ తరబడి జైలు జీవితం సాగించారు. పైగా ఓ మహిళా విప్లవకారిణి సుదీర్ఘ జైలు జీవితం గడపడం ఎంతటి క్లిష్టమైనదో ఊహించుకోవచ్చు. ఐనా చంద్రక్క జైలుగోడల మధ్య దృఢంగా, స్థిరంగా ఉక్కుమనిషి గా నిలబడ్డారు. ఒక్కరోజైనా లొంగుబాటు భావనకు గానీ, అపరాధ భావనకు గానీ ఆమె గురికాకపోవడం గమనార్హం.

పైన పేర్కొన్న మూడు విప్లవ రాజకీయ అర్హతలకు నేడు ప్రాసంగికత వుంది. పైగా దేశంలో ఫాసిస్టు ముప్పు పెరిగే గడ్డుకాలమిది. పై మూడురకాల రాజకీయ విషమ పరీక్షలలో చంద్రక్క సాధించిన ఉత్తీర్ణత రేపటి గడ్డుకాలంలో ఫాసిస్టు వ్యతిరేక పోరాటాలకి రాజకీయ అర్హతలుగా మారి తీరుతుంది. మరీ ముఖ్యంగా అట్టి అర్హతల్ని సాధించకుండా కమ్యూనిస్టు విప్లవ కారులుగా రాణించలేరు. అందుకే చంద్రక్కలోని పైన పేర్కొన్న ముఖ్యమైన మూడు విప్లవాదర్శాలకు ప్రాచుర్యం కల్పించాల్సి వుంది. అది నేడు విప్లవోద్యమం మీద "చరిత్ర" మోపే రాజకీయ కర్తవ్యం. అదే చంద్రక్కకి అర్పించే నిజమైన విప్లవ నివాళి.

మార్క్సిస్టు గ్రంధాలను ఎన్నింటిని అధ్యయనం చేసినా, ఎన్ని బోధనలు చేసినా, ఎంతటి విశ్లేషణా సామర్థ్యం వున్నా, ఎంతటి గొప్ప మార్క్సిస్టు మేధో నైపుణ్యం కలిగివున్నా, ఎంత గొప్ప మార్క్సిస్టు పండితులుగా రూపొందినా, అంతిమంగా విప్లవ కార్యాచరణ లేకుండా విప్లవోద్యమ నిర్మాణం సాధ్యం కాదు. దానికై విప్లవ నిర్మాణం కావాలి. అది లేకుండా విప్లవ సాధన ఎప్పటికీ సాధ్యం కాదు. అందుకే చంద్రక్క ప్రదర్శించిన పై మూడు విప్లవాదర్శాలు కేవలం ఏదో భావోద్వేగపూరిత సిద్ధాంత ఆదర్శాలు మాత్రమే కావు. వాస్తవాచరణలో విధిగా అనుసరణీయం కూడా! ఫాసిస్టు ముప్పు క్రమంగా ముంచుకొస్తున్న నేటి క్లిష్ట, కష్ట కాలంలో చంద్రక్క జీవితం అందిస్తున్న ఈ మూడు విప్లవ అర్హతల్ని విస్తృతంగా ప్రచారం చేద్దాం. ఇవి కేవలం చంద్రక్క ప్రాతినిధ్యం వహించిన విప్లవ సంస్థకి మాత్రమే పరిమితం కాదు. మొత్తం విప్లవోద్యమానికి చెందిన సమిష్టికర్తవ్యమిది. ఇది ఉమ్మడి రాజకీయ కర్తవ్యంగా భావించి ప్రాచుర్యం కల్పిద్దాం.

చంద్రక్క ప్రదర్శించిన మూడు విప్లవాదర్శాలను రాజకీయంగా వేనోళ్ళ కీర్తిద్దాం!

*చంద్రక్క విప్లవాశయాల్ని సమున్నతంగా ఎత్తి పడదాం!*

*చంద్రక్క అమర్ రహే!*

*చంద్రక్క విప్లవాశయాల సాధనకై దీక్ష వహిద్దాం!*

# తొలితరం విప్లవ కమ్యూనిస్టు కామ్రేడ్ కల్లూరి వాసయ్య గారికి విప్లవ జోహార్లు



తే.29-10-2020 రాత్రి 10గంటలకు కా॥ కల్లూరి వాసయ్య గారి తుది శ్వాస ఆగిపోయిందని, చివరి చలనం ఆగిందని తెలిసింది. 10 రోజులు మృత్యువుతో పోరాడి గెలవలేక పోయాడు. తే.20-10-2020న రాత్రి పిండిప్రోలు తన ఇంటిలో తలకు తీవ్రమైన దెబ్బల తగలడంతో తీవ్ర రక్త స్రావము జరిగి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. ఆ తరువాత గ్రామ పార్టీ బాధ్యులు ఖమ్మం, అటు తరువాత హైదరాబాద్ హాస్పిటల్‌కి మెరుగైన వైద్యం కొసం తరలించినా, అప్పటికే డాక్టర్స్ క్రిటికల్ కండీషన్ అని చెప్పారు. కోమాలో వున్న వాసయ్య గారికి చివరి వరకు వైద్యం అందించారు. కానీ కోమా నుండి బ్రెన్ డెడ్‌లోకి వెళ్ళిపోయాడు. ఆయన అభిప్రాయాల కనుగుణంగా ఆయన అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేయడానికి అంగీకరించారు. కానీ హార్ట్ స్ట్రోక్ వలన అవయవాలు దెబ్బతినడంతో అది నెరవేరలేదు.

ఇదే రోజు రాత్రి అవయవాల చలనం కూడా ఆగిపోవడంతో హాస్పిటల్ వర్గాలు పార్థీవ దేహాన్ని 29, రాత్రి కుటుంబ సభ్యులకి అప్పగించారు. తే.30-10-2020న స్వగ్రామమైన పిండిప్రోలులో వందలాది మంది అభిమానులు పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులతో అంతిమ ప్రదర్శన, సభ నిర్వహించారు. పార్టీ నాయకులు, సన్నీహితులు నివాళులర్పించారు. అంత్యక్రియలు చేసారు.

కా॥ వాసయ్య 1952 సెప్టెంబరు 8వ తేదీన ప్రస్తుత కొరివి మండలం (పాత వరంగల్ జిల్లా - ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా) ములకలపల్లి గ్రామములో జన్మించాడు. తండ్రి సీతారామయ్య, తల్లి లక్ష్మీబాయి. సీతారామయ్యగారు కమ్యూనిస్ట్. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నాడు. చివరిదాకా ఎం.ఎల్ పార్టీ సానుభూతి పరుడిగా, సహకారిగా వున్నాడు. వాసయ్య గారు ప్రాధమిక విద్యను ములకలపల్లిలో చదివాడు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తిరుమ లాయపాలెంలో చదివాడు..

బి.ఎస్.సి డిగ్రీ (పి.యు.సి బ్యాచ్1971-74 ) ఖమ్మం ఎస్.ఆర్ & బి.జి.ఎన్.ఆర్ కళాశాలలో చదివాడు. ఆయన హెచ్.ఎస్.సి చదివేటప్పుడు నాటి విప్లవ కమ్యూనిస్ట్ బెడద చెన్నయ్య తో పరిచయమడం, తరువాత ఆయనతో కలసి పనిచేస్తూ 2 సంవత్సరాల పాటు అజ్ఞాత జీవితం కూడా గడిపాడు. ఆ తరువాత ఖమ్మం కళాశాలలో మొదట పి.ఎస్.ఎఫ్ (1973లో ఏర్పడింది. 1974లో పి.డి.ఎస్.యులో విలీనమైంది)తో పరిచయం ఏర్పడి కార్యకలాపాలలో చురుకుగా వున్నాడు. కామ్రేడ్ రవన్న, వడ్డెల్లి కృష్ణమూర్తి, మాధవరెడ్డి, గుర్రం అచ్చయ్య, మాధవన్నతో కలసి పనిచేశాడు. ఆ క్రమంలో డిగ్రీ తరువాత ఆయనకు పోస్టల్ శాఖలో ఉద్యోగం వచ్చింది. ఆనాటి ప్రభుత్వం తీవ్రవాద కార్యకలాపాలు నిర్వహణలో పాల్గొన్నాడని జాయిన్ చేసుకోలేదు. ఆ కేసు కోర్టుకు వెళ్ళింది. జస్టిస్ జీవన్ రెడ్డి ప్రభుత్వ వాదనకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చాడు. ఈ తీర్పు రాష్ట్రంలో రాజకీయ భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు నైతిక బలాన్నిచ్చింది. తనకు ఉద్యోగం ఇవ్వలేదు. అయినా తాను విప్లవ రాజకీయాలు వీడలేదు. గ్రామంలో వ్యవసాయం చేస్తూ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాడు.

కామ్రేడ్ వాసయ్య గారికి 1970లో దొండేటి విజయతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కొడుకులు, పెద్దతను శరత్. బెంగుళూరులో లాయరు వృత్తిలో ఉన్నాడు, చిన్నతను పీజీ చేసే కాలంలో యాక్సిడెంట్ అయ్యి మానసికంగా దెబ్బ తిన్నాడు.

వాసయ్య గారు తొలి తరం విప్లవకారులకు పరిచయం. నక్సల్బరి తొలి మేఘగర్జనకే మెల్కొన్నవాడు. విప్లవ సిద్ధాంత అవగహనతో విప్లవ రాజకీయ పార్టీలో జీవితాంతం చివరిదాకా పార్టీతోనే వుంటానని దృఢంగా నిలబడ్డాడు. వాసయ్య అనేక కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. పార్టీ గ్రామ కార్యదర్శిగా, మండల నాయకుడిగా పని చేశాడు. జిల్లాలో భారత-చైనా మిత్రమండలిలో, ఎ.ఐ.కె.ఎం.ఎస్‌లో డివిజన్ నాయకుడిగా పని చేశాడు. దమ్మాయిగూడెం భూస్వామికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాల్గొన్నాడు. సారా కాంట్రాక్టర్ల దోపిడీ దౌర్జన్యానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలోను, ఖమ్మం మార్కెట్‌లో రైతాంగానికి జరుగుతున్న అన్యాయాలపై మొదటి కరపత్రం మునాయిదా తానే వ్రాసాడు. ప్రతిగ్రామానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. అలాగే పిండిప్రోలుకి ప్రత్యేకత ఉన్నది. గ్రామ అభివృద్ధిలోను, ప్రజా ఉద్యమాలకు సమిష్టిగా సహకరించే ధోరణి అది. అది విప్లవోద్యమ అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నది.

వాసయ్య గ్రామ అభివృద్ధిలో ముఖ్య పాత్ర వహించాడు. కళాశాల నిర్మాణకృషిలో భాగం పంచుకోవడంతో పాటు, తన భూమిని కళాశాలకు ఇచ్చాడు. పిండిప్రోలు సహకార సొసైటీ అధ్యక్షుడుగా రెండు టర్ములు 10 సంవత్సరాలకు పైగా పని చేశాడు. జిల్లాలో మోడల్ సొసైటీగా అభివృద్ధి చేసిన రికార్డు ఉన్నది. రాజ్యవ్యవస్థలోని పదవులలో మన లాంటి వారం ఎక్కువ సార్లు ఉంటే బూర్జువా లక్షణాలు అంటుకొంటాయని వాదించేవాడు. గ్రామంలో పార్టీ అభ్యర్ధులను గెలిపించడానికి వృద్ధాప్యాన్ని లెక్క చేయకుండా కృషిచేశారు. వివిధ సందర్భాలలో పోలీస్ నిర్భాందాన్ని ఎదుర్కొన్నారు. కేసులు ఎదుర్కొన్నారు. ఒకటి, రెండు సందర్భాలలో తీవ్ర చిత్రహింసలకు గురయ్యాడు.

వాసయ్య చివరి దాకా కమ్యూనిస్ట్ విప్లవ రాజకీయాలలో ముఖ్యుడుగా వున్నాడు. విప్లవ రాజకీయాలలో నిర్మాణం ముఖ్య అవసరమని ఎప్పుడూ చెపుతూ ఉండేవాడు. గ్రామములో పార్టీ నిర్మాణానికి ప్రాధాన్యాన్ని ఇచ్చేందుకు కృషిచేశాడు. ఆలాగే పార్టీ, గ్రామ ఆర్థిక వ్యవహారాలు నిర్వహణలో నిక్కచ్చిగా వుండేవాడు.

కామ్రేడ్ వాసయ్య గారి మరణం చాలా విచారకరం. ఆయన చివరిదాకా నిలిపిన నిబద్ధత ఆదర్శనీయం. ఆయనకు సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ విప్లవజోహార్లు తెలుపుతుంది. వారి కుటుంబాలకు, సన్నిహిత సహచరులకు సానుభూతి తెలుపుతుంది.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ**

# నవంబర్ 26 న సార్వత్రిక సమ్మెకు సన్నద్ధమవుతున్న కార్మిక వర్గం, రైతాంగం



నవంబర్ 26 న దేశవ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఐ.ఎఫ్.టి.యు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో సమావేశాలు, సదస్సులు, ర్యాలీలు, పోస్టర్ ఆవిష్కరణలు జరిగాయి. ఇప్పూ రాష్ట్ర కమిటీ ప్రచురించిన" ***కార్మికవర్గం పై దాడికే నాలుగు లేబర్ కోడ్ లు" "లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పోరాడండి"*** అనే పుస్తకాన్ని పలుచోట్ల ఆవిష్కరించి వేల కాపీలను కార్మికవర్గం మధ్యకు తీసుకెళ్ళారు. సార్వత్రిక సమ్మెకు మద్దతుగా కార్మికవాడలు, ఇండస్ట్రియల్ ఏరియాలలో గ్రూపు మీటింగ్‌లు, ర్యాలీలు, వీధి ప్రచారాలు సాగుతున్నాయి. అదేవిధంగా మోడీ ప్రభుత్వం తెచ్చిన 3 రైతాంగ వ్యతిరేక వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏ.ఐ.కె.ఎస్.సి.సిలోని భాగాస్వామ్య సంఘమైన ఏ.ఐ.కె.ఎం.ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు జిల్లాల్లో సమావేశాలు, సభలు జరుపుతున్నారు. నవంబర్ 26, 27 తేదీలలో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే ఆ రోజులలో రాష్ట్రంలో రైతాంగానికి మద్దతుగా విస్తృతంగా ఆందోళనా కార్యక్రమాలు చేయడానికి రైతాంగానికి సన్నద్ధం చేసే కృషిలో నిమగ్నమైంది.

## మోడీ ప్రభుత్వ 3 వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏ.ఐ.కె.ఎస్.సి.సి ఇచ్చిన దేశ వ్యాపిత పిలుపు అమలు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన 3 రైతాంగ వ్యతిరేక వ్యవసాయ చట్టాలను, విద్యుత్ సంస్కరణల చట్టాలను రద్దుచేయాలని, డిమాండ్ చేస్తూ ఎ.ఐ.కె.ఎస్.సి.సి. దేశవ్యాపితంగా రాస్తారోకోలు, ఆందోళనా కార్యక్రమాలు చేయమని పిలుపు నిచ్చింది. ఈ పిలుపులో భాగంగా జిల్లాల్లో పలు చోట్ల ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు జరిగాయి.

విజయనగరం జిల్లా : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన 3 రైతాంగ వ్యతిరేక వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఎ.ఐ.కె.ఎస్.సి.సి. ఇచ్చిన దేశవ్యాపిత ఆందోళనా పిలుపులో భాగంగా విజయనగరం జిల్లా జియ్యమ్మవలస మండలం పరజపాడు, పెదకుదుమ గ్రామాల్లో నిరసన ప్రదర్శనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ కె.ఎం.ఎస్ జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.జయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు జె.సింహాచలం, జిల్లా జిసి సభ్యులు వి.సీతయ్య గ్రామ కమిటీల సభ్యులు ఈశ్వరరావు, పార్వతి, వెంకటి మరియు రైతు కూలీలు, ఆదివాసీలు పాల్గొన్నారు.

తూ.గో.జిల్లా : కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను బలపరుస్తూ, కేంద్ర ప్రభుత్వ మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని తదితర డిమాండ్ల సాధనకై నవంబర్ 26, 27 ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తే.13-11-2019న రంపచోడవరం స్థానిక బస్టాండ్ వద్ద నుండి ప్రదర్శన చేసి అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఏ.ఐ కె.ఎం.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సైనం ఆశారత్నం, కోశాధికారి పండేల సోమన్న, జిల్లా నాయకులు పి.పాపన్న, వి.రాజబాబు, జి.సూరిబాబు, బసవయ్య, దుర్గారావు, వెండేల కోమటయ్య, కొండపల్లి శంకరయ్య, చోంట్రు బుల్లెమ్మ తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

ప॥గో॥జిల్లా : ఎ.ఐ.కె.ఎస్.సి.సి పిలుపుపై నూతన వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తూ ఏజన్సీ ప్రాంతం బుట్టయిగూడెంలో ఎ.ఐ.కె.ఎం.ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేసారు.



బుట్టాయగూడెం



పరజపాడు


పెదకుదుమ



రంపచోడవరం

## తుఫాన్‌ల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారంకై ఆందోళనలు

కోడూరు : కృష్ణా జిల్లా దివిసీమ ఏరియా కోడూరు మండల కార్యాలయం ముందు రైతు సంఘాల ఆధ్వర్యంలో తే.28-10-20న తుఫాన్‌ల వల్ల ముంపుకి గురైన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ధర్నా జరిగింది. ఈ ధర్నాలో ఏ.ఐ.కె.ఎమ్.ఎస్ నాయకులు జనార్ధన్, ఈశ్వర్రావు, శివాజీల నాయకత్వంలో 30 మంది రైతులు పాల్గొన్నారు.

కొవ్వూరు : ప.గో.జిల్లా కొవ్వూరు, పసివేదల, నందమూరు ప్రాంతాలలో తుఫానుల వలన వరి పొలాలు, బొప్పాయి, అరటి, క్యాబేజీ, తదితర పంటలు నీట మునిగి తీవ్రంగా దెబ్బతిన్నాయి. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఐఎఫ్టియు, పి.డి.ఎస్.యు, పి.ఓ.డబ్ల్యు, పోరహక్కుల సంఘం బృందం పర్యటించింది. పంటలు నష్టపోయిన రైతాంగానికి పూర్తి పంట నష్ట పరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ నాయకులు చీర అప్పారావు, సి.ఎల్.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీమన్నారాయణ, పి.డి.ఎస్.యు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంబూరి మహర్షి, ఐ.ఎఫ్.టి.యు నాయకులు ఎం రాజు, పి.ఓ.డబ్ల్యు నాయకురాలు ఈమని మల్లిక తదితరులు బృందంలో ఉన్నారు.


కోడూరు



కొవ్వూరు

## పట్టాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని ఆలమూరులో ధర్నా

తూ.గో.జిల్లా : మండల కేంద్రమైన ఆలమూరులో తాసిల్దార్ కార్యాలయం వద్ద అఖిలభారత రైతుకూలి సంఘం ఆధ్వర్యంలో తే.25-9-20న ఎర్ర కాలనీ ప్రజలు తమకు పట్టాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని, ఎర్ర కాలనీ పేరును మార్చే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా నాయకులు జి. సూరిబాబు. చంటి, నాగమణి, శ్రీనివాస్, సత్యవతి, పద్మావతి, లక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.



## మేనేజ్‌మెంట్ డైట్ విద్యార్థులకు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని ఆందోళన




రాష్ట్ర వ్యాప్తంగా 2018-20 విద్యా సంవత్సరానికి చెందిన డైట్ మేనేజ్మెంట్ విద్యార్థులకు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కర్నూలు నగరంలో పీ.డీ.ఎస్.యు, ఏ.ఐ.ఎస్.ఎఫ్, ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. 2018-2020 సంవత్సరంలో టి.టి.సిలో మేనేజ్మెంట్ కోటాలో మరియు స్పాట్ అడ్మిషన్‌లో కాలేజీలో చేరి చదివినటువంటి విద్యార్థులకు ఎగ్జామ్స్ నిర్వహించకపోవడం చాలా హేయమైన చర్య అని, జీవో నెంబర్ 30ని అడ్డు పెట్టుకొని సుమారు 22 వేల మంది విద్యార్థుల జీవితాలని నాశనం చేయడం అన్యాయమని నినదించారు. కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వారోత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి మరియు మంత్రి గుమ్మనూరు జయరాంల కాన్వాయ్‌ని విద్యార్థులు అడ్డగించి మాకు న్యాయం జరిపించాలని, వెంటనే పరీక్షలకు అనుమతులు ఇప్పించాలంటూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. 12 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యు జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర బాబు, శరత్ బాబు, సూర్య ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజులలో 50% రాయితీ కల్పించాలి!




రాయలసీమ జిల్లాలోని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో 50% ఫీజు రాయితీ ఇవ్వాలని అనంతపురంలోని అర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో పి.డి.ఎస్.యు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ యనుముల డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఎస్సీ, ఎస్టీలకు 25% ఉచిత విద్య అందించాలని ఉత్తర్వులు ఉన్నా అమలుచేయడంలేదని, 50% రాయితీ కల్పించి, పేద బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ అడ్మిషన్ల కట్టడికై తీసుకొచ్చిన జీ.ఓ.నెం 23 పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు బి.భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేసుల కోసం కేంద్రంతో రాజీపడి నిధులకోసం మోటారు రంగం పై వేసిన పెనాల్టీలు రద్దీ చేయాలని ఇఫ్టూ కార్మికుల ధర్నా



మోటారు రవాణా రంగంపై పదుల రెట్లు పెనాల్టీలు పెంచుతూ మోటారు రవాణా రంగంపై అధిక భారాలతో అక్టోబరు 21న జగన్ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 21ని రద్దు చేయాలని డిమాండు చేస్తూ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో తే విజయవాడ ధర్నా చౌక్‌లో ఆటో, లారీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జీఓ రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు ముని శంకర్, పి ప్రసాదరావు, ఆటో యూనియన్ నాయకులు సీహెచ్ పెద్దిరాజు, శ్రీధర్, పింగళి రమణ, యాదగిరి, వై అప్పారావు, రఫీ, రౌతు శ్రీనివాసరావు లారీ యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, విఅరెల్ నాగేశ్వరరావు వివిధ ఆటో స్టాండ్ల నాయకులు పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నవంబర్ 26న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సదస్సు





కార్మిక హక్కులను, రైతాంగ ప్రయోజనాలను హరించే కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 26న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలనే అంశంపై ది.31-11-2020న ఏలూరులో యం.వెంకటేశ్వర్లు (ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు) అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఇఫ్టూ జాతీయ కార్యదర్శి, రాష్ట్రఅధ్యక్షులు పి.ప్రసాద్ ప్రసంగించారు. సార్వత్రిక సమ్మె సన్నాహకంగా అక్టోబరు 31న పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో మర్చంట్ ఛాంబర్ హాలులో జరిగిన ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న ఐ.ఎఫ్.టి.యు. కామ్రేడ్ పి ప్రసాద్(పి.పి) మాట్లాడుతూ "కార్మికవర్గం తరతరాలుగా రక్తతర్పణలు,ప్రాణార్పణల ద్వారా సాధించుకున్న44 కార్మిక చట్టాలను 4లేబర్ కోడ్ ల పేరుతో రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ, రైతులను కార్పొరేట్ శక్తుల సంకెళ్లకు బంధిస్తూ తెచ్చిన మూడు నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండు చేసారు.

ఇంకా ఈ సభలో మరో అతిథిగా పాల్గొన్న ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,పెన్షనర్ల ఐక్యకార్యాచరణ కమిటీ (జేఏసీ) జిల్లా చైర్మన్ ఆర్.ఎస్.హరనాథ్, ఏ.పి.టి.ఎఫ్ రాష్ట్ర నాయకులు సాల్మన్ రాజు, రాష్ట్ర కార్యదర్శి ఆర్.హరికృష్ణ రాష్ట్ర కోశాధికారి యు.వెంకటేశ్వరరావు(యు.వి) తదితరులు ప్రసంగించారు.

# ప్రొ.సాయిబాబా ఆమరణ దీక్షకు మద్దతుగా, రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలని సభలు



రాజకీయ ఖైదీల హక్కులు అమలు చేయాలని, జైలులో ప్రొఫెసర్ సాయిబాబా చేస్తున్న ఆమరణ దీక్షకు మద్దతుగా అక్టోబర్ 22 న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఉపా రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రాజకీయ ఖైదీల హక్కులు అమలు చేయాలని, "ఉపా" చట్టం రద్దు చేయాలని, సాయిబాబా గారితోపాటు మేధావులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర జైలులో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రొఫెసర్ సాయిబాబా లేవనెత్తిన డిమాండ్లను పరిష్కరించి, దీక్షను విరమింప చేయాలని కోరుతూ విశాఖలో పౌర ప్రజా సంఘాలన్నీ వి.జె.యఫ్ ప్రెస్ క్లబ్‌లో 21.10.2020న ప్రెస్ మీట్ నిర్వహించాయి.



## దివ్య తేజస్విని హత్యను నిరసిస్తూ ప్రజా సంఘాల ధర్నా

దివ్యతేజస్విని హత్యను నిరసిస్తూ తే.16-10-20న శుక్రవారం విజయవాడ లెనిన్ సెంటర్లో పిఓడబ్ల్యూ, ఇఫ్టూ, పి.డి.ఎస్.యు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ దర్నాలో పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు గంగాభవాని, పి.డి.ఎస్.యురాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర, ఇఫ్టూ నగర కార్యదర్శి పి ప్రసాదరావు పిఓడబ్ల్యూ నాయకులు పద్మ, దుర్గ, సుజాత, జ్యోతి, నాగమణి ఇఫ్టూ నాయకులు దాది శ్రీనివాసరావు, పెద్దిరాజు, కామేష్, యాదగిరి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు



## మహిళలపై అత్యాచారాలు, హత్యలకు వ్యతిరేకంగా బుట్టాయగూడెంలో భారీ ప్రదర్శన



మహిళలపై సాగుతున్న అత్యాచారాలు, హత్యలకు వ్యతిరేకంగా పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం బుట్టాయగూడెంలో పి.ఓ.డబ్ల్యూ ఆధ్వర్యంలో వందలాది మహిళలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై రోజు రోజుకి అత్యాచారాలు, హత్యలు సాగుతున్నా పాలకులు దోషులను కఠినంగా శిక్షించడం లేదని సంఘం నాయకులు విమర్శించారు.

## దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ధర్నా

దళిత, గిరిజన, మహిళలు, మైనార్టీలపై అత్యాచారాలు, హత్యలు అరికట్టాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తే.13.10.2020న కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేశ్వర్లు, ఏఐకెఎంఎస్‌జిల్లా నాయకులు వి.రాజబాబు, మక్దూమ్, సిఐటియు నాయకులు వీరలక్ష్మి, ఐఎన్టియుసి నాయకులు తాళ్లూరు రాజు, ఏఐటియుసి నాయకులు తోకల ప్రసాదు, ఆర్‌కెపి నాయకులు కాశీ బాలయ్య, ఐద్వా నాయకులు రమణి తదితర సంఘాల నాయకులు నాయకత్వం వహించారు. వివిధ సంఘాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## కులం పేరుతో దూషించి దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని ధర్నా



తూ.గో.జిల్లా రాయవరం మండలం మాచవరం గ్రామంలో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న లంక వెంకటరమణను కులం పేరుతో దూషించి దౌర్జన్యంగా దాడి చేసిన బట్టి ఒనర్ శివారెడ్డిని అరెస్టు చేయాలని, వెంకటరమణకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఏ.ఐ.కె.ఎం.ఎస్ ఆధ్వర్యంలో రామచంద్రాపురం ఆర్డీవో కార్యాలయం ముందు తే.3-10-20న ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు.

## ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం కర్నూలు జిల్లా జనరల్ కౌన్సిల్



కర్నూలు నగరంలో గోకారి భవన్ నందు ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం జిల్లా జనరల్ కౌన్సిల్ జరిగింది. ఈ కౌన్సిల్ కు నగర కార్యదర్శి టి.తిరుపాల్ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా రాష్ట్ర కన్వీనర్ దాది శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కౌన్సిల్‌లో జిల్లా కన్వీనర్‌గా టి తిరుపాల్ ముఖ్య సభ్యులుగా అంజి, సాజిద్, గోపాల్, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, మునీర్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మోటారు కార్మికులపై అత్యధిక పెనాల్టీలు వేసే జీ.ఓ 21 రద్దుచేయాలని కోరారు.

# రాష్ట్ర జె.ఏ.సి పిలుపు - బి.ఓ.సి కార్మికుల సమస్యలపై రాష్ట్ర మంత్రుల కార్యాలయాల ముట్టడి



విజయవాడ


తిరుపతి



రామచంద్రాపురం



ఏలూరు



నెల్లిమర్ల



కొవ్వూరు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం, గత చంద్రబాబు ప్రభుత్వం దారి మళ్లించిన నిర్మాణ కార్మికుల నిధులు మొత్తం తిరిగి సంక్షేమ బోర్డుకు జమచేయాలనీ, నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల క్లైమ్స్ వెంటనే మంజూరు చేయాలనీ, ఇసుక కొరత మరియు కరోనా వల్ల ఉపాధి కోల్పోయిన నిర్మాణ కార్మికులకు 10వేలు చొప్పున చెల్లించాలనీ, ఇసుక కొరతను నివారించి, కార్మికుల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర జె.ఏ.సి రాష్ట్ర వ్యాపితంగా నవంబర్ 17న రాష్ట్ర మంత్రుల కార్యాలయాలను ముట్టడించి ఆందోళన చేయాలని పిలుపునిచ్చింది. ఈ పిలుపు ననుసరించి రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఆందోళనా కార్యక్రమాలు జరిగాయి.

ఏలూరు : ఐ.ఎఫ్.టి.యు, ఎ.ఐ.టి.యు.సి, సి.ఐ.టి.యుల ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని ఇంటి వరకూ జరిగిన భారీ ర్యాలీ తీసి, మంత్రి కార్యాలయం వద్ద బైఠాయింపు చేసారు. మంత్రిగారు లేకపోవటంతో పి.కి వినతి పత్రం అందజేశారు.

కొవ్వూరు : ఐ.ఎఫ్.టి.యు, సి.ఐ.టి.యు, పి.కె.ఎస్ మరియు భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జె.ఏ.సి పిలుపు మేరకు కొవ్వూరులో మంత్రి తానేటి వనిత గారి క్యాంప్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు జిల్లా అధ్యక్షులు కె.వి.రమణ, ఐ.ఎఫ్.టి.యు నాయకులు పి. నాగేశ్వరరావు, ఈమని గ్రీష్మ కుమార్, సి.ఐ.టి.యు సుందర బాబు, పి.కె.ఎస్ నాయకులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి : తిరుపతిలో ఐ.ఎఫ్.టి.యు, ఎ.ఐ.టి.యు.సి, సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారి ఇల్లు ముట్టడి చేసారు. ఈ సందర్భంగా పోలీసులు 50మందిని అరెస్ట్ చేసి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు

కాకినాడ : భవన నిర్మాణ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం మంత్రిని కలవనీయకుండా కాకినాడలో కార్మిక సంఘాల నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేసారు. ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లును తను ఇంటి దగ్గర లేకపోయినా తే.16-11-2020 రాత్రి నుండి సిఫ్టుల వారీగా పోలీసులు కాపలా కాసారు. భవన నిర్మాణ కార్మికుల డిమాండ్ల సాధనకు మంత్రిని కలిసేందుకు, కార్మికుల ప్రదర్శనకు అనుమతించలేదు.

రామచంద్రాపురం : రామచంద్రపురంలో భవన నిర్మాన కార్మికులు ర్యాలీ తీసి స్థానిక మంత్రి చెల్లిబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ ఇంటివద్ద ధర్నా కార్యక్రమం చేసారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు నాయకులు జి. సూరిబాబు, సి.టి.యు నాయకులు కె. కృష్ణవేణి, ఎం.వి. రమణ, ఎ.ఐ.టి.యు.సి నాయకులు పి.రాము పాల్గొన్నారు. బిల్డింగ్ సంఘాల నాయకులు అప్పరి శ్రీను, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ : విజయవాడలో ర్యాలీ తీసి మంత్రి వెల్లంపల్లి ఆఫీసుకు సిఐటియు, ఏఐటీయూసీ, ఐ.ఎఫ్.టి.యూ, ఏ.సీ.సీ.టు.యు సంఘాల ప్రతినిధులు వెళ్ళి మిమొరాండం ఇచ్చారు.

విజయనగరం : విజయనగరంలో మంత్రి బోత్స సత్యనారాయణగార్కి వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు. నాయకులు పి.మల్లిక్, కె.సింహాచలం, కె.పైడిరాజు ఎ.ఐ.టి.యు.సి నాయకులు పడాల రమణ, వి.క్రిష్ణంరాజు, సి.ఐ.టి.యు నాయకులు టి.వి.రమణ, ఎ.జగన్మోహన్ తధితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో బిఒసీ కార్మికుల సమస్యలపై సదస్సు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై కాకినాడ ఎన్జీవో హోంలో అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తే.20-10-2020న జిల్లా సదస్సు జరిగింది. ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, ఏ.ఐ.టీ.యూ.సీ రాష్ట్ర నాయకులు పడాల వెంకటరమణ, సిఐటియు నాయకులు చెక్కల రాజ్ కుమార్, ఎ.ఐ.టి.సి.సి.యు నాయకులు గొడుగు సత్యనారాయణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఐ.ఎఫ్.టి.యుతో సహ వివిధ సంఘాల నుండి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



# రాష్ట్ర వ్యాపితంగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పిస్తూ సాగిన సంస్మరణ సభలు

నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరిలోయ తదితర విప్లవోద్యమాలలో అమరులైన వీరులను స్మరిస్తూ ప్రతీ సంవత్సరం అక్టోబర్ 31 (శ్రీకాకుళలోద్యమ తొలి అమరవీరులు కొరన్న, మంగన్నల అమరత్వం పొందిన రోజు) నుండి నవంబర్ 9 (కా.చంద్ర పుల్లారెడ్డి అమరుడైన రోజు) వరకు రాష్ట్ర వ్యాపితంగా సంస్మరణ కార్యక్రమాలు జరపమని సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఏ.పి రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా జిల్లాల్లో పలుచోట్ల సంస్మరణ కార్యక్రమాలు జరిగాయి.

తే.9.11.2020 (విశాఖ) గాజువాకలో జరిగిన కా॥ చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభలో సీపీఐ (యం.యల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి కామ్రేడ్ వై కొండయ్య, భా.నా.స రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీ రామ్మూర్తి, ఐ.యఫ్.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.వెంకటేశ్వర్లు, కె.నిర్మల (అరుణోదయ), యస్.వెంకటలక్ష్మి (పి.ఓ.డబ్ల్యు) మాట్లాడారు.

విజయనగరం జిల్లాలో తే.31-10-20న పార్వతీపురంలోని కళాసీ సెంటర్లలో, ఇదే రోజు సాయంత్రం పార్వతీపురం మండలం నిడికివలసలో, 1-11-20న కొమరాడ మండలం బంజుకుప్ప, బుర్జివలస గ్రామాల్లో, 6-11-20న కురుపాం మండలం బల్లుగూడలో, తే.8-11-20న జియ్యమ్మవలస మండలం పెదకుదుమ, పరజపాడు గ్రామాల్లో సంస్మరణ కార్యక్రమాలు జరిగాయి. ఎస్.జయలక్ష్మి, (ఏ.ఐ.కె.ఎం.ఎస్), పి.రమణి, (పి.ఓ.డబ్ల్యూ), జి.సర్వేశ్వరరావు, ఎస్.సర్వేశ్వరరావు (ఐ.ఎఫ్.టి.యు) తదిరులు పాల్గొన్నారు.

ప.గో.జిల్లా : తే.3-11-20న కొవ్వూరులో గోదావరి ఇసుక కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ సభలో అధ్యక్షులు చీర అప్పారావు, పి.నాగేశ్వరరావు (ఐఎఫ్టీయూ), సిహెచ్.రమేష్, ఈమని మల్లిక, నంబూరి మహర్షి తదితరులు ప్రసంగించారు. బుట్టాయిగూడెంలో జరిగిన సభలో ఏ.ఐ.కె.ఎం.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మల సురేష్, నాయకులు పి.శ్రీనివాస్, కె.రాఘువ, రామ్మోహన్ తదితరులు ప్రసంగించారు.

తూ.గో.జిల్లా : తే.7-11-20న వై.రామవరం మండలం గుమ్మరిపాలెంలో, తే.9-11-20న జగ్గంపేటలో, రాజమహేంద్రవరంలో, తే.12.11.2020 రంపచోడవరంలో అమరవీరుల సంస్మరణ సభలు జరిగాయి. న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సైనం ఆశారత్నం, పండెల సోమన్న, జి.సూరిబాబు, ఏ.వి.రమణ, వి.రాజుబాబు, పండేల పాపన్న, కోరాడ అప్పారావు, మల్లవరపు రాజు, గోపి దితరులు పాల్గొని నివాళు లర్పించారు.

విజయవాడలోని ఆఫీస్‌లో అమరులకు ఘనంగా నివాళులర్పించారు.


విశాఖపట్నం


విజయవాడ


బుట్టాయగూడెం


రాజమండ్రి


పార్వతీపురం


బంజుకుప్ప


బుర్జివలస



నిడికివలస


పరజపాడు


పెదకుదుమ


సహపురం


సీతంశెట్టినగర్


గుమ్మరిపాలెం


జగ్గంపేట


కొవ్వూరు

# అక్రమంగా తొలగించిన గ్యాస్ డెలివరీ కార్మికులను పనిలోకి తీసుకోవాలని ఆందోళన





తూర్పుగోదావరి జిల్లా దాక్షారామంలో రవీందర్ ఇండియన్ గ్యాస్ కంపెనీ అక్రమంగా ఎనిమిది మంది కార్మికులనుతొలగించింది. వీరిని తిరిగి పనిలోకి తీసుకోవాలని, మంత్రి గారి అండతో కార్మిక చట్టాలను ఉల్లంఘించిన రవీంద్ర ఇండియన్ గ్యాస్ యజమానిని అరెస్టు చేయాలని, జిల్లా అధికారులు, లేబర్ అధికారులు కార్మిక చట్టాల అమలుకు పూను కోవాలని తదితర డిమాండ్లతో ఆందోళన సాగుతోంది.

తూ.గో.జిల్లా గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టి.యు) ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ వద్ద తే.26.10.2020 ఉదయం నుండి నిరవధిక నిరశనదీక్షలు చేపట్టారు. జిల్లా యంత్రాంగం స్పందించి, తొలగించిన కార్మికులను పనిలోకి పెట్టించాలని కలెక్టర్ గారిని డిమాండ్ చేశారు. వరుసగా 9 రోజులపాటు ఈ నిరసన దీక్షలు సాగాయి. లేబర్ ఆఫీస్‌లో డి.సి.ఎల్ గారి సమక్షంలో రవీంద్ర ఇండేన్‌గ్యాస్ యాజమాన్యానికి, కార్మికులకీ మధ్య చర్చలు జరిగినా యాజమాన్యం కార్మికులను విధుల్లోకి తీసుకోవడానికి అంగీకరించలేదు.

తే.1-11-2020న తూ.గో.జిల్లా గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం కాకినాడ ఎన్జీవో హోంలో జరిగింది. ఈ సమావేశంలో ఆందోళనను ఉధృతం చేయాలని నిర్ణయించారు. 9 రోజులుగా అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కాకినాడ కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరసన దీక్షలు నేపథ్యంలో జిల్లాలోని వివిధ గ్యాస్ కంపెనీల కార్మికులు తమ పనులను బందు చేసి దీక్ష శిబిరం వద్దకు చేరుకుని తే.3.11.2020న కలెక్టరేట్ గేటు వద్ద బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం అఖిలపక్ష బృందం జిల్లా జాయింట్ కలెక్టర్ గారిని కలవగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ గారు హామీ మేరకు కార్మికులు "నిరవధిక నిరసన దీక్షలను" విరమించారు.


రామచంద్రపురంలోని డా॥ చెలికాని రామారావు స్మారక భవనంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. తే.8-11-20న అఖిలపక్ష బృందం ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ గారిని, ఎస్పీ గారిని కలిసి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే బీసీ సంక్షేమశాఖా మంత్రిశ్రీ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గారిని అఖిలపక్ష బృందం కలిసి కార్మికులను విధుల్లో పెట్టించాలని, కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న రవీందర్ నాయక్‌పై చర్యలు తీసుకోవాలని కోరాలని నిర్ణయించారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే అఖిలపక్షం ఆధ్వర్యంలో కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశానికి రాజమండ్రి, కాకినాడ, ద్రాక్షరామ, రామచంద్రపురం, అనపర్తి తదితర గ్యాస్ కంపెనీల యూనియన్ల నుండి కార్మికులు హాజరయ్యారు. గ్యాస్ కార్మికుల ఆందోళన కొనసాగుతోంది.

ఈ ఆందోళనలో ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేశ్వర్లు, తూర్పుగోదావరి జిల్లా గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోరాడ అప్పారావు, కాకినాడ టౌన్ అధ్యక్షులు మాగాపు రాజు, తోకల ప్రసాద్ (ఏ.ఐ.టి.యు సి), ఎన్.వెంకటరమణ (సి.ఐ.టి.యు), జి. ఆదినారాయణ, ఆర్. రఘువులు (ఐఎఫ్టియు ), కే.గంగరాజు (పిడిఎం), వీ.రాజబాబు, జి.సూరిబాబు, పి.బసవయ్య (ఏ.ఐ.కె.ఎమ్.ఎస్), ఎం రాజు (పి.వై.ఎల్) తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. మరియు జనసేన పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ నాయకులు దేగల సతీష్ సంఘీభావంగా పాల్గొన్నారు.

# కొత్తవలస ఉమా జూట్ మిల్లుని ప్రభుత్వం బేషరతుగా తెరిపించాలని జూట్ కార్మికుల ధర్నా

ఇఫ్టూఅనుబంధ జ్యూట్ కార్మిక సంఘాలు తే.16.11.2020న కొత్తవలస తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉమా జ్యూట్ కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించాయి. మొత్తం 11 అంశాలపై మినిట్స్ పూర్వక ఒప్పందం జేసియల్ సమక్షంలో జరిగిందని ఇఫ్టూ యూనియన్ల అధ్యక్షులు వై. కొండయ్య, ఐ.యఫ్.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జ్యూట్ యూనియన్ల ప్రధాన కార్యదర్శి యం. వేంకటేశ్వర్లు తెలిపారు. కార్మికులు ఆ ఒప్పందానికి బద్ధులై వుండి మిల్లును తెరవమని కోరుతూ ఉండగా, యాజమాన్యం కొత్త కొత్త షరతులను, వాదనలను ముందుకు తెచ్చి తే.19-09-2019 నాడు జరిగిన సఖ్యమైన ఒప్పందాన్ని ఉల్లంఘించి మిల్లు మూతను కొనసాగిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని మిల్లుని బేషరతుగా తెరిపించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ని విచ్ఛిన్నం చేయడానికి యాజమాన్యం చేస్తున్న చట్ట విరుద్ధ చర్యలను నిరోధించి, ఐ.డి యాక్టు లోని అన్ఫెయిర్ లేబర్ ప్రాక్టీసెస్‌లో పేర్కొన్న క్రిమినల్ నేరాల ప్రకారం యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో కొత్తవలస జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు టి.రామసత్యం, కార్యదర్శి కె.నాగభూషణ రావు, కోశాధికారి వి వెంకట్రావు, ఉమా జూట్ ప్రొడక్ట్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు యల్. త్రిమూర్తులు, కమిటీ సభ్యులు ఈశ్వర్ రావు, జిల్లా కమిటీ సభ్యులు దన్నిన శ్రీనివాసరావు, చింతల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



" కార్మికవర్గాన్ని తర్ఫీదుచేయడం లోనూ, సంఘటితం చేయడం లోనూ మనం చెయ్యవలసింది ఇంకా చాలా వుంది. "

**- లెనిన్**

## కామ్రేడ్ గరిమెళ్ళ నరసింహారావుకి విప్లవ జోహార్లు!




కామ్రేడ్ గరిమెళ్ళ నరసింహారావు గారు సత్తుపల్లి నివాసి. దీర్ఘకాలంగా అక్కడే వున్నారు. గరిమెళ్ల గారు విద్యార్థి దశ నుంచే విప్లవ రాజకీయాలలో పాల్గొన్నారు. విద్యార్థి దశలో ఆనాటి నక్సల్బరి విప్లవ రాజకీయాలతో ప్రభావితమైనారు. కొత్తగూడెంలో కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆ తరువాత బత్తుల అమరత్వం ఆయనను మరింత క్రియాశీలం చేసింది. ఆ తరువాత కామ్రేడ్ రవన్న సహచర్యంతో ముందుకు సాగాడు. ఆ క్రమంలో పోలీస్‌లు అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టారు. ఆ చిత్ర హింసలకు ఆయన కాలు తీవ్రంగా దెబ్బతింది. అది జీవిత కాలం ఆయనను అవిటీ వానిని చేసింది. అయినా ఆయన ఎలాంటి లొంగుబాటును ప్రదర్శించలేదు. విప్లవ రాజకీయాలలో దృఢముగా నిలబడ్డారు. ఎమర్జెన్సీకి ముందూ, ఎమర్జెన్సీ కాలంలో నూ, ఆ తరువాత విప్లవ రాజకీయాలలో దృఢముగా నిలబడ్డాడు. సత్తుపల్లిలో బత్తుల మెమోరియల్ ట్రస్టు స్థాపించి 4 దశాబ్దాలుగా దానిని ఆదర్శప్రాయంగా నడిపించడంలో ఆయనది ప్రధాన పాత్ర.

కామ్రేడ్ నరసింహారావు గారి సహచరి ఇటీవలే 6నెలల క్రితం మరణించారు. ఆ ప్రభావం ఆయన జీవితంపై చాలా వున్నది. శేష జీవితం గడిపే అవకాశంలో కొంత ఇబ్బంది పడుతున్నారు. ఈ మధ్యనే వరంగల్‌లో వృద్ధుల ఆశ్రమంలో చేరారు. ఆ ఆశ్రమంలోనే రాత్రి గుండె పాటు వచ్చి మరణించారు. అంతకు ముందే బి.పి, సుగర్ వ్యాధులతో బాధపడుతున్నారు. వాటికి తోడుగా గుండె జబ్బు ఆయనను నిర్జీవంగా మార్చింది. సుదీర్ఘకాలం విప్లవ రాజకీయ జెండాతో, నిబద్ధతో నిలబడటం గొప్ప విషయం. కామ్రేడ్ గరిమెళ్ల గారికి విప్లవ జోహార్లు!

**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ - ఆం.ప్ర. రాష్ట్ర కమిటీ**

( 24వ పేజీ తరువాయి )

ఈ పోరాటంలో మరింత చురుకుగా పాల్గొనాలి. న్యాయమైన ధరలపై మన డిమాండ్లు సాధించుకోవడానికి ఇదే అదును.

### ఏ.ఐ.కె.ఎస్.సి.సి. రైతు సంఘాల ముఖ్య డిమాండ్లు

*1. కేంద్రం తెచ్చిన 3 కార్పోరేట్ వ్యవసాయ చట్టాలను రద్దు చెయ్యాలి. విద్యుత్తు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి.*

*2. కనీస మద్దతు ధరలను గ్యారంటీ చేసే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తేవాలి. అమలు చెయ్యడానికి తగినన్ని నిధులను కేటాయించాలి.*

*3. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పంటలలోను మద్దతు ధర అందే విధంగా కొనుగోలు లేదా మార్కెట్ జోక్యం పథకాలను అమలు చెయ్యాలి. మన రాష్ట్రంలో ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ ఉన్న పంటలకు పర్యావరణను కూడా దృష్టిలో పెట్టుకొని బోనస్, ప్రోత్సాహకాలు కల్పించాలి.*

*4. రాష్ట్రంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి. అన్ని పంటలు ఎం.ఎస్.పి.కి ప్రభుత్వం కొనుగోలు చేయాలి.*

*5. కేంద్రం తెచ్చిన 3 చట్టాలను తిరస్కరిస్తూ, రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ (ఎ.పి.ఎం.సి.) చట్టం పరిధిలోకి రాష్ట్రం మొత్తాన్ని తెస్తూ, ఎం.ఎస్.పి. గ్యారంటీ చేస్తూ చట్టం సవరిస్తూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానం చెయ్యాలి.*


**నవంబర్ 5 : దేశవ్యాప్తంగా రాస్తారోకో కార్యక్రమాలు, నవంబర్ 26, 27: ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఆందోళన కార్యక్రమాలు జరపాలి!**

**అఖిల భారత రైతాంగ పోరాట సమన్వయ సమితి (ఏ.ఐ.కే.ఎస్.సి.సి.) ఆం.ప్ర. కమిటీ**

## నవంబర్ నెలలో అమరులైన శ్రీకాకుళోద్యమ యోధులకు విప్లవ జోహార్లు!






*మహత్తర శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటంలో 1969 నవంబర్ నెలలో 22 న కామ్రేడ్స్ తామాడ గణపతి, డాక్టర్ చాగంటి భాస్కరరావు, గొరకల సన్యాసి, కంచారపు కృష్ణమూర్తి, నవంబర్ 9న నతాల జోగులు, కొండగొర్రి కింటు, నవంబర్ 15న ఆరిక తాడ్డి మరియు పేరు తెలియని మరో ఆదివాసీ కామ్రేడ్ ప్రభుత్వ బూటకపు ఎదురుకాల్పులలో అమరులయ్యారు. 51వ వర్ధంతి సందర్భంగా వారికి అరుణారుణ జోహార్లు!*

## బి.ఓ.సి కార్మికుల సమస్యలపై రాష్ట్ర మంత్రికి వినతిపత్రం


విజయనగరం జిల్లా, నెల్లిమర్ల లో పర్యటించిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ గారికి భవన నిర్మాణ సంక్షేమ మండలిపై జీవో 17, ఆటో, మోటారు రవాణా రంగంపై జీవో 21లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చింది. వీటిని వెనక్కి తీసుకోవాలని మరియు నెల్లిమర్ల ఇండస్ట్రీయల్ ఏరియాలో బిపాసా ట్రేడ్ లింక్ యాజమాన్యం అక్రమంగా తొలిగించిన ఇరవై మంది కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ వేర్వేరు గా వినతి పత్రాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు పి.మల్లిక్, కె.సింహాచలం, అవనాపు మేఘనాథ్, బి.శ్రీను, వి.చంద్రశేఖర్, జె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### వెలువడినవి!




కార్మిక వర్గంపై దాడికే నాలుగు లేబర్ కోడ్‌లు

### చదవండి!




వ్యవసాయదారుల ఆదాయం పెంపు - మోడీ ప్రభుత్వ మహా మోసం

" మొత్తం మీద ప్రజాస్వామ్యం " అన్నది ఏ నాగరిక పెట్టుబడిదారీ దేశంలోనూ లేదు. ఉన్నదల్లా బూర్జువా ప్రజాస్వామ్యం మాత్రమే!

÷ ÷ ÷ ÷ ÷ ÷ ÷ ÷

సైద్ధాంతికంగా ప్రతీ యుద్ధమూ భిన్నమైన పద్ధతిలో రాజకీయాల కొనసాగింపు మాత్రమే!

– లెనిన్

# కేంద్ర ప్రభుత్వ 3 రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి! కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలి!!

## నవంబరు 5న ఏ.ఐ.కె.ఎస్.సి.సి. ఆధ్వర్యంలో దేశవ్యాపితంగా రాస్తారోకోలు!

## నవంబర్ 26, 27 : చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఆందోళన కార్యక్రమాలు జరపండి!

**రైతులే దేశ యోధులు!** ఈ రోజు దేశాన్ని సంక్షోభ సమయంలో కాపాడుతున్నది రైతులే. కరోనా మహమ్మారి వలన దేశ ఆర్థిక వ్యవస్థ స్తంభించడమే కాకుండా ఎన్నడూలేని విధంగా 24 శాతం కుదించుకుపోయింది. ఇటువంటి స్థితిలో కూడా వ్యవసాయరంగం 4 శాతం వృద్ధి చెందింది! అంటే ఇంత కష్టకాలంలో కూడా రైతులు, వ్యవసాయ కూలీలు దేశానికి ఆహారాన్ని, ఇతర ఉత్పత్తులను అందిస్తున్నారు.

**రైతులే దేశయోధులు!** ఇటీవల మోడీ ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పోరేట్లకు అప్పగించడానికి మూడు చట్టాలను తెచ్చినందుకు అదే రైతులు పెద్దఎత్తున పోరాటానికి దిగారు. కరోనాను కూడా లెక్క చెయ్యకుండా పంజాబ్, హర్యాన రాష్ట్రాలలో వేలాది ట్రాక్టర్లతో ప్రదర్శనలే కాకుండా రెండు వారాలు పూర్తిగా రైల్ రోకో చేశారు. తెలంగాణతో సహా ఇతర రాష్ట్రాలు కూడా సెప్టెంబర్ 25న అఖిల భారత రైతాంగ పోరాట సమన్వయ సమితి (ఏ.ఐ.కే.ఎస్.సి.సి.) ఆధ్వర్యంలో నిరసనలతో హోరెత్తాయి.

**దేశాన్ని కాపాడుతున్న రైతాంగం ఏమి అడుగుతోంది?** "కనీసం మేము కష్టపడి పండించిన పంటలకు న్యాయమైన ధరలు కల్పించండి!" అని. అయితే ప్రభుత్వము ప్రకటించిన కనీస మద్దతు ధరలు కూడా చాలా పంటలలో రైతులకు దక్కట్లేదు. మొక్కజొన్నకి మద్దతు ధర క్వింటాలుకు రూ. 1,850 ఉండగా మన రాష్ట్రంలో రైతులకూ రూ. 1,300 మాత్రమే లభిస్తోంది. పెసర పంట మార్కెట్లోకి వచ్చింది. కనీస మద్దతు ధర రూ. 7,196 ఉండగా రైతులు రూ. 4,022 లకే అమ్ముకోవలసి వస్తోంది. పత్తిలో మద్దతు ధర రూ.5825 ఉండగా సి.సి.ఐ. కొనుగోలు చేయక పోతే రైతుకు రూ. 4500 కూడా రావట్లేదు.

**కేంద్ర ప్రభుత్వము దగా!** రైతుల పేరు చెప్పి కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ల కోసం 3 చట్టాలు తెచ్చింది. రైతులకు సరైన ధరలు కార్పోరేట్ల నుండే అందుతాయని కేంద్రం రైతులను దగాచేస్తోంది. తప్పుడు ప్రచారం చేస్తుంది. రైతుల నిరసనలకి ఆందోళన చెందిన ప్రధాన మంత్రి కనీస మద్దతు ధరల వ్యవస్థ కొనసాగుతుందని చెబుతున్నారు కాని, ఈ చట్టాలలో కనీస మద్దతు ధరలను రైతులకి అందించే ప్రస్తావనే లేదు. కేంద్రం కేవలం పేరుకి "కనీస మద్దతు ధరల"ను ప్రకటిస్తోంది కానీ వాటిని అమలు చేసే బాధ్యత నుండి పూర్తిగా తప్పుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం వరి, కంది, సోయాబీన్, పెసర వంటి కొన్ని పంటలను కొనుగోలు చేస్తామని ప్రకటించింది. కేవలం ఈ పంటలు మాత్రమే కాకుండా మొత్తం పంటలు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.

### మద్దతు ధరలను అన్ని పంటలలో ప్రభుత్వం గ్యారంటీ చెయ్యాలి!

" కనీస మద్దతు ధర " కు అర్థం ఉండాలంటే, దాని కంటే తక్కువగా ధర పడిపోకుండా ప్రభుత్వం గ్యారంటీ చెయ్యాలి. దీనికోసం చట్టం తీసుకురావాలి. అటువంటి బిల్లును ఏ.ఐ.కే.ఎస్.సి.సి. 2018లోనే రూపొందించి పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టింది. కేంద్రం వెంటనే కార్పోరేట్ వ్యవసాయ చట్టాలని రద్దు చేసి **"మద్దతు ధరల గ్యారంటీ చట్టం"** తేవాలి. ఈ చట్టంలో ముఖ్యాంశాలు ఏమి ఉండాలి?

– మార్కెట్ యార్డ్‌లోనైనా, బయటనైనా, కంపెనీ కాంట్రాక్టులోనైనా 'కనీస మద్దతు ధర' కంటే తక్కువగా కొనుగోలు జరగకూడదు. మార్కెట్ యార్డులలో వేలం పాట కనీస మద్దతు ధర నుండే మొదలు కావాలి.

– ఏ పంటలోనైనా మార్కెట్ ధర కనీస మద్దతు ధర కంటే తక్కువ ఉంటే, ప్రభుత్వం మార్కెట్లో జోక్యం చేసి కొనుగోలు చెయ్యాలి. ఇది కేవలం వరి, పత్తి వంటి రెండు మూడు పంటలలోనే కాకుండా కనీస మద్దతు ధర ప్రకటిస్తున్న 22 పంటలలోను అమలు జరగాలి. ప్రభుత్వం కొనుగోలు చెయ్యలేకపోతే, ధరలో రైతుకు కలిగిన నష్టానికి ప్రభుత్వమే పరిహారం ఇవ్వాలి.

– స్వామినాథన్ కమీషన్ సిఫారసు ప్రకారం అన్ని వ్యవసాయ ఉత్పత్తులకీ ఉత్పత్తి ఖర్చుపై 50 శాతం లాభం వచ్చేలా కనీస మద్దతు ధరలు ప్రకటించాలి.

### కేంద్ర కార్పొరేట్ వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి!

కేంద్రం తెచ్చిన 3 చట్టాల వలన చిన్న సన్నకారు రైతులకు రక్షణ లేదుకాని, కార్పోరేట్లకు పూర్తి స్వేచ్ఛ లభించింది. దీనితో అదానీ, అంబానీ వంటి బడా కంపెనీలు వ్యవసాయాన్ని నిర్దేశిస్తాయి. చిన్న రైతులు క్రమంగా వ్యవసాయం వదులుకోవలసి వస్తుంది. ఈ చట్టాల వాస్తవాలు ఈ విధంగా ఉన్నాయి.

– ఇప్పటిదాకా పంటలను నిలువ చేసుకోవడానికి రైతులకి, రైతు సంఘాలకి పూర్తి స్వేచ్ఛ ఉంది. వారికి నిలువ చేసుకోవడానికి గోడౌన్లు, ఆర్థిక సహాయం అందించే బదులు ప్రభుత్వం కార్పోరేట్ల ఆహార నిల్వలపై ఆంక్షలను పూర్తిగా తొలగించింది. దీనితో అదానీ, అంబానీలు తక్కువ ధరలకు రైతుల వద్ద కొని, వినియోగదారులకు ఎక్కువ ధరలకు అమ్మడానికి దారి సులభం అయింది.

– మరొక చట్టం మార్కెట్ యార్డులను నిర్వీర్యం చేస్తుంది. మార్కెట్ యార్డులలో కొన్ని ఇబ్బందులు ఉన్నా, రైతులకి ధరకోసం బేరం ఆడడానికి, అన్యాయం జరిగితే డిమాండ్ చెయ్యడానికి ఒక వ్యవస్థ ఉంది. కొత్త చట్టం ప్రకారం మార్కెట్ యార్డ్ బయట కొనుగోలు చేసే ట్రేడర్లు మార్కెట్‌యార్డు బయట కొనుగోలు చేసేట్రేడర్లు, కంపెనీలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి నియంత్రణ ఉండదు. కాబట్టి ధరలోకాని, తూకంలో కాని, గ్రేడింగ్‌లో కాని, తేమ శాతంలో కాని ఎటువంటి అన్యాయం జరిగినా, కోర్టుకి పోవలసిందే.

– మార్కెట్ యార్డుల బయట రైతులకి ఎక్కువ ధర వస్తుందని ప్రభుత్వం తప్పు ప్రచారం చేస్తోంది. బిహార్ రాష్ట్రంలో 2006 నుండి మార్కెట్ యార్డులను రద్దు చేసారు. వరిలోను, మొక్కజొన్నలోను, దేశమంతటా అత్యంత తక్కువ ధర రైతులకు వచ్చేది బీహార్ రాష్ట్రంలోనే. దానికి కారణం వారికి మార్కెట్ యార్డుల రద్దు చెయ్యడమేనని అక్కడి రైతులు వాపోతున్నారు.

– మార్కెట్ యార్డులను మెరుగుపరచాలి, దళారీల అన్యాయాన్ని అంతం చెయ్యాలి. అయితే మార్కెట్ యార్డులనే నిర్వీర్యం చేస్తే మన రైతుల పరిస్థితి కూడా, బిహార్ లాగానే అవుతుంది.

– ఈ చట్టాలు నిజంగా రైతుల కోసమే అయితే, కాంట్రాక్టు వ్యవసాయ చట్టంలోనూ, మార్కెట్ యార్డుల చట్టంలోనూ, కనీస మద్దతు ధరలను గ్యారంటీ చేసే ఆంక్షను ప్రభుత్వం పెట్టాలి, కానీ ఆ డిమాండ్‌ను ప్రభుత్వం పార్లమెంట్లో ఒప్పుకోలేదు.

### ఆంధ్రప్రదేశ్ రైతాంగం కలిసి పోరాడుదాం! డిమాండ్లను సాధించుకుందాం!

ఢిల్లీలో అక్టోబర్ 27న జరిగిన సమావేశంలో ఏఐకేఎస్‌సీసీతోపాటు పంజాబు నుండి రాజేవాల్, హర్యానా నుండి గుర్నాం సింగ్ ఆధ్వర్యాన వున్న రైతు సంస్థల వేదికల ఉమ్మడి సమావేశంలో పై డిమాండ్ల సాధన కొరకు క్రింది కార్యక్రమాలు కలిసి చేపట్టాలని ఉమ్మడిగా పిలుపు ఇవ్వడం జరిగింది. ఇప్పుడు దేశమంతా రైతులు నిరసనలు జరుపుతున్నారు. రైతులకు ధరలు, మార్కెట్ విషయంలో జరుగుతున్న అన్యాయాలపై చర్చ జరుగుతోంది. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్ రైతులు, వ్యవసాయ కూలీలు

( మిగతాది 23వ పేజీలో)

ప్రచురణకర్త, సంపాదకుడు : వై.సాంబశివరావు, సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ఏ.పి రాష్ట్ర కమిటీ, విజయవాడ, సెల్ : 9440019965